
# సాధన సోపానాలు



స్వామి సుందర చైతన్యానంద

# సాధన సోపానాలు



జ్ఞానబ్రహ్మ

స్వామి సుందర చైతన్యానంద

జీవిత మొక సుదీర్ఘ ప్రయాణము.
కొండదేవుని అండ లేనిదే
సాగని యానము.
బండిపై హాయిగా
పయనించేది కాదు.
బండలపై బరువుగా
నడక సాగించేది.
తెరువు తెలిస్తే బరువు తెలియదు.
బాధ ఉండదు.బాటను తెలిపే మాటే
భవ్యం. దివ్యం.
సాధనామార్గంలో మాటలే
మార్గగాములు.
అవియే సత్య సౌధానికి సోపానాలు.
సాధన సోపానాలు.
మంచి మాట మంచి బ్రతుకు
నందిస్తుంది. పంచన నిలబడి
అంచెలంచెలుగా నడిపించి
అజ్ఞానపు కంచెను దాటిస్తుంది.
దుర్భర జీవన ప్రవాహాలకు
ఎదురొడ్డి, ఎదురీది, గాఢంగా ఢీకున్న
తరంగ తాకిడితో ఎద సౌందర్యాన్ని
అలంకరించుకున్న పూజ్య స్వామి
సుందర చైతన్యానందుల వారి
బ్రతుకు తోటలో విరబూసిన
అనుభవ కుసుమాలే
ఈ సాధన సోపానాలు.
ఆఘ్రాణించండి.

ఆచారము అనుభవము ప్రచారము
సుందర చైతన్య ఆశ్రమం

# సంపేద్యం

రోదనతో అలమటించే జీవునిలో కలిగిన స్పందన తనలో
అవిరళంగా సాగే యాతనను రూపుమాపేందుకు చేయు ప్రయత్నమే
సాధన. సాధనను ప్రయత్నముతో సాగించేవాడు సాధకుడు.
సాధకుడు సాధన ద్వారాచేరు గమ్యమే సాధ్యము.
సాధకుడు పరిమితుడైన జీవుడు. సాధ్యము అపరిమితుడు,
అనంతుడు అయిన భగవానుడు. సాధ్యమును సాధకునిలో
దర్శింపజేసేదే నిజమైన సాధన.
ఈ ప్రపంచ రహదారిలో ప్రతి జీవియు ఒక బాటసారియే.
బాట తెలియక పోయినా దారి చూపేవారు బాహ్య జగత్తులోని
ప్రయాణములో లభిస్తారు. ఆంతర్యములో పయనించడం అంత
తేలిక కాదు. బహిర్ముఖమయ్యే చిత్తమును అంతర్ముఖం చేయడం
అంత సులభ సాధ్యమైన విషయం కాదు. అందుచేతనే ఆధ్యాత్మిక
ప్రయాణము కష్టసాధ్యంగా గోచరిస్తుంది. దుర్లభమైన విషయాన్ని
దక్కించుకొనుటలో చాలా జాగరూకతతో సాధకుడు యత్నించాలి.
ఇవియే సోపానాలు. నిజస్థితి నందుకొనుటకు నిండుగా సహకరించే
నిచ్చెనలు. సాధనను ఋజుమార్గంలో నడిపే సామరస్య సోపానాలు.
సాధన సోపానాలు.
ఒక్కదానిని అధిరోహిస్తే రెండవది సులభ మవుతుంది.
ఆహారము యొక్క రుచి తినడంలో వుంది. సాధనయొక్క రుచి
సాధించడములో ఉంది.
శరత్కాలము సమీపించిందా, నదుల వేగము తగ్గుతూ
ఉంటుంది. శమదమాదులు కలిగాయా, మనస్సులో ఆవేశము
అదృశ్యమవుతూ ఉంటుంది. అభ్యాసముపై ఆనందము ఆధారపడి
ఉంటుంది. సాధనపై సమ్యగ్దృష్టి ఆధారపడి ఉంది.
కళ్ళెము లేని గుఱ్ఱము ఎట్లైనా నడువవచ్చు. నిగ్రహము లేని
మనస్సు ఎలాగైనా చరించవచ్చు. వాదనలను వదిలిపెట్టి సాధనలో
సాగేవారికి బాధలుడిగి, బరువులు దిగి బ్రతుకు ఆనందమయంగా
సాగిపోవును.మంచిమాట మంచి బ్రతుకు నందిస్తుంది. పంచన
నిలబడిమనలను అంచలంచలుగా నడిపించి అజ్ఞానపు కంచెను
దాటిస్తుంది.భక్తులారా! ఈ సాధన సోపానాలు అను పుస్తకము
ముముక్షువు మస్తకాన్ని చక్కగా శుభ్రము చేయగల రసాయనము.
ఆచరించలేని వాళ్ళకు ఎన్నో సూక్తులు ఇందులో పొందుపరచబడి
వాళ్ళకు ఒక్కటి చాలు. అయితే ఇన్ని వందలుఎందుకు వ్రాసినట్లు
అంటారా? ఏదైనది, మీకైనది ఒక్కటయినా ఈ వందలలో అది
ఎక్కడున్నదో అన్వేషించి అందుకుంటారని.అంతే....ఉన్నవి.

ఆచరించే ..ఇట్లు ..సాధకజన నేస్తం..స్వామి సుందర చైతన్యానంద

# సాధన సోపానాలు - స్వామి సుందర చైతన్యానంద

**1** బ్రహ్మమే సత్యము. నీవూ సత్యస్వరూపుడవే. కనుక నీవూ బ్రహ్మమే. నీవు బ్రహ్మమైనచో, సర్వమూ నీవే కాగలగాలి. సర్వమూ నీవు కావడమంటే, సమస్త విశ్వమును నీ స్వరూపముగా దర్శించుటయే. అంతా వీవుగానే యుండినపుడు ఇక నీవు ద్వేషించేది ఎవరిని? మిత్రమా! సర్వ రూపములు నీవే. సర్వ నామములు నీవే.అందరిలో నిన్ను చూచుకొని ప్రేమను పెంచుకో.

**2.**పరిస్థితులు తారుమారుగా గోచరిస్తున్నాయని చెదరిపోకు. నిన్ను తీర్చిదిద్దేందుకే భగవంతుడు వాటిని అలా అమర్చియున్నాడని జ్ఞాపకముంచుకో. భగవద్ప్రసాదముగా లభించిన పరిస్థితులు పవిత్రమైనవియే గనుక ప్రశాంతతతో వాటిని సమీపించేందుకు, వీక్షించేందుకు అలవాటుపడు.

**3.**రోకటిపోటు ననుభవించినా ముక్కలుగాని బియ్యమే అక్షతలవుతున్నాయి. భగవదారాధనకు ఉపయోగపడుతున్నాయి. ముక్కలైన బియ్యమును అక్షతలుగా ఉపయోగించరు. రోకటి దెబ్బల వలె జీవితములో బాధలు పైబడినను అక్షతల బియ్యము వలె విరగని, చెదరని చిత్తమును గలవారే భగవత్ప్రాప్తికి అర్హులగుదురు.

**4.**వడ్లగింజ పైనున్న పొట్టును తొలగించినపుడే మనకు బియ్యపుగింజ. గోచరించును అహంకార మనెడి తొడుగు తొలగినపుడే మనకు ఆత్మానుభూతి కలుగును. మోక్షము నొందగోరు నీకు అహంకారము అడ్డుతెరయై యున్నదని మరచిపోకు.

**5.**మోక్షస్థితిలో కర్మ లేదు. అలాగని కర్మాచరణ యనునది మోక్షానికి ప్రతిబంధకమని భావించకు. బరువైన హృదయంతో కర్మ నాచరించకు. నీ వాచరించు కర్మను భగవానుడు నీ కొసంగిన పవిత్రమైన ధర్మముగా భావించు.అలా భావించి ఆచరిస్తే, కర్మయే నైష్కర్మ్యమవుతుంది. ప్రయత్నించు.

**6.** కల్పవృక్షము క్రింద ఆసీనుడ వైనచో, నీవు సంకల్పించెడి ప్రతివిషయము ఫలించి రూపవంత మగును. నీవు అభిలషించెడి శాంతి మహాత్ముల సాన్నిధ్యములో అడుగనవసరము లేకనే అందించబడును. సాధు సాంగత్యమును సదా పొందియుండుము.

**7.**ఆలోచించి మాట్లాడే అలవాటును కలిగియుండు. అవసరమైన మాటలే మాట్లాడాలి. అర్థయుక్తంగా మాట్లాడ గలగాలి. భావయుక్తమైన పలుకులేనీనుండి కదలాలి. హితవచనములై యుండాలి. అప్పుడే నీ మాటలు వినేవారిహృదయాన్ని కదిలిస్తాయి. జ్ఞానస్వరూపిణి యైన సరస్వతీదేవి హస్తమున వీణగా నిలువవలె నన్నచో ఇదియే చక్కని మార్గము.

**8** .తక్కువగా మాట్లాడే సుగుణమే నీకు ఎక్కువ జ్ఞానము కలదనుటకు నిదర్శనము. నిండుకుండ వలె నిర్వికల్ప శాంతిలో ఉండేందుకు యత్నించు. మౌనము మాటలకన్నా గంభీరముగా మాట్లాడుతుంది.

**9.**బ్రతుకును తారుమారు చేసే సుడిగుండము మనస్సులోనే యున్నదని మరచిపోకు. భావోద్రేకాలకు బానిసవు గాకు. సుఖదు:ఖాలనేవి మనోకల్పితాలు మాత్రమే. మనస్సును సంస్కరించుకుంటే నీవు శాంతిసాగరములో మునక వేయగలవు. నీవు శాంతిలో పవ్వళించగానే సుఖదు:ఖాలతో సహా మనస్సు కూడా అదృశ్యమౌతుంది.

**10.**ఒంటరిగా నీ గదిలో కూర్చుని నీ జీవితములో నీవాచరించిన పవిత్ర

కర్మము లేవైనా ఉన్నవేమో ఆలోచించు. చేసిన నిస్వార్థ సేవా కార్యక్రమము లున్నవేమో చింతించు. ఏమియు లేవని తెలియును. చింతించకు. ఈ క్షణము నుండియే అలాంటి కార్యక్రమములు చేసి భగవానుని తృప్తిపరచేందుకు ఉత్సాహముతో ముందు కురుకు.

**11**.సాధన అతిసున్నితమైనది. సూక్ష్మమైనది. బండబరువును మోసినట్లు సాధన లాచరించకూడదు. మొగ్గ పువ్వుగా మారుట ఎంత సహజముగా యుండునోసాధన అంత సహజముగా, స్వాభావికముగా ఉండాలి. ప్రశాంతముగా మనస్సును వీక్షించగలిగే అలవాటు వలన సాధనలో సహజత్వము తొంగి చూస్తుంది.

**12**.నూనె లేని దీపము ప్రకాశించదు. వైరాగ్యము లేని జీవి ప్రకాశవంతుడు కాలేడు. ఈ ప్రపంచము అనిత్యమనియు, పరమాత్మయే సత్యమనియు దృఢమైన నమ్మిక కల్గి జీవించుటయే నిజమైన వైరాగ్యము.

**13**.చేదు అనుభూతులను చిత్తములో అనుభవించుచున్నను, చిరునవ్వుతో అన్యుల మనస్సులను చిగురింప జేయువాడే చిత్తైకాగ్రత గల సాధకుడు. తన జీవనము మట్టిలో కూరుకుపోయి యున్నను చెట్టు మనకు ఫలముల నొసంగుచునే యున్నది కదా!

**14**. ప్రవహించే జలాన్ని జూచి నదిలోని ఇసుకరేణువులు ఈర్ష్యచెందుటలో ఆశ్చర్య మేమియును లేదు. పరుగిడలేని అశక్తతయే, అసమర్ధతయే ఈ ఈర్ష్యకు కారణము. ఇసుకరేణువుల ఈర్ష్యలు జలప్రవాహాన్ని ఆపగలుగునా? ఓయీ! సాధకా! ఈర్ష్యాజనిత విమర్శలు ఉండనే ఉంటాయి. వాటిని లక్ష్య పెట్టకు.నీ గమ్యస్థానమును చేరేందుకు నదిలా ముందుకు పరుగులిడు.

**15**.ఆశల నుండి విడిపడ గలిగితే తప్పక నీవూ ఆచార్యుడవు కాగలవు. పతనము గాకుండా జీవించ గలిగితే నీవే పరమాత్మవై శోభించగలవు. ఆశలతో పతనము గాకుండా ఆచార్యుడివై పరమాత్మను అనుభవించు.

**16**.ప్రపంచములో నీవు ఉన్నావా? నీలో ప్రపంచము ఉన్నదా? ప్రపంచములోనీవు ఉన్నావని తలచుటయే అజ్ఞానము. సర్వ అనర్థములకు కారణము.ప్రపంచమును గూర్చి నీవు మాట్లాడుచున్నావు. అవన్నియు నీ భావనలే గాని అన్యము గావు. భావములు నీ మనస్సులో యున్నవి. మనస్సు నీ ఆంతర్యములో యుండుటచేత ప్రపంచము కూడా నీలోనే యున్నది.

**17**.మనస్సును పరిశీలించే అలవాటును సాధకుడు కలిగి యుండాలి. పోలీసు వెంబడిస్తున్నాడని తెలియగనే దొంగ పారిపోవునట్లు నీ పరిశీలన మనస్సుకుతెలియగనే అది నీకు చిక్కదు. అతి జాగరూకుడవై యుండాలి. మనస్సు నీకులొంగినంత వరకు దానిని కనిపెడుతూనే ఉండాలి. లొంగినదా! నీవు చెప్పినట్లు విని,నీవు చేయమనిన పని చేయుటకే అది అలవాటు పడుతుంది.

**18**.అసత్యభాషణము చేయకూడదు. అబద్ధమునకు, దొంగతనమునకు పెద్ద తేడా లేదు. చోరుడైనవాడు నవనీత చోరుని పొందలేడు. ప్రతి చిన్న విషయానికికూడా కొందరు అబద్ధా లాడుతుంటారు. ఇది దుర్గుణము. ఆధ్యాత్మిక సాధకుడుసత్యవ్రతుడై యుండాలి.

**19**.సూర్యాస్తమయ సమయాన ఉదయించి, సూర్యోదయ సమయాన
అస్తమించే చీకటికోణము లాంటిది ఈ ప్రపంచము. ఈ
ఉదయాస్తమయాలలో కూడా చావుపుట్టుకలు తెలియని విధముగా
నిత్య జాగరణలో ప్రకాశించే సత్య జ్ఞానపుంజము నీవై యున్నావు.
సత్యరూపుడవైన నీవు రాకపోకలకు వగచెద వేల**?**
**20** నీరు కలిసిన పాలను హంస ముందు ఉంచినచో, అది పాలను
మాత్రమే గ్రహించి నీటిని విడిచి పెట్టును. నీ సమీపానికి వచ్చే ప్రతి
వ్యక్తియునుచెడు కలిసిన మంచివాడే అయి ఉంటాడు.
అతనిలోని మంచిని గాలించిగ్రహించాలి. చెడును విస్మరించాలి.
అప్పుడు నీవూ హంసయే అవుతావు. కాదు;పరమహంసవు అవుతావు.
**21**.తినడం తెలిసినవాడు మందు తిననవసరము లేదు. మాట్లాడటం
చేతనయినవాడు పోట్లాడ పనిలేదు. దండిగ తినటం వలన అనారోగ్యం
లభిస్తుంది.మొండిగ మాట్లాడటం వలన బ్రతుకే అయోమయ మవుతుంది. మితాహారము,మితభాషణము ఈ
రెండుయే వాంఛనీయములు.
**22**.సాగరజలాన్ని వేడిచేయాలని ప్రయత్నించే అగ్నియొక్క స్థితి
ప్రమాదకరమే అవుతుంది. వేడిచేయడము అట్లుంచి, తన వేడిని కోల్పోయే
ప్రమాదమూ సంభవించును. మహాత్ములను కష్టపెట్టేందుకు ప్రయత్నించుట
ప్రమాదకరము. తద్వారా కష్టపెట్టా లనుకొనినవారే కష్టాలపాలై చింతించుదురు.
**23** సరోవరములో శశి ప్రతిబింబము గోచరించింది. శశి కదులుచున్నట్లు
మనస్సు చూస్తుంది. ఇది మనస్సుకు పట్టిన నిషా. కదిలేవి తరంగాలే
గాని శశి కాదు.తరంగచలనాన్ని చూసే ప్రమాదదృష్టిని మరలించి,
ఊర్ధ్వంగా నడిచి ఆకాశమున శశిబింబమును దర్శించగనే కల్లోల
మంతయూ కరిగిపోవును. ఇచ్చటనే శాంతి శాంతిలో శాంతిని
శాంతిగా దర్శించి తరిస్తుంది.
**24** త్రికరణశుద్ధితో జీవించినపుడే త్రిపుటిని దాటి తరించగలవు. నిన్ను
భగవంతుని వైపునకు నడిపించే సంకల్పాలనే చేయుము.
హృదయాలను కలిపే మాటలనే మాట్లాడుము. సర్వులకు
ఉపకరించే కర్మములనే చేయుము. ఆ తదుపరి చేతలుగిడి చిత్తము
శివునియందు లయించును.
**25** దుఃఖకారణము లైన కోరిక లన్నింటినీ కన్నయ్య చరణ కమలముల
చెంత కరిగిపోనీ. కోరికలను అంతరింప జేసుకొని తీరిక తెలియని చిత్తముతో
పరమాత్మమ ధ్యానించు. అతడు నీకు శాంతిని ప్రసాదిస్తాడు.
**26**.విశ్వమంతయూ విశ్వనాధుడే యను భావనను సదా కలిగియుండు.
అప్పుడు విశ్వము వందలి ప్రతివ్యక్తి ప్రతివస్తువు నీ ప్రాణనాథుడైన శ్యామసుందరునే
గుర్తుచేయు చుండుము. నీ ప్రియతమ విభుని ప్రతిరూపములైన వస్తువులను గాంచి
నీవు అపుడు ఉన్మాది వలె పారవశ్యంతో గంతులేయగలవు.
**27** ఓ సాధకా**!** ప్రపంచాన్ని ప్రపంచముగా వీక్షించే దృష్టి ప్రమాదకరము.
జాగ్రత్త**!** అదొక శక్తివంతమైన అయస్కాంతపు కొండ. అది నిన్ను అమాంతం
ఆకర్షించి సుడిగుండానికి ఆహుతి చేస్తుంది.

**28** “నాకు మైల ఉన్నది. అందుచేత మీ ఇంటిలోకి రాలేను" అంటావు కదూ**!** మరి మనస్సులో మాలిన్యాన్ని నింపుకొని దేవాలయములో కాలిడేందుకు నీ చిత్త మెలా అంగీకరించింది**?** మలిన మనస్సుతో అచ్యుతుని వీక్షిస్తున్నందుకు నీకు సిగ్గులేదూ**?**
**29** తెగిన తీగ అతుకకపోయినా మెల్లమెల్లగా ప్రాకి విస్తరిస్తుంది. మనిషిలో విరిగిన మనసు అతుకుటకు సరిపడదు సరికదా! అప్రయోజకపు స్థితికి కూడా దిగజారుతుంది. కనుక కఠినపలుకుల ద్వారా ఎవరినీ గాయపరచకు.
**30** ఇతరులను నీవు ప్రేమించుట వలన జరిగే మేలు ఇతరులకు కాదు. నీకే. అన్యులను ప్రేమించుట ద్వారా అన్యులలో నీ ఆత్మను సందర్శించే భాగ్యానికి నీవు నోచుకొంటున్నావు. అన్యుల బాగును వాంఛించుటలోనే నీ బాగు నిండియున్నదని మరచిపోకు.
**31** ఉపవాసము దేహానికి ఆరోగ్యమును చేకూర్చును. కానీ ఇది తాత్కాలికమే. మానసిక ఉపవాసము అనగా చిత్తవృత్తి నిరోధము శాశ్వతారోగ్యమును, ఆనందమును ప్రసాదించును. కనుక ఉపవాసి యగువాడు ఆత్మకు సహవాసియై యుండాలి. ఇదియే నిత్యోపవాసము.
**32** గాలి హోరున వీచునపుడు దీపము వెలుతురును నిలుపుకోలేదు. వాసనలు తీవ్రతర మైనపుడు ఆత్మదీపము ప్రకాశించలేదు. వాసన లన్నీ సమూలముగా నశించినపుడే ఆత్మజ్ఞానము స్థిరమై యుండును.
**33.** ప్రపంచము నిన్ను గుర్తించక పోయినను, గౌరవించక పోయినను నీ హృదయము పవిత్రముగా యున్నచో వీవు ధన్యజీవివై యున్నావని తెలుసుకో. భగవానుని దృష్టిలో పవిత్రమై యుండువాడే పావనాత్ముడు.
**34.**ప్రాపంచిక విషయ సంబంధం వాంఛించదగినది కాదు. పాడిమన్ను నీటిలో పడగనే నీటిని పీల్చుకొనును. అదియే ఒక రాయిని నీటిలో వేసినచో వీటిని పీల్చుకొనదు. ఇంద్రియ నిగ్రహము లభించినంత వరకు ప్రాపంచిక విషయాలలో తొందరపాటున సాధకుడు కాలిడరాదు.**35.**అసూయ అనునది ఒక భయంకరమైన వ్యాధి. మానవుని శాంతిని తృటిలో హరించును. అసూయారహితులకే ఆత్మజ్ఞానము లభిస్తుంది. ఔదార్యమును ఔదలదాల్చి అసూయా రాక్షసిని మనస్సు నుండి తరిమివేయాలి. మనకన్నా మిన్నగా యున్నవారిని జూచినపుడు అసూయ కలుగును. మరి ఆ వ్యక్తి నారాయణుడే యన్నభావన రాగానే అసూయమదిలో అదృశ్యమగును.
**36.**ఇతరులు నీకు చేసిన కీడును గూర్చి చింతించకుము. నీ ప్రారబ్ధము ననుసరించి భగవానుడు అది నీ కొసంగిన ఫలితము గనుక దానిని ప్రసాదముగా స్వీకరించుము. సర్వదా ప్రశాంతచిత్తుడవై యుండుము.
**37.**ప్రేమతరంగాలు నీ హృదయములో సదా కదులునట్లు చూసుకొనుము. భగవానుని నామము చెవిని పడగానే పులకరించే స్థితి శరీరానికి, స్పందించే స్థితి హృదయానికి కలిగి, తద్వారా నేత్రాలు ఆనందబాష్పాలు రాల్చగలగాలి. నీలో పెరిగే భక్తికి అదియే ఉత్తమోత్తమమైన చిహ్నము.
**38.**భగవంతుని గూర్చి చెబుతుండగా విని కన్నీరు కార్చేవారు రెండువిధాలుగా యున్నారు. మొదటివారు భగవద్విభూతిని దర్శించి పరవశించే పవిత్రాత్ములు. రెండవవారు తమ బ్రతుకులలోని నీచమైన ఘట్టములను స్మృతికితెచ్చుకొని పశ్చాత్తాపముతో కన్నీరు గార్చే అయోమయ జీవులు. తమ బలహీనతలను

తలచుకొని గాక భగవానుని వైభవమును మదిలో నింపుకొని కన్నీరు గార్చువారే ధన్యాత్ములు.
**39**.ప్రవహించని నీరు క్రిములకు నిలయము. ప్రభవించని బుద్ధి అజ్ఞానానికి స్థావరము. సదా జ్ఞానార్జన చేయుచుండవలెను. ఉన్నతాశయాలలో రమించే అలవాటును నిరంతరము కలిగి యుండవలెను.
**40**.కోపమొక భయంకర రాక్షసి. దాని బారినుండి బయట పడటము కష్టము. కోపము వచ్చినపుడు **"ఓం నమో భగవతే వాసుదేవాయ"** అను మంత్రమును **21** సార్లు జపించాలి.
చల్లని నీటితో ముఖమును శుభ్రపరచుకోవాలి.అద్దములో మన ముఖాన్ని చూసుకోవాలి. తొందరగా కొంత దూరము పరుగెత్తాలి.ఈ సూచనలలో ఏదో ఒకటి క్రోధరాక్షసిని తరిమివేయుటకు మీకు తప్పక ఉపకరించగలదు.
**41** పారవశ్యమైన భక్తి కలుగగానే మోక్షాపేక్ష కూడా అంతరించిపోవును. అట్టి వాంఛారహిత ఆనందస్థితియే ముక్తియై యున్నది. కనుక నిత్యయుక్తుడవై భగవానుని భక్తిచేయుము. ముక్తికాంత నీ తలుపు తప్పక తట్టును.
**42**.మంత్రము నుచ్చరించునపుడు ఆ మంత్రనాదము ఎక్కడ నుండి కదులుచున్నదో జాగ్రత్తగా పరిశీలించుము. మంత్రశబ్దముపై ఏకాగ్రత మంచుట వలన మనస్సు నిగ్రహించబడును. మంత్రము జనించు స్థానమునందు ఒదుగుట వలన మనస్సు నశించును.
**43**.అనంతరూపుడై యున్నందున భగవానుడు నీకు అత్యంత సన్నిహితుడై యున్నాడు. అట్టి పరమాత్మను నీలో నీవుగా దర్శించలేనిచో, మరొకచోట అతనినెలా దర్శించగలవు**?** మోక్షప్రియా! ఆంతర్యంలో తొంగిచూడు. అచ్యుతుడు ఎలా అనంతశయనుడై యున్నాడో వీక్షించు.
**44**.కాలము అతిస్వల్పము. చేయవలసిన కర్మములు బహు అధికము. సోమరితనాన్ని ప్రక్కకు నెట్టివేయి. వ్యర్థ ప్రసంగాలను ఆపివేయి. సింహకిశోరము వలె వేదాంత సత్యాలను గూర్చి ప్రబోధించు. ప్రబోధకుడవై పలవరించకు. ప్రభావితుడవై ప్రవచించు. యావత్ప్రపంచము నాదాన్ని ప్రతిధ్వనించేలా ప్రవచించు.
**45**.కర్మలలో నైపుణ్యము లభించలేదని చింతించకు. నీవు చైతన్య రూపుడవని ధృడనిశ్చయ జ్ఞానము కలిగినపుడే నీవాచరించు కర్మల యందు నిపుణత్వము గోచరించును. నిన్ను తెలిసిన నీనుండి కదిలిన కర్మలే విశ్వమున సమ్మోహింప జేయును.
**46**.మన జీవననౌక మృత్యు సుడిగుండము వైపు నడచుటకు కారణము తెడ్డు వేయు మార్గగామి అహంకారమై యుండుటయే. నేస్తమా! అహంకారమును తొలగించి తెడ్డును ఆత్మభావము చేతిలో నుంచుము. నీ నావ క్షేమంగా మోక్షతీరమును చేరగలదు.
**47** ధ్యానము సక్రమముగా జరుగుటలేదని వ్యధ చెందకు. ధ్యానమనగా నేమి**?** దానిని ఒక భూతము వలె చూడకు. ఆలోచనల నుండి సంపూర్ణముగా వేరుపడి, ఆత్మయందు అణగి యుండుటయే ధ్యానము. ఆత్మావలోకనములో

ఆలోచనలను లయింప జేయుటయే ధ్యానము.
**48** మనస్సు లేని స్థితియే ధ్యానము. ధ్యానము చేయునది ఎవరు? మనస్సే కదా? మనస్సుతో ధ్యానము చేయుచు ధ్యానస్థితి పొందుట ఎలా సాధ్యపడుతుంది? మిత్రమా! మనస్సు ఎక్కడ నుండి కదులుచున్నదో అచ్చటికి మెల్లగా కదిలివెళ్ళు. అచ్చట మనస్సు లేదని తెలుసుకొనగలవు. అదియే సహజ ధ్యానము.
**49.**"నేను జ్ఞానిని నేను మాయను జయించితిని", అని అనుకొనుటయే పెద్ద పొరపాటు. నేను అజ్ఞానమును అంతమొందించినాను అనువాడే నిజమైన అజ్ఞాని. మాయాధీశుడగు మాధవుని శరణుజొచ్చినపుడే నీవు మాయ నుండి విడివడగలవు. అహంకారమును జయించినపుడే నీవు భగవత్సాన్నిధ్యమును పొందగలవు. భగవత్సాన్నిధ్యమును పొందిన దశలో నీకు మాయతో సంబంధము తెగిపోవుచున్నది. అట్టి స్థితిలో నేను అహంకారమును జయించినాను అనెడి అహంకార భావన ఎలా కదులును? సోదరా! అహంకారాన్ని వీడినపుడే మాయను దాటగలవు.
**50.**పూర్ణత్వానికి పయనమయ్యే పవిత్రాత్మస్వరూపా! మనోశకటము సరిగా యున్నదో లేదో పరీక్షించి చూసుకో. మనస్సులో నడిచే సంకల్పాలను అనుక్షణమూ కనిపెడుతూ ఉండు. మనస్సు శ్రేయోమార్గమున నడచుచున్నదో, ప్రేయోమార్గమున నడచుచున్నదో పరీక్షిస్తూ ఉండు. నిరంతరము మనస్సును వీక్షించువాడే నిజమైన సాధకుడు.
**51** భగవద్దర్శనము లభించలేదని వ్యధ చెందకు. సర్వులలో పరమాత్మను సందర్శిస్తూ, సేవించడము అలవరచుకో. తీరిక సమయాల్లో ధ్యానమును సాగిస్తూ, హృదయపు లోతులలోకి వెళ్ళి చూడు. ధ్యానములో అంతర్ముఖ మవుతున్న నీవు పరమాత్మకు అత్యంత సన్నిహితముగా నున్నట్లు అనుభూతి నొందగలవు.
**52** మనస్సును నిగ్రహించే ప్రయత్నములో దానిని నిర్బంధించాలని చూడకు. సరియైన అవగాహనను అందించాలి. ప్రాపంచిక జీవనము నందలి మనస్సుతో సదా భాషించే అలవాటును చేసుకో. సద్భావాలతో మనస్సును నింపే అభ్యాసమును కలిగి యుండుము.
**53** కష్టాలెదురయ్యాయని కుమిలిపోకు. గతంలో మన మాచరించిన దుష్కర్మలు పాపమును అంటగట్టాయి. కష్టాలు వచ్చి పాపాలను దూరం చేయుచున్నవి. అలాగే గతములో మన మాచరించిన సత్కర్మలు పుణ్యమును ముందుంచుతున్నవి. సుఖాలు వచ్చి పుణ్యమును హరింపజేయుచున్నవి. మన పుణ్యమును హరించే సుఖము కన్నా మన పాపమును హరించే దుఃఖమే శ్రేయోదాయకము కదా!
**54** కర్మల మధ్య కలతచెందకు. సర్వకర్మములను భగవానుని యందు సన్యసించి నిర్మలంగా ఉండు. నీవు పాత్రధారివి. భగవానుడు సూత్రధారి. ఈ సత్యాన్ని సదా జ్ఞాపక ముంచుకొని జీవించు. తరువాత నీ జీవితము

దేదీప్యమానమై వెలిగిపోగలదు.
**55** కర్మలను సన్యసించాలని భావించకు. కర్మలలో సన్యాసమునుదర్శించే అలవాటు చేసుకో. అహంకార, మమకారాలను వీడి నీవు ఆచరించే ప్రతి కర్మయును సన్యాసానికి ప్రతిరూపమే అవుతుంది.
**56** సూర్యుడు ప్రకాశించుచునే యున్నాడు. మబ్బుయే అడ్డు నిలిచి ప్రకాశాన్ని ఆటంక పరచింది. మబ్బు తొలిగితే సూర్యదర్శన మవుతుంది. అలాగుననే అజ్ఞాన మబ్బు తొలగగానే ఆత్మజ్ఞాన భాస్కరుడు స్వప్రకాశచైతన్యమై భాసిస్తాడు.
**57** సహనము ఉత్తమమైన సుగుణము. సహనశీలుడు ఎన్నడైనను విజయుడే. సహనశీలుడగు వానిని బాధలు కదిలించలేవు. ఈర్ష్యలు అతనికి అర్థంగావు. అసూయలు తెలిసిరావు. అపకారికి కూడా ఉపకారమును చేయు శక్తి సహనశీలునికి ఉండును. తనను గునపముతో కొట్టెడి వానిని కూడా భూమి సమానముగనే భరించును కదా**?**
**58** ప్రేమ చాలా పవిత్రమైనది. అది బ్రతుకునే పావన మొనర్చును. ప్రేమించడము ఒక కళ. ప్రేమించే నేర్పు నీకు అవగత మయితే నీ ప్రేమ జడరూపాలను చైతన్యవంతము చేస్తుంది. అజ్ఞానమును జ్ఞానముగా మార్చుతుంది. ఆవేదనను ఆనందముగా తీర్చుతుంది. ప్రేమజీవియే ధన్యజీవి.
**59**.బాధల మధ్య సాధకుడు చెదరిపోకూడదు. నిన్ను బాగుచేసేందుకే బాధ లొస్తున్నాయని భావించు. బాధలలోనే నీ బ్రతుకు శోభాయమానముగా తయారవుతుంది. మనోహరమైన కాంతిని వెదజల్లే ముందు బంగారు నిప్పుల్లో ఎంతగా కాలినదో, సమ్మెటపోట్లను ఎంతగా భరించినదో ఆలోచించు.
**60** మాటలకన్నా మౌనమే నీ చేత బాగా మాట్లాడిస్తుంది. ఆధ్యాత్మిక సాధకుడు అధికప్రసంగి కాకూడదు. ఎవరైన ప్రశ్నిస్తేనే మాట్లాడు. నీకు నీవుగా వ్యర్థప్రసంగాలను చేయకు. అసహ్యకరముగా ఎవరైనా మాట్లాడుచుండినచో, ఈ ప్రపంచ వైఖరిలో ఇలాంటిది అని సరిపెట్టుకొని స్థిమితముగా,ఉదాసీనముగా ఉండు.
**61** నీ గొప్పతనమును చాటుకొనే వచనములను పలుకకు. సామాన్యుని వలె నమ్రతగా ఉండటము అలవరచుకో. నిన్ను గూర్చి నీవు చెప్పుకొనుచున్నంత కాలము నీవు చిన్నవాడివే. నీవు గొప్పవాడివి అయ్యావా**?** ఇతరులే నిన్ను గూర్చి ప్రశంసిస్తారు.
**62** వారానికి ఒక్క రోజు చక్కెర లేకుండా పానీయము తీసుకో. టీ గాని,కాఫీ గాని, పాలు గాని ఏది నీవు తీసుకొన్నను పంచదారను దానిలో మినహాయించు.అప్పుడప్పుడు ఇలా చేయుచు వరుసగా ఒక వారం రోజులు పూర్తిగా పంచదారను వాడుట మానివేయి. మనస్సు తీపిపై మరలగానే మాధవుని నామమును బిగ్గరగా గానము చేయి. నాలుక తియ్యగా మారుతుంది. జిహ్వను జయించలేని జీవికి జీవితములో శాంతి లభించదు.

**63** అందరిలోను పరమాత్మను వీక్షిస్తూ జీవించు. దయ నిండిన పలుకులే నీనుండి కదలనీ. ఈ ప్రపంచము అనిత్యమనెడి భావనను సదా మదిలో కలిగియుండు. సర్వులను ప్రేమిస్తూ ఉండు. నీవు ప్రేమించినవారు నిన్ను ప్రేమించాలని ఆశించకు. అనంతుడైన భగవానునికి అనేక శరీరాలు. నీవు ఒకరికి మేలు చేయి. మరొకరి ద్వారా భగవానుడు నీకు మేలుచేస్తాడు.

**64** సదా సత్యమునే భాషించుము. భగవానుడు సత్యరూపుడు. నిత్యము సత్యమును భాషించు వానికి వాక్శుద్ధి లభించును. వాక్శుద్ధి గలవాడు ఏది తలచినను, పలికినను నిరాటంకముగా జరిగిపోవును. వాక్శుద్ధి నీకు అలవడినచో ద్విగుణీకృతముగా నీవు ప్రపంచానికి సేవ చేయగలవు.

**65** సంసారజీవనము లోని దుఃఖములను సదా దర్శించే అలవాటును సాధకుడు అలవరచుకోవాలి. మృత్యువును గూర్చి సదా భావన చేయుచూ ఉండాలి. మహాత్ముల చెంతగాని, లేదా సత్సంగము నందుగాని ఆధ్యాత్మిక స్ఫూర్తిని పొందుతూ ఉండాలి. అనుక్షణము భగవానుని స్మృతియందుంచుకొని జీవించాలి. సాధకుడు ఈ నాలుగు విషయాలను మరువరాదు.

**66** నిత్యము ధ్యానము చేయు అలవాటును చేసుకో. ధ్యానజీవనమే ధన్యజీవనము. ధ్యానములో కొద్దిగా ప్రగతిని సాధించగనే బ్రతుకులో మాధుర్యాన్ని నీవు చూడగలవు. ప్రారంభములో కొన్ని ఒడుదుడుకులు ఏర్పడవచ్చు. ధ్యానములో అంతర్ముఖ మవుతున్నకొద్దీ ఆవేదనలన్నీ పూలరేకులవలె రాలిపోవును.

**67** ప్రపంచము నిత్యమని భావించుచున్నంత కాలము కామధేనువు చెంతనే యున్నను కష్టాలు తప్పవు. పరమాత్మయే శాశ్వతమని తెలియగనే కౌపీనధారి కూడా కలిమి గలవాడే యగును. ప్రపంచాన్ని విస్మరించు. పరమాత్మను స్మరించు.

**68** శీలం దూరమైన వాడు పండితుడైనను వాసన లేని పూవువలె వ్యర్థ జీవియే యగును. శీలము అతి పవిత్రమైనది. దానిని కాపాడే ప్రయత్నములో శరీరము నేలరాలినను ఫరవాలేదు. కీర్తిధృవతార నిలిచియే ఉంటుంది.

**69** శుద్ధిపడిన హృదయము అభేదదర్శనము చేయగలుగుతుంది. నిస్వార్థ ప్రేమ నీ హృదయములో నిండగనే, నీ బ్రతుకును నడిపేందుకు భగవంతుడే దిగి వస్తాడు. అంతవరకు నీ బ్రతుకును నడుపుతున్నది అహంకారమే నని, తద్వారా లభించేది వినాశమే నని మరువకు.

**70** సత్యరూపుడవు కావలెనని వాంఛించే నీవు సత్యజీవనమును సాగించక తప్పదు. ముదుసలి కర్రపై ఆధారపడి నడుస్తాడు. తనకు ఆధారమైన కర్రను తాను మోసినపుడే అది అతనికి ఊతగా నిలుస్తున్నది. నీవునూ సత్యజీవనమును సాగించినపుడే సత్యరూపమును దర్శించగలవు.

**71** నిన్ను భగవంతుడు నడిపించాడా! నీవు ద్వంద్వాలకు అతీతుడవయ్యావనే తెలుసుకో. మనస్సు సున్నిత మవుతుంది. హృదయం విశాల మవుతుంది.
బ్రతుకు ఉజ్వలమై ప్రకాశిస్తుంది.
**72** నిద్రనుండి లేవగనే "భగవాన్! ఈనాడు నేను ఎవ్వరినీ బాధించను.
ఎవరి హృదయాన్ని గాయపరచను" అని ప్రతిజ్ఞ చేయి. రాత్రి పరుండే ముందు
"భగవాన్! నీకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాను. నేను ఎవరినీ బాధించలేదు.
ఇదంతా నీ అనుగ్రహ ప్రసాదమే" అని నమస్కరించు.
**73** "ఆలయానికి వెళ్తున్నాను" అంటావు. ఆలయ మొక్కటియే భగవన్నిలయమని
నీ అభిప్రాయము కాబోలు. విశాలవిశ్వ మంతయూ దివ్యాత్ముని ఆలయమే నని నీకు తెలిసిననాడు నీవు నిలిచినచోటే భగవన్నిలయ మవుతుంది.
**74** నీవు అసంఖ్యాకమైన గ్రంథములను రచించవచ్చు. అనర్గళముగా
ఉపన్యసించవచ్చు. బహుముఖ ప్రజ్ఞాశాలివియని పదుగురిచే స్తుతించబడవచ్చు.
హృదయంలో ప్రేమను పోగొట్టుకొన్నచో ఇవి యన్నియు శవసౌందర్యములే కదా!
**75** చింతలలో చరించే వింతజీవనానికి స్వస్తి చెప్పు. సాధకుడవైన నీవు
నిత్యము ఆనందరూపుడవై ఉండాలి. చితి మృతకళేబరాలను దహిస్తే, చింత
ప్రాణమున్న దేహాలనే దహించివేస్తుంది.
**76** పరిస్థితులను గూర్చి పలవరించకు. విషమ పరిస్థితుల మధ్య కూడా
విమలచిత్తుని వలె జీవించు. భిన్న పరిస్థితులు తలఎత్తినపుడు, నీ మానసిక
ప్రపంచములో నీవు ఉండేందుకు ప్రయత్నించు. భగవంతుడు పంపగా నిన్ను
మలిచేందుకు వలచి వచ్చినవే విపత్తులని మరచిపోకు.
**77.**"నేను చట్టబద్ధముగా, న్యాయసమ్మతముగా, ధర్మయుతముగా జీవించుచున్నాను. మరి నాకు కష్టాలెందుకు సంభవిస్తున్నాయి**?"** అంటావు.
మిత్రమా! నీ చట్టాలు, ధర్మాలు వ్యక్తిపరంగా నడిచే నియమాలు. సమిష్టపరంగా,
దైవపరంగా ఆలోచించి చూడు. నీ బాధలకు నీవే ఎలా కర్తవో నీకు బోధపడుతుంది.
**78.**రుచి చూడని నీకు రుచి తెలిసే అవకాశము లేదు. రుచి తెలియని నీకు
రుచిని తెలిపే హక్కు అసలేలేదు. అనుభవమునకు అందని విషయాన్ని ఇతరులకు
అందించే ప్రయత్నము ప్రమాదకరము. మిత్రమా! ఆత్మరుచిని అనుభవించు. ఆ
తరువాత ఇతరులకు అందించుదువు గానీ! రుచి చూడని నీకు రుచి చూపాలనే
అభిరుచి ఎందులకు**?**
**79.**వ్యక్తిభావన ముక్తిని ఆటంకపరుస్తుంది. వ్యక్తిభావనను విశ్వభావములో
లయింపజేయి. విశ్వభావములో విశ్వచైతన్యము నిండియున్నందున నీకు విశ్వనాథుడు
గోచరిస్తాడు. అప్పుడు భిన్నత్వములో ఏకత్వాన్ని దర్శించగలవు.
**80.**భగవంతుని దయ నీపై వర్షించనంతవరకు దానిని గూర్చి నీవు

గ్రహించలేవు. భగవత్కృప నీపై పడగానే అప్పుడు నీకు సత్యం తెలిసివస్తుంది. "ఆ దయకు నేను అర్హుడనా?" అన్న సందేహం కూడా కలుగుతుంది. మిత్రమా! భగవత్కృప కర్మకు ఫలితం కాదు. ఆ దయామయుని అనంత ప్రేమకు నిదర్శనం.

**81** భగవానుడు అందరిలోను దాగియున్నాడు. నీతో భాషించే ప్రతి ఒక్కరి పలుకు వెనుక భగవానుడు కులుకుతూనే ఉన్నాడు. నీ హృదయాన్ని సదా తెరచియే ఉంచు. పసిబిడ్డ వలె నిర్మలంగా ఉండు. ప్రతి జీవిని భగవత్స్వరూపముగా దర్శించుచూ ప్రేమించే అలవాటును అలవరచుకో.

**82** భగవంతుని ధ్యానించగనే నీవు విశ్వచైతన్యముతో ముడిపడి ఉంటావు. వెంటనే అపరిమిత శక్తిమంతుని వలె మారుతావు. ధ్యానము శక్తిని, ప్రకాశాన్ని నీకు అందించి నిన్ను ప్రభావితుడ్ని చేస్తుంది. ధ్యాన జీవితాన్ని ఎన్నడూ దూరం చేసుకోకు.

**83** సోదరా! శాంతియే నీ జన్మహక్కు. బలమే నీ కులము. పిరికితనాన్ని, అశాంతిని పారద్రోలు. "అహం బ్రహ్మాస్మి" అని సింహకిశోరము వలె గర్జించు. అమృతస్వరూపుడవైన నిన్ను మృత్యువు కూడా కదిలించలేదు.

**84** నేస్తమా! నీవు ముక్తస్వరూపుడవు. నీ స్వేచ్ఛను అమ్ముకోకు. ఇతరుల భావాలకు నీ మనస్సును ధారబోయకు. నీమీద నీవు ఆధారపడు. నీవు నమ్మిన దానినే ఆచరించు. గొర్రెలన్నీ గుంపుగా వెళ్ళనీ సింహకిశోరమైన నీవు నీకంటూ ఒక దారిని ఏర్పరచుకో.

**85** పాపము చేసినందులకు వగచకు. పాపమొక భూతము కాదు. పొరపాటు మాత్రమే. సరిచేసుకుంటే సరిపడిపోతుంది. జ్ఞానజాగరణలో సర్వసమస్యలు, సమస్త పాపములు లయించిపోతాయి. పాపము జరిగిందని స్వప్నప్రపంచములో కూర్చొని విలపిస్తావెందుకు? మేలుకొని చూడు. అయ్యోపాపమని పాపాన్ని ఓదార్చేవాడివి నీవే అయివుంటావు.

**86** సాధకా! అభిరుచుల్ని దూరం చేసుకో. అహంకారాన్ని ఆవల నుంచు. అర్హులైన వారికి సేవల నందించు. సర్వులను సమముగా వీక్షించు. ధ్యానహృదయముతో కదులుతూ ఉండు. శాంతి నీ స్వరూపమై మిగులుతుంది.

**87** వస్తువులను దహించే శక్తి అగ్నికి ఉన్నట్లు, పాపాలను దహించే శక్తి భగవన్నామాని కుంది. విరామసమయాల్లో విచారముతో సాగక, భగవన్నామాన్ని ఆంతర్యములో కొనసాగించే అభ్యాసమును కలిగియుండు. నీ హృది సదా ఆనందముతో నిండుతుంది.

**88** ప్రేమచే క్రోధాన్ని జయించు. నమ్రతచే అభిమానాన్ని దూరం చేసుకో, శరణాగతిచే అహంకారాన్ని అంత మొందించు. సేవచే ద్వేషాన్ని రూపుమాపు. ఇవన్నీ జరిగాయా! ఇక నిన్ను మించిన భాగ్యవంతుడు ఈ ప్రపంచములో మరొకడుండడు.

**89** ఎక్కువగా ఆలకించు; తక్కువగా ఆలపించు. ఎక్కువగా ఇచ్చుకో;

తక్కువగా పుచ్చుకో. ఎక్కువగా ఆచరించు; తక్కువగా ప్రవచించు. ఎక్కువగా ఆలోచించు; తక్కువగా చదువు. ఆ తరువాత నీలో తరిగేదేమిటో పెరిగేదేమిటో నీకే అర్థమవుతుంది.

**90** మృత్యువంటే నీకు భయమా? మృత్యువును చూసి నీవు పారిపోతావా? అయితే విను. నిజమైన మృత్యువేమిటో చెప్పనా? మమకారమే మృత్యువు. నిర్మమకారమే అమృతత్వము. ....... ఇంకా చూస్తావేం? మృత్యువుకు దూరంగా వెళ్ళు.

**91** నిష్కామ్యభక్తిని కలిగియుండు. కోరికలను మదిలో నింపుకొని గుడి కెళ్ళకు. అడగనవసరము లేకనే అందించువాడు అచ్యుతుడు. నీ అవసరాలు నీకన్నా అతనికే బాగా తెలుసు. భక్తి చేయుట ఒక్కటియే నీవు చేయవలసిన పని.

**92** గురుబోధలో బ్రతుకును పండించుకో. గురువైనవాడు మహిమలు చేస్తాడని, చేయాలని అభిప్రాయపడకు. అవన్నియు చౌకబారు ప్రదర్శనలు. నీగురువు నీహృదిలో నిలవడమే గొప్ప మహిమయని మరువకు.

**93** ఓ సాధకా! ఇతరులు వాడిన చెప్పులను ఎట్టి పరిస్థితులలోను వాడకు. ఇతరుల పడకపై పరుండకు. తక్కువగా మాట్లాడుతూ ఎక్కువగా ఆలోచించే సదలవాటును తప్పక కలిగియుండు.

**94** కోరికలు నిన్ను అశాంతికి గురిచేస్తాయి. లభించిన దానితో తృప్తిపడటము అలవరచుకో. నీవు సక్రమమార్గములో నడచునపుడు అన్యుల విమర్శలను లెక్కచేయకు. అలాగని అన్యులుచేయు స్తుతులు నీకు ఉపకరిస్తాయని భ్రమపడకు. అవి మరీ నీ బ్రతుకును కృంగదీస్తాయి.

**95** ఎవరైనా నిన్ను నిందించినపుడు వ్యథచెందకు. ఉద్రేకమును ప్రదర్శించకు. చక్కగా విచారణను కొనసాగించు. వారు చేసింది పదముల గారడియే కదా! వారినుండి కదిలినది శబ్దతరంగమే కదా! అని సరిపెట్టుకో.

**96** నీలోని చెడును, ఇతరులలోని మంచిని గాలించి గ్రహించే సదలవాటును కలిగియుండు. నీకు చెడు చేసిన వారిని ప్రేమించు చేసిన మంచిని గూర్చిమాట్లాడకు.

**97** భగవంతుని విషయంలో నీవు సుముఖతను చూపవచ్చు.విముఖతను చూపవచ్చు.కానీ భగవానుడు మాత్రము నిన్ను ఎన్నడూ వదలి పెట్టడు. ఈ సత్యమును గ్రహించి మనస్సును సదా భగవంతుని యందే నిలిపెడి అలవాటును చేసుకో.

**98** అన్వేషిస్తే సత్యము అవగత మవుతుంది. విచారిస్తే సత్యము చేరువవుతుంది. అభ్యసిస్తే సత్యము అనుభవముగా మారుతుంది. ధ్యానిస్తే అనుభూతి స్థిరమై ఉంటుంది.

**99** అహంకారాన్ని త్యజించి, వైరాగ్యమును ధరించి, నిష్కాముడుగా ఆసీనుడవై,

ఇంద్రియ ద్వారములను మూసివేసి, కళ్ళు మూసి, హృదయాన్ని తెరిచి
అవలోకించు. నిన్ను నీవు చూసుకొనేందుకు ఇదియే సూటియైన దారి.
**100** పూర్ణమైన సాగరము చంద్రోదయము కాగానే పరిపూర్ణమై గోచరించు
నట్లు, భక్తుడవైన నీవు గురుదర్శనముతో సాగరము వలె నిండిపోవాలి. ప్రేమలో
పండిపోవాలి. నీకు, భగవంతునికి మధ్య గురువు వంతెనయై ఉన్నాడని మరువకు.

**101.**దోసెడు నీరు కావలసి వచ్చినా నది చెంతకు వెళ్ళవలసినట్లు
స్వల్పానందమున కైనను నీవు ఆత్మజ్ఞాన గంగలో మునకవేయక తప్పదు.
సత్యమైనది, నిత్యమైనది ఆత్మయై ఉండగా అన్య సుఖములను వాంఛించి
దు:ఖించెదవేల**?**
**102.**యుద్ధరంగమున ఎందరో సైనికులను, రథములను, గజతురగాదులను,
బంధువులను పోగొట్టుకొనిన తరువాత గానీ రాజుకు సింహాసనము లభించదు.
అలాగుననే మోక్షమును గోరు సాధకుడు సర్వమును మానసికముగా పరిత్యజించినపుడే
మోక్ష సింహాసనము నెక్కి శోభించును.
**103.**దానము చేయని దోషము వలన వ్యక్తి బిచ్చగాడగునని శాస్త్రము
చెబుతుంది. నీకున్న దానిని ఇతరులకు పంచుటలో సంతృప్తిపడే అంతఃకరణను
కలిగియుండు. సంపాదనలో కనీసం ఐదు శాతమైనా పరుల కొరకు వినియోగపడాలి.
**104.**సద్భావాలు చిత్తములో కదలగనే దుష్టభావాలు పారిపోతాయి. మనస్సు
విషయసుఖాల కొరకు పరితపించు చున్నను, నీవు వాటి యందు ప్రవేశించకుండా
యున్నచో మనస్సు నిర్వీర్యమై లొంగిపోవును. మనస్సు లొంగిన స్థితిలో నీవు
మహాత్ముడవే నని గుర్తు పెట్టుకో.
**105** సామరస్య జీవనమును సాగించువాడే సాధకుడు. ఎవడు తన
పరిసరముల యందు వైషమ్యాలను కలిగించునో అట్టివాడు సాధకుడు కాడు. విష
కీటకము లాంటివాడు. ప్రేమలో జీవిస్తూ ప్రేమను పంచగలవాడే ఉత్తమ సాధకుడు.
**106.**సమాజములోని వ్యక్తులను ఏకము చేసి వారిలో పరస్పర ప్రేమజీవనమును ఆవిష్కరించునది ఏదియో
అది ధర్మము. వ్యక్తులను విభజించి,
విషమపరిస్థితులను ప్రవేశపెట్టునది ఏదియో అదియే అధర్మము.
సాధకుడవైన నీవు ధర్మములో రమించాలే గాని అధర్మములో చరించకూడదు.
**107.**ఓటమి కలిగినందుకు వగచకు. ఈనాటి పతనము రేపటి ప్రగతికి
పునాదియై ఉన్నదని మరువకు. ధైర్యము కలిగి నిలబడు. శక్తివంతుడవై ముందుకు
సాగు. భగవత్కృప నిన్ను ప్రబుద్ధుని చేస్తుందని పూర్ణంగా విశ్వసించు. మరుక్షణమే
నీకు కొండంత ధైర్యము లభిస్తుంది.
**108.**పొరపాటున కూడా తప్పుచేయకు. కర్మసిద్ధాంత మనునది అనివార్య
జీవనసూత్రము. కర్మకు ఫలితం అనుభవించక తప్పదు. ఇతరుల కొరకు నీవు
పాపము చేస్తావు. కానీ నీనుండి లాభమును పొందినవారలు నీ పాపమును
తగ్గించలేరు. నీ దుష్కర్మకు లభించే దుష్ఫలితాన్ని నీవే అనుభవించాలి.
**109.**ఆధ్యాత్మిక మార్గము తేలికైనది కాదు. కంటకాలకు నిలయము.
ఆటంకాలకు స్థావరము.కానీ భగవంతుని పైనను, గురువు పైనను

పూర్ణవిశ్వాసముగలవానికి ఆధ్యాత్మికజీవన మార్గము పూలబాటే అయి ఉన్నది.
**110.**నీకన్నా ఎక్కువ సంపాదించేవాడిని చూసి నిరాశ చెందకు. నీకన్నా తక్కువ సంపాదించువానిని గాంచి సంతృప్తి చెందు. సంతృప్తియే నిన్ను పరిపూర్ణునిగా మార్చుతుంది. సమదర్శన వీక్షణమును ఒకనాటికి ప్రసాదిస్తుంది.
**111.**కవి కవులతోనే కలుస్తుంటాడు. వైద్యుడు వైద్యునితోనే ముచ్చటిస్తుంటాడు. రాజకీయవాది రాజకీయ వాదులతోనే తిరుగుతుంటాడు. నీవు భక్తుడివా! అయితే నీవు భక్తులతోనే కలవాలి. అప్పుడే నీకు శాంతి లభిస్తుంది.
**112.**వికలాంగుడగు బిడ్డ జన్మించిన నాటి నుండి తల్లియే అతని అవసరములన్నీ చూచుచుండును. వికలాంగుడగు బిడ్డ ఆమె పుత్రుడు కావడమే ఈ విశిష్టకర్మకు కారణము. సాధకా! నీవు పాపివైనా ఫరవాలేదు. ఈ క్షణాన నీవు పరమాత్మకు పుత్రుడ వైనచో నీ అవసరాలన్నీ ఆ పురాణపురుషుడే తీర్చును.
**113.**ఈ ప్రపంచమున నిన్ను బంధించు వారెవ్వరును లేరు. అజ్ఞాన పంజరమును నిర్మించుకొన్నది నీవే.జ్ఞానమనెడి ఖడ్గముచే పంజరమును ఛేదించుకొని,శాంతిగగనాన జ్ఞానానందము లనెడి రెక్కలతో హాయిగా విహరించు.
**114.**పరుసవేది తాకిడికి బంగారముగా మారిన ఇనుపముక్క మరల ఏ రీతిన ప్రయత్నించినను ఇనుము ఎలా కాలేదో, అలాగుననే గురుబోధచే ప్రభావితుడైన ముముక్షువు జ్ఞానము పొందినవాడై, మరల ఎట్టి పరిస్థితులలోను క్రిందకి జారడు.
**115.**లోభి యగువాడు తాను దాచియున్న ధనమును గూర్చి తెలుపని విధముగా, పుణ్యాత్ముడగు పురుషుడు తాను చేయు పుణ్యకార్యములను గూర్చి వివరించడు. నీ నుండి కదిలే ప్రతి మంచిపని పరమాత్మను కదిలించుచునే యుండును. నిన్ను నీవు పొగుడుకొనే స్థితి రాగానే నీవు చేసిన పుణ్యకార్యములు పరమాత్మ కంటబడక మరుగున పడిపోవును.
**116.**నీ జీవననౌకకు భగవానుడు నావికుడుగా యున్నంతకాలము నీ ప్రయాణము సునాయాసముగనే సాగిపోవును. తెడ్డును అహంకారానికి అందించావా? నీ బ్రతుకు సుడిగుండానికి ఆహుతి కాక తప్పదు. మిత్రమా! జీవననది ఎంత వడిగా పారినా తప్పులేదు. నావ నడుపువాడు పరమాత్మ యైనచో నీవు ప్రమాదాలనుండి విడిపడ్డావని తెలుసుకో.
**117.**భగవంతుడు ధ్యానము ద్వారా లభిస్తాడు. మనస్సు నిశ్చలముగా యుండినపుడే ధ్యానము జరుగుతుంది. నిశ్చలముగా మనస్సు వుండవలె ననిన చిత్తము ఏకాగ్రతను పొందక తప్పదు. ఏకాగ్రత యనునది భగవన్నామస్మరణ ద్వారా లభిస్తుంది. ప్రేమజీవీ! నీవు తరించేందుకు నిరంతర భగవన్నామస్మరణ యనెడి ఒక్క సాధన సరిపోవును.
**118.**ఇతరులపై ఆధారపడే అలవాటును దూరం చేసుకో. సాధకుడైనవాడు తనపై తాను ఆధారపడి జీవించేవాడై ఉండాలి. సేవకులు లేకుండా నీవు ఎంతపని చేసుకోగలవో ఆలోచించు. స్థితిగతులు, పేరుప్రతిష్ఠలు అనెడి కల్పిత భావాలకుస్వస్తి చెప్పు.
**119.**నీ ప్రార్థనలను భగవంతుడు వినలేదని నిరాశ చెందకు. నీ కోరికలు నీకు ఉపకరించవని పరమాత్మకు తెలిసి యుండుటయే ఈ వైముఖ్యమునకు

కారణము. చిన్నబిడ్డ కత్తిని అడగవచ్చు. అడిగింది కదా అని తల్లి అందించునా?
**120.**సాధకుడవైన నీ బ్రతుకును నడిపే చట్టము ప్రేమయే అయివుండాలి. ప్రేమ మనలను నడిపినంత కాలము మనము ఇతరులకు హాని చేయలేము. మనకూ మనము హాని చేసుకోలేము.
**121.**గాలి వీచగనే ఎగిరిపోవు నంతటి తేలికగా మేఘము లుండును. కానీ అట్టి మేఘములే వర్షాకాలమున కుండపోతగా భూమిపై నీటిని క్రుమ్మరించును. నిజమైన జ్ఞాని అతిసామాన్యుని వలె గోచరించును. జ్ఞానబోధ చేయుటకు ఉపక్రమించగనే అతనినుండి అనూహ్యముగా అమృతధారలు కురియును,
**122.**మౌనవ్రతము చాలా చక్కని వ్రతము. అది మనస్సును, వాక్కును శుద్ధి పరచును. మౌనము నాచరించు సమయాన దినపత్రికలు చదువరాదు. రేడియోలు వినరాదు. సినిమాలు చూడరాదు. నిరంతరము మననశీలుడవై ఉండాలి.
**123.**భగవంతుని తనలో తాను దర్శించగలిగిన వాడు సర్వత్ర భగవానునే దర్శించును. కొన్ని చోట్ల పవిత్రతను, కొన్ని చోట్ల అపవిత్రతను దర్శించువానికి భగవంతుడనగా నేమిటో తెలిసిరాలేదని భావము. భగవానుని అనుభవించిన మనస్సునకు భగవంతునికన్నా అన్యముగా మరియొక వస్తువు గోచరించదు.
**124.**వస్త్రములను కొనుటకు వెళ్ళగానే కొట్టువాడు తనవద్దనున్న వస్త్రములను విప్పి పరచి చూపించును. మనకు నచ్చలేదని తెలియగానే వాటిని యథా ప్రకారముగా మడచి లోన ఉంచుకొనును. మనము మన మనస్సులోని భావాలను ఎదుటివారి ముందు ఉంచవచ్చును. వారు ఇష్టపడలేదని తెలియగానే, ప్రశాంతముగా మన భావాలను నలగకుండా, చెదరకుండా అంతర్ముఖం గావించుకోవాలి. అప్పుడే బ్రతుకు స్థిమిత పడుతుంది.
**125.**మాట ఇచ్చి తప్పిపోకు. ఎవరికైనా మాట ఇచ్చునపుడు, రెండు మూడు సార్లు బాగా ఆలోచించి మాట ఇవ్వు. మాట ఇచ్చిన తరువాత దానిని నిలబెట్టుకొనేందుకు తీవ్రంగా ప్రయత్నించు. మధ్యలో ప్రాణము ఆటంకముగా అడ్డు నిలిచినచో నిలబెట్టుకొన దగినది మాటేగాని ప్రాణము కాదు.
**126.**అగ్ని నుండి వేడి దూరము కానట్లు, నీటినుండి చల్లదనము వేరు కానట్లు, నీడ మనిషికి దూరం కావట్లు, భక్తుడవైన నీ మనస్సు ఎన్నడూ పరమాత్మ కన్నా దూరంగా చరించకూడదు.
**127.**దీపము మాట్లాడదు. గాలి కబుర్లు ఎరుగదు. మాట్లాడక పోయినా దీపము ప్రకాశము నందిస్తుంది. కబుర్లు చెప్పకపోయినా గాలి హాయిని కల్గిస్తుంది. సూదులవంటి మాటలు, గొడ్డలిపోట్లవంటి కబుర్లు అందించే నీవు దీపంలా జీవించలేవా? గాలిలా కదలలేవా?
**128.**బొంగరమును త్రిప్పిన త్రాడు తన వెంట చలనశక్తిని గూడా తీసుకొని పోవునట్లు, నిన్ను ఆడించిన సంసారము నిన్ను నిర్వీర్యునిగా మార్చి నిష్క్రమించును.
**129.**చెట్టుమొదట నీరు పోస్తే వృక్షభాగము లన్నిటికి నీరు పోసినట్లే. నీవు భుజించినపుడు "కృష్ణార్పణం" అనెడి భావనతో భుజిస్తే అది కృష్ణునికి అర్పించినట్లే అవుతుంది. కృష్ణుడొక్కడు భుజిస్తే సమస్త జీవులకు ఆహారము నొసంగినట్లే. మిత్రమా! నీవు భుజించుటలో సర్వ జీవరాసులను తృప్తి పరచగలవు. భావశుద్ధి కలిగియుండు.

**130.**ఫలములచే నిండియున్న చెట్లు క్రిందికి వంగి భూమిపై నున్న మనుజులకు ఫలముల నందించుటకు ఉత్సాహపడుచుండును. జ్ఞానము కలిగిన ప్రతివ్యక్తియు తన జ్ఞానముచే ఇతరులకు ఆనందమును కలిగించుటకు సదా యత్నించుచుండవలెను.
**131.**వృక్షము యొక్క కొమ్మలు, రెమ్మలు మొదలగు వానిని నరికివేయు చున్నను, చెట్టుమొదట వీరు పోయుచున్నచో అది పచ్చగానే జీవించునట్లు, నీవు ఇంద్రియములను నిగ్రహించుచున్నను, ఒక్క నాలుకను తృప్తి చెందించుచుండినచో సర్వేంద్రియములు మఱల విజృంభించుచునే యుండును.
**132.**మందు చేదుగా ఉన్నను దేహముపై ఎలా అమృతము వలె పని చేయునో, గురుదేవుని కోపము కూడా శిష్యుని మనస్సుపై దయామృతమును కురిపించును. మందు యొక్క సుగుణము బాహ్యానికి ఎలా గోచరించదో, గురుదేవుని కారుణ్యము కూడా అనుభవించ దగినదియే గాని వివరించను వీలుపడదు.
**133.**సాగరమును జేరిన నది మళ్ళీ తిరిగి వేరుగా రానట్లు గురుపాదముల చెంతకు చేరిన నీ హృదయమును ప్రాపంచిక విషయచింతనలో చొరనివ్వకు. వెన్నెలకు అలవాటుపడిన బ్రతుకును చీకటి వైపు నడపకు. నడిపావా! ఆ తరువాత బ్రతుకే చీకటిమయ మవుతుంది.
**134.**నీరు పోసి తనను పెంచిన వానికే గాక, తనను గానుగలో వేసి త్రిప్పిన వానికి గూడా చెఱకు మాధుర్యమునే పంచునట్లు, శత్రుమిత్రాదుల యందు సమభావమును కల్గినవాడవై, సర్వులకును ప్రేమను పంచిపెట్టు చుండవలెను.
**135.**పక్వమైన ఫలము యొక్క సుగంధము అనివార్యముగా బహిర్గత మగునట్లు, భక్తుడవైనచో నీనుండి ప్రేమకార్యములు అప్రయత్నముగా కదులును.
**136.**చంద్రుడు ఉన్నచోట వెన్నెల ఉండును. రాజు ఉన్న చోటరాజ్యముండును. దయ ఉన్న చోట ధర్మముండును. గురువున్నచోట జ్ఞానముండును. జ్ఞానమున్నచోట పర్వమూ ఉండును.
**137.**నీ స్వరూప మేమిటో తెలిసి జీవించు. చెదరని ప్రశాంతత నీవై యున్నావు. హృదయ లోతులలోకి వెళ్ళి ఈ సత్యమును పరిశీలించి తెలుసుకో.. బాహ్యజగత్తులోని కార్యకలాపాలను సాక్షివై వీక్షించే అలవాటు చేసుకో.
**138.**బాధలు నిన్ను ఆవరించనీ, కన్నీరు ధారలా ప్రవహించనీ, తొట్రుపాటులో బ్రతుకు నడవనీ. గడవనీ. ఈ పరిస్థితు లన్నియు నిన్ను సరిచేసేందుకు భగవానుడు కల్పిస్తున్నవే నని భావించి జీవించు. సమస్తమును భగవానునికి వదిలిపెట్టు. సర్వమూ అతడే నీకు సమకూర్చగలడు.
**139.**నీవు చేయు ప్రతి కర్మయు భగవంతుని కొరకు చేయు పూజ వంటిదని భావించు. నీ కార్యాలయమైనా, లేదా కొట్టు అయినా అది భగవానుని మందిరమే నని భావించి ధర్మజీవనమును గడుపు, భగవంతుడు నీ ప్రయత్నాన్ని ఆశీర్వదిస్తాడు.
**140.**నిత్యము ధ్యానమును కొనసాగించు. ధ్యానము సాగించుటకు నీకు వీలులేనిచో అలాగని చింతించకుము. భగవన్నామమును మనసారా స్మరింపుము. నీ కరచరణాదులు కర్మతో కదులుచున్నను నీవు నామస్మరణ కొనసాగించవచ్చును.

నామస్మరణ నిన్ను ధ్యానజీవిగా, ధన్యజీవిగా మార్చును.
**141.**ప్రేమ ఓటమిని ఎరుగదు. ప్రపంచము నంతటిని ప్రేమతో జయించవచ్చును. ప్రేమతో శత్రువు నైనను లొంగదీసుకొనవచ్చును. సామరస్య జీవనము శ్రవణము వలన రాదు. ప్రేమ వలన లభిస్తుంది.
**142.**ఇతరులు చెడ్డవారని నిర్ణయించే ముందు ఒక్కసారి నిన్ను నీవు వారి స్థానములో మానసికముగా ఉంచుకొని దర్శించు. ఆ తరువాత నీవు వెలిబుచ్చే నిర్ణయాలు సమాజానికే గాక నీకూ ఉపకరిస్తాయి.
**143.**అహంకార మనునది నయము గాని వ్యాధి. ఒక ద్వారము గుండా నీవు దానిని బైటికి పంపినచో రెండవ ద్వారము గుండా అది లోనికి ప్రవేశిస్తుంది. సంపూర్ణశరణాగతుడవై జీవించినపుడు మాత్రమే నీవు అహంకారమును జయించగలవు.
**144.**స్తుతులకై ఎదురు చూశావా! వాటిని అంటిపెట్టుకొని నిందలు కూడా చేరుతాయి. అయితే ఏమి చేయాలి**?** ఏమి లేదు. రెండిటికీ అతీతముగా వెళ్ళి సుఖించుటయే ఏకైక మార్గము.
**145.**నీ ఇంటిలోనిదైనా, పరుల ఇంటిలోనిదైనా పట్టుకొంటే నిప్పు కాలుస్తుంది. కామము బయటవారిపై కదిలినా, ఇంటిలోని వారిపై మరలినా అది నిన్ను తప్పక పాడుచేస్తుంది.
**146.**రాగమున్నచోట భయముంటుంది. ద్వేషమున్నచోట క్రోధము ఉంటుంది. రాగద్వేషాలు మనోకల్పితాలే. రాగద్వేషాలను అధిగమించావా**?** నీవు రామచైతన్యములో రమించగలవు.
**147.**అసూయ అనేది భయంకరమైన దుర్గుణము. అసూయాపరుడు ఆత్మానందమును అనుభవించలేడు. ఆధ్యాత్మిక జీవనానికి ఇది గొప్ప ఆటంకమనిమరచిపోకు. ఇతరుల సుఖమును గాంచి తృప్తి చెందువాడు భగవత్ప్రేమకు పాత్రుడుకాగలడు.
**148.**ఏ గృహమునందు నిత్యము దైవపూజ కొనసాగునో ఆ గృహమునకు మించిన స్వర్గము లేదు. అదియే శాంతిధామమై శోభించును. ఆధ్యాత్మిక కాంతులతో కళకళ లాడును. ప్రేమమందిరమై భాసించును.
**149.**ఆలస్యము చేసి అన్యాయము గాకు. మానవజన్మ లభించింది. యౌవనము అందించబడింది. మనోబుద్ధులు అదుపులో ఉన్నాయి. శరీరము ఆరోగ్యముగా ఉంది. ఇప్పుడే భగవానుని ధ్యానించి తరించుము. గడచిన కాలము వగచినా చిక్కదు.
**150.**బాధ లొచ్చాయని భయపడకు. వాటిని ఇతరుల ముందు వెలిబుచ్చకు. లోకులు ఎప్పుడూ నీతో ఉంటారా వినడానికి**?** లేదా ఓదార్చడానికి **.....**మిత్రమా**!** పరమాత్మ ఎప్పుడూ నిన్ను వదిలేవాడు కాదు. నీ మాటలు, నీ బాధలు అతడికే వినిపించు. అతడి బోధలో నీ బాధలు అదృశ్యమవుతాయి.
**151.**సోమరితనాన్ని వదలనిదే నీకు ప్రగతి లభించదు. మహాత్ము లందరూ ఈ విషయాన్ని నొక్కి వక్కాణించి యున్నారు. మనస్సును సదా భగవానునిపై వుంచి ప్రశాంతముగా శ్రమించు.
**152.**ధ్యానయోగివి కమ్ము. తైలధారవలె ధ్యానయోగమును సాగించుము. భగవానునికై దు:ఖించుము. మృత్యువును చూసి నవ్వే స్థితి వచ్చినంతవరకు పరమాత్మ కొరకు విలపించుటను మానకుము.

**153.**పచార్లు సాగించడం మనస్సుకు అలవాటు. విషయప్రపంచము చుట్టూ పరిభ్రమించడమే మనస్సు చేయు కార్యము. నీవు విగ్రహించవలెనని ప్రయత్నించు కొలది అది ఆగ్రహించుచునే యుండును. మనస్సును మరలించుట కన్నను మనస్సు ఏ విషయము మీదికి నడుస్తుందో ఆ వస్తువులో భగవానుని దర్శించుటయే ఉత్తమమైన మార్గము.

**154.**గతములో మన మాచరించిన దుష్కర్మల యొక్క ఫలితములే ఈనాడు బాధల రూపమున మనలను ఆలింగన మొనర్చుకొను చున్నవి.
బాధ లొచ్చాయని వగచకు. వ్యధ చెందకు. అలాంటి దుష్టకర్మలను మరల ఆచరించకుండా ఆశీర్వదించమని, బాధలను సహించే శక్తిని ప్రసాదించమని భగవంతుని ప్రార్థించు,అతడు నీ ప్రార్థనలను తప్పక వింటాడు.
వెంటనే నీవు శక్తిమంతుడవు కాగలవు.

**155.**కర్మవలయంలో చిక్కిన నీవు కర్మ నాచరించకుండా వుండలేవు. నీవు ఆచరించు కర్మ నీ ప్రగతికే నని గుర్తుంచుకో. ఇతరులకు సేవ చేయుట యందు నీవు పరికరానివి అని మరచిపోకు. ఈ భావన నిన్ను కర్మవలయం నుండి బయట పడవేసి, భగవత్కృపను అందిస్తుంది.

**156.**సర్వప్రాణులతో మైత్రి కలిగి జీవించాలి. ద్వేషభావాలు, దోష దర్శనాలు మంచివి కావు. నిన్ను బాధ పెట్టిన వారిని శిక్షించాలని యత్నించకు. ఎవరిపాపాన్ని వారు అనుభవిస్తారు. భగవంతుడు రక్షకుడే కాడు; శిక్షకుడు కూడా.
తుఫాను లొచ్చి, బస్సులు పడిపోయి, ఇండ్లు కూలిపోయి, జనజీవనము దుఃఖము పాలగుట మనము గాంచుట లేదా?

**157.**నీకు ఇచ్చేవాడు, నీ నుండి పుచ్చుకొనేవాడు ఇరువురును పరమాత్మయే ననెడి భావనను స్థిరముగా కలిగియుండు. అప్పుడు ఇచ్చిన వారిపై రాగము ఉండదు.
పుచ్చుకొన్న వారిపై ద్వేషము కలుగదు.

**158.**మనస్సు పరమాత్మ యందు లగ్నమైనపుడు శుద్ధసాత్విక మగును.
అట్టి మనస్సుతో ధ్యాన మాచరించినపుడు జ్యోతిదర్శనము లాంటి దృశ్యములు కొన్ని నీకు కనపడవచ్చును. నీ మనస్సు పవిత్రముగా ఉన్నదనుటకు అది నిదర్శనము. కానీ నీవు అంతటితో ఆగకూడదు. ముందుకు నడవాలి. అప్పుడే నీవు ఆత్మవనే ఎరుక కలుగుతుంది.

**159.**జ్ఞాపక ముండుట లేదని నీరసపడకు. ఒక గ్రంథాన్ని నాలుగు పుటలు చదివి, ఆ తరువాత దానిని ప్రక్కన బెట్టి అందులోని విషయమును గూర్చి ఆలోచించుము. సరిగా స్మృతికి అవి అందవు. మళ్ళీ పుస్తకాన్ని తెరచి చూడు. ఇలా ప్రతిరోజు ప్రయత్నించు. ఒక్క నెలరోజులలో నీ స్మృతి వృద్ధి చెందుతుంది.

**160** వీపు వ్యాపారివా! ఫరవాలేదు. నీ దగ్గర వస్తువులు కొనేందుకు వస్తున్న వ్యక్తిని గాంచగనే అతడు నారాయణుడే నని మానసికంగా భావించు. అతనికి వస్తువులు అందించునపుడు నారాయణునికి ఇస్తున్నట్లు భావించు. నీ కొట్టులో నీకు సహకరించు గుమాస్తా కూడా నారాయణుడే నని విశ్వసించు. ఈ విధముగా విన్ను చేరే ప్రతి వ్యక్తితోను, నిన్ను అంటియున్న ప్రతి వస్తువుతోను ఆధ్యాత్మికసంబంధము కలిగి జీవించు. నీవు క్షణమైనా భగవానునికి దూరం కాలేవు.

**161** ఆణిముత్యాలన్నీ లోతుకు వెడితేనే లభిస్తాయి. ఒడ్డుకు చేరేవన్నీ నత్తగుల్లలే. బాహ్య దృశ్యాలన్నీ ద్వైత తిమిరాలే. ఆంతర్యానికి నడిచావా! ఆత్మానందము లభ్యమవుతుంది.

162 ఇతరులకు శాంతి పంచడ మనేది అంత తేలికైన కార్యము కాదు. ప్రపంచానికి శాంతిని అందించాలని ప్రయత్నించిన వారంతా ప్రపంచములో అశాంతినే పంచగలిగారు. ప్రేమించడము లోనే శాంతి లభిస్తుంది. ప్రేమలు పంచడము లోనే శాంతి స్థిరపడుతుంది.

163 భగవత్సాక్షాత్కారము నొందిన సంత్ పురుషుల దివ్యవచనములపై ఆధారపడి పరమాత్మజ్ఞానమును పొందేందుకు ప్రయత్నించాలి. ఒక దీపముతో మరియొక దీపమును వెలిగించుకొను విధముగా మహాత్ముల ప్రవచనముల ద్వారా మన బ్రతుకును పండించుకోవాలి.

164 భగవంతునితో మనము సదా ముడిపడియే ఉన్నాము సత్యము హృదిలో అఖండముగా వెలిగిపోతూ ఉండాలి. అప్పుడు సదా మనము భగవంతునిలోనే ఉన్నవార మగుదుము. అహంకారము ఆ దశలో అదృశ్యమై ఆత్మానందము అనుభూతిగా మిగులును.

165 బాధల నుండి విముక్తిని ప్రసాదించమని చాలామంది ప్రార్థనలు చేస్తుంటారు. మిత్రమా! నీ మనస్సు పరమాత్మ యందు స్థిరపడితే బాధలు నీకు తెలిసే అవకాశమే లేదుకదా! మరి బాధలుంటేనే కదా నీ మనస్సు భగవానునిపై లగ్నమౌతున్నది? బాధలు నిన్ను కదిలించి భగవానుని వైపునకు నడిపించి, నీవు అతనితో కలియగనే కనుమరు గవుతున్నాయి.ఆహా!బాధలెంత ఉపకారము చేస్తున్నవి?

166 అందమైన వస్తువును చూడగనే మనస్సు దానిని ఆశించును. అందుకునే ప్రయత్నములో అశాంతి స్వరూపముగా మిగులును. అట్టి సన్నివేశాలలోఆ వస్తువు అనిత్య మైనదనియు, చూచుచుండగనే అదృశ్య మగుననియు,శాశ్వతమైనవాడు భగవానుడే ననియు భావన చేయవలెను.
తద్వారా మనస్సు స్థిమితమును పొంది తరించును.

167 "నేను నీ సేవకుడను" అని ప్రాపంచిక వ్యక్తులతో నీవు చెప్పినచో, సరేనని నీచేత వారు సేవలు చేయించుకొందురు. “నేను నీ సేవకుడను" అని భగవానునితో అన్నచో, వెంటనే అతడు “కాదు కాదు; నీవూ నేనూ ఒకటే" అనును. మిత్రమా! వింటే గాదు రుచి తెలిసేది. భగవత్కృపను పొందితే తెలుస్తుంది.

168 భగవంతుని విశ్వసించి నడిచే వారిని భగవానుడు తప్పక నడిపించును. పరమాత్మ నడిపించుచున్నాడు అనెడి సత్యము తెలియగానే విశ్వాసము ధృవపడి జ్ఞానముగా మారును.జ్ఞానము కలిగినదా! నీకు, భగవంతునికి మధ్య తేడా లేదనెడి సత్యము ముంజేతికంకణము వలె గన్పట్టును.

169 పంజరములో కూర్చుని నీవు ముక్తుడ వైనట్లు ప్రసంగించడము నీ అవివేకానికి ప్రబల నిదర్శనము. నీవు పంజరము నుండి బయటపడినపుడే బంధములేదని నీకు తెలియగలదు. భవబంధాలలో చిక్కుకొని సతమతమయ్యే నీవు అద్వైతబోధ చేయుచున్నందుకు సిగ్గు కలుగుటలేదా?

170 అన్యుల దోషములను గూర్చి ఆలపించకు. దోషము లెన్నెడి బుద్ధిదోషయుత మగును. దోషజీవనములో ఆత్మదోషము గాంచబడదు. ఇతరులలోనిమంచిని దర్శించేందుకు సదా ప్రయత్నించు. తద్వారా మంచికి ప్రతిరూపంగామిగులగలవు.

171 మనమంతా భగవంతుని అమృతపుత్రులమే గనుక భేదభావాలు మన మధ్య కదలకూడదు. మనము పరస్పరము ముచ్చటించునపుడు గాని, వ్యవహరించునపుడు గాని ఈ సత్యమును మరువరాదు. ఇదియే ప్రేమ. ఇదియే

దైవము. ఇదియే ఆనందము.
**172** బహిర్ముఖమయ్యే నీ మనస్సును అంతర్ముఖము చేసి దానిని
హృదయస్థానము నందు విడుచుటచేత నీకు పరిపూర్ణశాంతి లభించును.సదా
భగవన్నామస్మరణ చేయుటవలనమనస్సునుఅంతర్ముఖమొనర్చుటసులభమగును.
**173** ఆలయానికి వెళ్ళినా, అర్చనలో కదిలినా నీ మనస్సులో ప్రార్థనా రూపంలో కదలవలసిన సంకల్పము ఒక్కటే. "భగవాన్! నాకు నీ దర్శనభాగ్యము
తప్ప రెండవ ప్రయోజనము అవసరము లేదు" అనెడి ఒక్క కోరికనే కలిగి యుండు.
**174** నీవు సంసారాన్ని వదలవలసిన పనిలేదు. సంసారముపై కున్న
వ్యామోహమును వదిలిపెట్టగలిగితే చాలు. వ్యామోహమును వదలలేక నీవు
అరణ్యాలకి వెళ్ళినా సంసారము నిన్ను వెంబడిస్తూనే ఉంటుంది. వ్యామోహమును
వదిలి నీవు గృహములో ఉండినా నీ ఇల్లు తపోవనమే.
**175** వర్షపునీటిని కొండల మీద పట్టలేము. క్రింద నున్న లోయల యందే
పట్టగలుగుదుము. జ్ఞానము కూడా పర్వతముల వలె అహంకారమును పెంచుకొన్న
వారి వద్ద నుండి గ్రహించలేము. లోయలవలె నమ్రతగల వారియందే పొందగలము.
**176** ప్రయాణము చేయునపుడు మౌనంగా భగవన్నామమును ఉచ్చరిస్తూ
ఉండు. నీ వద్ద ఎవ్వరూ లేనపుడు మనస్సును ఖాళీగా ఉంచకు. నామాన్ని
కొనసాగిస్తూ ఉండు. కొంత కాలము అలా చేశావా! ఆ తరువాత నామము నీ
సొత్తుగా మారుతుంది.
**177** నీ నుండి కదిలే ప్రతి సంకల్పము చైతన్యము నుండియే కదులుచున్న
దనెడి భావనను సదా కలిగి యుండుము. ఈ భావన వలన ఘంటానాదము
ఘంటము నందే లయించునట్లు మనస్సు చైతన్యములో తద్రూపమై తరించును.
**178** అగ్నిలో పడిన కట్టె మెల్లగా తన రూపమును కోల్పోపుచూ చివరకు
ఎలా బూడిదగా అదృశ్య మగుచున్నదో, సత్పురుషుల సాంగత్యమనెడి అగ్నిస్పర్శ
చేత కొయ్యలాంటి వ్యక్తి కూడా కాఠిన్యాన్ని కోల్పోయి భగవద్విభూతిగారాణించగలడు.
**179** పెరిగిన వృక్షము ప్రయత్నించినను దాని మొదలును తాకలేనివిధముగా ఆధ్యాత్మికంగా పురోగమించిన సాధకుడు మరల తన గతజీవన ఊబిలో
దిగుటకు అంగీకరించడు.
**180** పద్మము నందలి పుప్పొడి రాలిపోవునేమో ననెడి భయముతోభ్రమరము
అతి నెమ్మదిగా తన పాదములను పద్మము పై నుంచునట్లు,
ఇతరులమనస్సులు కష్టపడునేమో యని యోచించి, వారికి నొప్పిని
కల్గించకుండాప్రవర్తించువాడే ఉత్తమ సాధకుడు.
**181** విశ్వమంతయూ విశ్వనాథుడే యని నీకు అవగత మైనపుడే నీకు
సత్యము తెలిసినదని భావము. సత్యము తెలిసినపుడే నీవు విశ్వములోని ప్రతి
ప్రాణికి సేవ చేయగలవు.
**182** ఎలా భావిస్తావో అలా భాసిస్తావు. ప్రాపంచిక విషయాలను గూర్చి
చింతించకు. తీరిక లభించినప్పుడల్లా మనస్సును ప్రపంచము నుండి వెనుకకు
మరల్చి, పరమాత్మ పాదపద్మముల యందు నిలుపుటకు ప్రయత్నము చేయి.
మనస్సులో పరమాత్మ ధ్యానము ఆగనివాడే నిజమైన ముముక్షువు.
**183** గురువు నావికుడై నిలుచును. భగవన్నామమనెడి తెడ్డుతో మన జీవన

నౌకను సునాయాసముగా నడుపును. గురువు నామమును అందించును. నామమునుసదా నీవు హృదయములో ధరించి యున్నచో, గురుసాన్నిధ్యము నీ హృదిలోనే అనుభవించగలవు.
**184** లింగభేదము దర్శనీయము కాదు. నీ మనస్సులో లింగభేదము స్ఫురించుచున్నంత కాలము నీవు సాధకుడవు కాలేవు. సర్వభేదముల
నధిగమించి ప్రభవించే అద్వైత పరమహంసవు కావాలని ఉబలాటపడే
నీకు  భేదదృష్టి మంచిది కాదు.
**185** భగవానుని సాక్షాత్కారము నందుకొని సర్వప్రాణులు మన స్వరూపములే
అని గ్రహించి అనుభవించుటయే మోక్షము. ఇది సర్వోపద్రవరహిత స్థితి. సమదర్శన గతి.
**186** పుష్పము నందలి మకరందము గ్రోలిన పిమ్మట తుమ్మెద కదలలేని
పారవశ్యము నెలా అనుభవించునో, అలాగుననే ధ్యానస్థితిలో నిత్యానందమును
అనుభవించిన నీ మనస్సు దివ్యపారవశ్యంలో మునకవేయును.
**187** మానవుని హృదయములో నిండియున్న కల్మషములే, వాసనలే అతని
దుఃఖమునకు పునాదిని నిర్మించుచున్నవి. హృదయము పవిత్రము కానిదే
భగవత్కృప లభించదు. భగవన్నామమును ఉచ్చరించుట వలననే హృదయము
పవిత్రమగును.
**188** మనస్సు అంతర్ముఖము చేయుటకు మహాత్ముల కృప అవసరము.
మహాత్ములను గౌరవించాలి. పూజించాలి. వారి అమృతోపదేశములను ఆలకించాలి. ఆలకించిన వాటిని ఆచరించాలి. అప్పుడే మన బ్రతుకులో
శాంతి నిండగలదు.
**189** తీపి పదార్థము గదిలో వున్నదని తెలిసినంత మాత్రాన రుచితెలియదు. గదిలోకి వెళ్ళాలి. దానిని తీసుకొని భుజించాలి. అప్పుడే తెలియును.
ఆలాగుననే భగవానుడు హృదయములో ఉన్నాడని భావించినంత మాత్రాన
తృప్తి లభించదు. ధ్యానచిత్తముతో హృదయములో ప్రవేశించినపుడే
ఆనందము లభ్యమగును.
**190** దైవస్మరణలో నిత్యము రమించ గలిగినచో మన దేహములే
దేవాలయము లగును. మన చిత్తములే భగవంతుడు చరించుటకు వాహనము
లగును. అప్పుడే ఈ ప్రపంచానికి మన మేవిధమైన సేవ నైనను చేయగలము.
**191** మనస్సు చాలా చెడ్డది. మదించిన ఏనుగు వంటిది. దానిని
లొంగదీసుకొనుట అంత సులభసాధ్యమైన పనికాదు. నిరంతర నామస్మరణ యనెడి అంకుశముచే దానిని పట్టి బంధించాలి. నామము నెంతగా
నీవు ఉచ్చరించు చుందువో, అంత ఎక్కువగా పరమాత్మ
సాన్నిధ్యమును ఆంతర్యములో అనుభవించగలవు.
**192** నీటిలో యున్న చేపలను పట్టుకొన యత్నించువాడు తాను నీటిలో
దిగడు. గట్టుపై గుట్టుగ కూర్చొని చేపలను పట్టును. మాయకు వశమైన
మనస్సును నిగ్రహించ వలెనని నీవు మాయలో దిగరాదు. మాయకు దూరమైనపుడు మాత్రమే నీవు మనస్సును పట్టగలవు.
**193** శరీరములో రక్తము చక్కగా ప్రవహిస్తుంటే చాలు. శరీరము ఆరోగ్యముగా ఉంటుంది. రక్తప్రసరణము ఆగితే శరీరానికే ముప్పు కలుగుతుంది.
మిత్రమా! డబ్బూ అంతే. ధనము ఎప్పుడూ నడుస్తూనే ఉండాలి. నిలువ చేసిన డబ్బు ఎన్నడైనా హానికరమే.

**194** నా అనుభవం చెప్పమంటారా? ఆధ్యాత్మికంగా నా హృదయములో
నిలిచిన వెలుగు నా ప్రయత్నము కన్నను భగవత్కృప చేతనే కలిగిందని చెప్పగలను.
నాకు వెలుగు ఎలా వస్తుంది? అని మాత్రమే నేను ఆలోచించాను. విచారించాను.
విలపించాను. భగవంతుని కృప నాకు చేరువైంది. ఆ శక్తితో ముందుకు నడువ
గలిగాను.
**195** ప్రేమకు ఆశలు తెలియవు. రాగద్వేషాలు అర్థం కావు. పసిపాపను
అందరూ ముద్దెట్టుకుంటారు. ఎందుకో తెలుసా? ద్వంద్వాలు ప్రయత్నముతో
కదలని స్వభావమై యున్నందున. ప్రేమ భయాన్ని కూడా ఎరుగదు.
**196** ప్రారంభదశలో నున్న సాధకుడు ఏకాంతవాసియై సాధన లాచరించాలి.
జనసంగము అంత మంచిది కాదు. అధికంగా భాషించడము, అధికంగా
భుజించడము, అధికంగా నిద్రించడము ఏ మాత్రము పనికిరావు.
**197** కష్టించి పైకి వచ్చిన ధనికునికి తన మొదటి వంద రూపాయల
సంపాదన ఎంత కష్టతర మైనదో అతడికే తెలుస్తుంది. ప్రారంభదశలో ఎన్ని బాధలు
పడితే ఒక సంస్థ పురోభివృద్ధిని సాధించిందో, దానిని ప్రారంభించి నడిపిన వానికే
అర్థమవుతుంది. సాధకుడవైన నీవు కఠోర సాధన లాచరించినపుడే కమనీయ బాటను చేరగలవు.
**198** విషయసుఖముల ద్వారా నీవు పొందే ఆనందము అతి స్వల్పము. కానీ
దానికి నీవు చెల్లించే మూల్యము అనూహ్యము. వెల గల ముత్యములను
రేగుపండ్లకు ధారబోయునట్లు ప్రశస్తమైన మానవజన్మను విషయసుఖానుభవానికి
బలి చేస్తావా?
**199** మనము ఎలా తోలితే పశువులు ఆ వైపునకు నడుస్తాయి. మనస్సు
ఎలా చెబితే మనము ఆ దారులలో పయనిస్తున్నాము. ఇక మనకు, పశువుకు తేడా
ఏమిటి? మనస్సు చెప్పినట్లు నీవు వింటే ఖైదీవి అవుతావు. నీవు చెప్పినట్లు మనస్సు వినగలిగితే నీవే
చక్రవర్తివి అవుతావు.
**200** అహంకారమును పట్టుకోవడం వలన తాను జీవుడని మానవుడు
భావిస్తున్నాడు. అహంకారాన్ని అంతరింపజేయి. అహంకారము అంతరించినదా!
అప్పుడు నీ వెవరివి? ఎవరూ కాని వాడివి. ఎవరూ కాని నీవు ఏమవుతావు? దేవుడవే అవుతావు.
**201** నదిని చూసి ఎదను సరిచేసుకో. నదులన్నీ ఎత్తయిన గిరిప్రదేశములోనే
పుడుతాయి. సేవ చేసేందుకు క్రిందికి జారుతాయి. సేవ చేస్తూనే అనంతమైన
సాగరంలో కలిసిపోతాయి. మానవుడవైన నీవు ఎత్తయిన బ్రహ్మదేవుని నుండి
పుట్టావు. మానవలోకానికి వచ్చింది సేవ చేసేందుకే నని మరచిపోకు. సేవలో
జీవితాన్ని వృథా చేసుకోకుండా ఆత్మసాగరాన్ని చేరి తరించు.
**202** ప్రపంచము అశాంతికి నిలయము. పరమాత్మ ప్రశాంతతకు స్థావరము.
ప్రపంచాన్ని గూర్చి ఆలోచించావా! నీ మనస్సులో ప్రపంచమే నిండి ఆవేదనను
అందిస్తుంది. పరమాత్మను గూర్చి చింతించావా! నీ మనస్సులో పరమాత్మ నిలిచి
ఆనందాన్ని కల్గిస్తాడు.
**203** భగవంతుని నీకు జ్ఞాపకము చేయువాడే నిజమైన మిత్రుడు. అట్టివాని
స్నేహమే నీకు శ్రీరామరక్ష. ఒకవేళ అటువంటి మిత్రుడు దొరకనిచో నీవు
ఒంటరిగానే వుండిపో. అంతే గాని భగవంతుని దూషించే పాషండులతో కలసిమెలిసి తిరగకు.
**204** సముద్రము అలలను కదిలించదు. కానీ తనలో అలలు కదిలే

అవకాశమును, శక్తిని దాచుకొని ఉంటుంది. వాయువు వీచి తరంగాలను కదిలిస్తుంది. అలాగుననే నీకు నీవుగా భగవానుని వద్దకు కదిలి వెళ్ళలేవు. కానీ వెళ్ళగలిగే హృదయాన్ని మాత్రము కలిగియుండు. గురుదేవుడు వాయువులా వీచి నిన్ను పరమాత్మ దగ్గరికి నడిపిస్తాడు.

**205** "రాతిలో దేము డెక్కడున్నాడు? నాకు చూపిస్తారా!" అని నన్ను ఒక ఆర్యసామాజికుడు ప్రశ్నించాడు. "ఉన్నాడని మాత్రం నేను చెప్పగలను. కానీ చూడవలసింది మాత్రము నీవే" అని అన్నాను. మార్కండేయుని కొరకు శివలింగము నుండి మహేశ్వరుడు రాలేదా? ప్రహ్లాదుని కొరకు శ్రీహరి స్తంభము నుండి బయల్వెడలి రాలేదా! పాండురంగడు నామదేవు కొరకు విగ్రహం నుండి వ్యక్తం కాలేదా! వారి కెవరు చూపించారు?

**206** సహజాతాలచే ప్రేరేపింపబడి జంతువులు, పక్షులు కూడా స్నానము చేస్తున్నాయి. శుద్ధి పడుతున్నాయి. మనస్సు చేత ప్రేరేపించబడి నీవూ స్నానము చేస్తున్నావు. నీకూ, వాటికి తేడా ఏముంది? భగవన్నామమును ఆంతర్యములో చేసుకుంటూ స్నాన మాచరించి నపుడే నీవు వాటికన్నా గొప్పవాడివి కాగలవు. అప్పుడు నీ శరీరము పై బడు జలము గంగాతీర్థమే అవుతుంది.

**207** ఎవరి సాన్నిధ్యములో నీకు ఒంటరితనము స్ఫురించదో, వెలితి తెలియదో అతడే మహాత్ముడు. అతడి చెంత ఏకత్వమే గాని భిన్నత్వము అర్థము కాదు. అతడు ఆత్మరూపు డైనందున అందరి ఆత్మలను స్పందింపచేయును.

**208** సూర్యబింబము నీటిలో కనబడుతుందే గాని సూర్యుడు తడవడు. నిన్ను నీవు తెలుసుకొన్నచో నీవూ సూర్యుని వలె సర్వకార్యముల యందు ప్రవేశించినను వాటిచే అంటబడవు.

**209** ఖాళీ పాత్రనే నింపగలము. అలాగే ఖాళీ అయిన మనస్సునే పూర్ణరూపంగా పూర్చగలము. మనస్సు అభిరుచులతో, అభియోగాలతో, అభిమాన అహంకారాలతో నిండి ఉంది. దానిని ఖాళీ చేయనిదే మనస్సులో శాంతిని నింపలేము.

**210** వస్తువులలో మంచిచెడు లుండవు. వాటితో మనము పెట్టుకొనే సంబంధమును బట్టియే మంచిచెడులు తయారవు తుంటాయి. పండు కోసేటందుకుఉపకరించినపుడు కత్తి చాలా మంచిదే. గొంతు కోయుటకు ఉపయోగ పడినపుడుచెడ్డ దవుతున్నది. మంచిచెడులు అలాగే ఉంటాయి.

**211** అధములైన మానవులు ఎప్పుడూ చెడ్డకార్యాలే చేస్తుంటారు.
మధ్యములైన వారు మంచిచెడులను రుచిచూసే మిశ్రమకార్యాలను చేస్తుంటారు.
ఉత్తము లైనవారు నిరంతరము సత్కార్యములే ఆచరిస్తుంటారు.
మోక్షప్రియా! నీవు సదా మంచినే ఆచరించుము.

**212** రక్షకభటుడు చూస్తున్నంత సేపు చోరుడు చోరత్వము నుండి విడిపడి యుండును. అందుచేతనే పెద్ద దొంగలపై ప్రభుత్వము సదా నిఘా ఉంచి ఉంటుంది. అయితే మనస్సు గజదొంగ వంటిది. ఒక్క క్షణము కూడా విడువకుండా బుద్ధి అనే పోలీసు నిఘా ఉంచే ఉండాలి.

**213** నిత్యము భగవన్నామము మనస్సులో కొనసాగునట్లు చూసుకోవాలి. భగవన్నామము జరిగే మనస్సులో భగవంతుడు ఉంటాడు. భగవానుడు జ్యోతిస్వరూపుడు. దీపపు వెలుగును కలిగిన గృహము లోనికి దొంగలు ఎలా

ప్రవేశించలేరో, భగవన్నామము కదిలే అంత:కరణ లోనికి కామక్రోధాది శత్రువులు ప్రవేశించలేవు.
**214** ఎప్పటి కార్యాన్ని అప్పుడు చేసుకొనే అలవాటు శ్రేయోదాయకము. నేటికార్యాన్ని రేపటికి వాయిదా వేయకు. గడచిన కాలము తిరిగి వచ్చేది వుండదు.కాలాన్ని వృథా చేసుకోవడ మంటే కాలుని నోట పడుటయని భావము.
**215** నీ శరీరములోని అవయవములు ఒకదానితో ఒకటి సహకరించుకొనుచు దేహారోగ్యమును కాపాడునట్లు, సంఘజీవనములో అంగమైన నీవు నీ తోటిఅంగములతో కలిసి సామరస్య జీవనమును, సహకార జీవనమును సాగించవలెను.
**216** వాక్కును కల్గిన మానవుడు ధన్యజీవి. భగవత్రసాదితమైన వాక్కును భగవానుని కొరకే ఉపయోగించువాడు ముక్తజీవి యగును. వాక్కు మంచిదే గాని వాగుడు మంచిది కాదు. ఆధ్యాత్మిక సాధకుడవైన నీవు అతివాగుడును మానాలి.
**217** భగవత్సాక్షాత్కారమును పొందిన మహాత్ము లందరు ఒకే సత్యమును ప్రవచిస్తారు. భగవత్స్వరూపముగా మారిన మహాత్ముల నుండి మాట్లాడు శక్తి భగవానుడే అయిఉండుట చేత మహాత్ము లందరూ సత్యమును ఒకే విధముగా ప్రవచిస్తారు. భగవానుని భాష ఎవరినుండి వచ్చినా ఒక్కటే.
**218** ఇద్దరు వ్యక్తులు కూడి మూడవ వ్యక్తిని గూర్చి విమర్శిస్తూ ప్రసంగించుట కన్నా, ముగ్గురు వ్యక్తులు కలిసి ఒక భగవానుని స్తుతించి తరించవచ్చు. విమర్శలు పతనాన్ని కల్గిస్తాయి. దైవభక్తి ప్రగతిని సాధిస్తుంది.
**219** మట్టిలో విత్తనము నాటుట ఎలాంటిదో, మనస్సులో సంకల్పమునిలుపుట కూడా అలాంటిదే. అనుకూల సమయమునందు విత్తనము మొలకగామారునట్లు, అనుకూల పరిస్థితులలో సంకల్పము కర్మగా మారును. కర్మవలయమునుండి బయటపడ వలెనని అభిలషించు నీవు సంకల్పములను తప్పక నిరోధించాలి.
**220** ధ్యాన మనేది వ్యక్తిలో వాంఛించదగిన పరిణామమే గాని అనేకప్రక్రియ కాదు. బట్టకు రంగువేయుట ఎలాగుననో, మనస్సు ధ్యానము నాచరించుటకూడా అంతే. తెల్లబట్టను రంగులో ముంచగానే దానికి రంగు పట్టును. ఆ తరువాత
పట్టిన రంగును పోగొట్టాలని ఎంతగా ప్రయత్నించినను ఉపయోగముండదు. భగవంతుడనెడి రంగును మనస్సునకు పులుముటయే ధ్యానము.
**221** కుమారుని చూడగానే అతనికి తండ్రి ఉన్నాడని నీకు తెలియును. సాధువులను చూడగానే భగవానుడు ఉన్నట్లు తెలియును. భగవానుడు శాంతి స్వరూపము. సాధువులు నిత్యము తమలో శాంతిని నింపుకొని ఉండుటయే వారిలో భగవానుడు గోచరించుటకు కారణము.
**222** ఆరాధనాభావంతో రిస్తే ఆహారమే అమృత మవుతుంది. అన్నము ఆత్మరూపమని భావించాలి. అది ఎలా సముచితం**?** అంటారు కొందరు. ఋతువులలో ఉన్నది భగవచ్ఛక్తి కాదా**?** మేఘాలలో, గాలిలో, వర్షములో ఉన్నది మాత్రము ఆత్మశక్తి కాదా**?** భూమి, మొక్క, కంకి, ధాన్యము ఆత్మ కాదా**!'** ఆహారమును జీర్ణము చేయు జఠరాగ్ని మాత్రము ఆత్మ కాదా**!** మరి ఆత్మకన్నా వేరుగా ఈ విశ్వము నందు ఏమున్నది**?**
**223** ప్రాపంచిక వస్తువులను ఆశిస్తూ, అచ్యుతుని అనుగ్రహమును పొందుట దుస్సాధ్యము. భగవానునిపై పూర్ణదృష్టి కలిగియుండినపుడు మాత్రమే మనము భగవానుని పొందగలము.

**224** ప్రపంచము వైపు వెన్ను దిప్పి, శుద్ధసంకల్పము అనెడి తెడ్డును వేసుకొంటూ, భగవత్కృప అనెడి తెరచాపను ఎత్తిపట్టి జీవననదిని సునాయాసంగాఈది మోక్షతీరమును చేరి తరించుము. సాధకా! సాగిపో!
**225** "నా బ్రతుకంతా బాధలే" అంటున్నావు. మరి ఈ బాధలను పంచే ప్రపంచానికి అతీతంగా వెళ్ళి, ఆనందంగా జీవించాలని నీకనిపించడము లేదా? బాధలు నీ కళ్ళను తెరిపించడము లేదా? మిత్రమా! ప్రాపంచిక సుఖాలన్నీ అశాశ్వతములని మరచిపోకు.
**226** స్వాధ్యాయము ద్వారా చిత్తైకాగ్రతను, నిష్కామసేవ ద్వారా చిత్తశుద్ధిని, ధ్యానము ద్వారా చిత్తశాంతిని పొంది తరించు. చిత్తములో వుండవలసింది చింతలు కాదు. చింతన.
**227** గురువును చేరినపుడే నీకు గుర్తు తెలుస్తుంది. అయితే అట్టి గురువు శాస్త్ర లోతులు తెలిసినవాడై ఉండాలి. ఆశ లేనివాడై వుండాలి. అహంకారము లేనివాడై వుండాలి. ప్రేమమయుడై వుండాలి.
**228** బరువులు దించేది బాధలే నని మరువకు. ప్రతి బాధ వెనుక ఆలోచిస్తే ఒక గాథ ఉందని తెలుసుకో. సరిగా నిన్ను నడిపించేవి బాధలే. నడవమని హెచ్చరించేవి కూడా బాధలే. బోధల్ని ముందుంచే బాధలు సాధకుడవైన నీకు ఎంతైనా ఉపకరిస్తాయి.
**229** మానవుల మధ్య ఈనాడు గోచరించేది ప్రేమ కాదు. ఆకర్షణ. పశుప్రాయమైన పాశము. కనుపించని కామము. మలినపడే మోహము. భగవంతునితోనీకున్న సంబంధమే నిజమైన ప్రేమ. అది తప్ప మిగతా ప్రేమలన్నీ పిచ్చివాని ఉపన్యాసాలే.
**230** మిత్రమా! విషయసుఖాలు ఎంత విషపూరితమైనవో బాగా విచారించి చూడు. విలోకిస్తే సత్యం తెలియదు. విచారిస్తే తెలుస్తుంది. తెలిసిన తరువాత చక్కగా అవలోకించగలవు. వ్యథలు, వ్యాధులు; జన్మలు, మరణాలు; వివాహాలు, విడాకులు; రాగాలు, ద్వేషాలు-వీటన్నిటిని గూర్చి బాగా ఆలోచించు. ఇవి ఎంత గారడి స్వరూపాలో నీకే అర్థమవుతాయి.
**231** నేస్తమా! కోరికలే దుఃఖానికి కారణములని మరచిపోకు. కోరికలు నిజానికి కోడెత్రాచులే నని తెలుసుకో. కోరికలకు తృప్తి ఉండదు. కోరికలను తీర్చుకొనుట వలన సంతృప్తి లభిస్తుందని ఆశించడము భ్రమ. అది అగ్నిని ఆర్పుటకు నేయి నుపయోగించుట లాంటి ప్రయోగము.
**232** ఆధ్యాత్మికంగా జీవించే నీవు పుణ్యాత్ముడవు. అన్యుల విమర్శలను లెక్క చేయకు. ఇతరుల అభిప్రాయాలకు విలువ నొసంగ వలసిన అవసరము నీకు లేదు. అనంతుడైన భగవానుడు నీ దోషరహిత జీవనాన్ని చూస్తూ ఉన్నాడు. ఇక నీకు భయ మెందుకు? మానవుని చూసి చలించకు. మాధవుని చూసి చరించు.
**233** ధర్మజీవనమును విధిగా ఆచరించు. ధార్మికచింతన కలిగియుండు. ధర్మమనెడి కొలతబద్దతో నీ కర్మలను, నీ ఆలోచనలను, నీ భక్తిని కొలిచిచూడు. ఇతరులతో నీ సంబంధము ఎంత ధర్మయుతంగా ఉన్నదో అప్పుడు నీకు అర్థమవుతుంది.
**234** గడప మీద దీపము నుంచితే అది ఇంటి లోపల, బయట

వెలుతురును విరజిమ్మునట్లు, నాలుకపై భగవన్నామము కదిలితే అది
బాహ్యాభ్యంతరాలలో వెలుతురును నింపుతుంది. వెతలను రూపుమాపుతుంది.
**235** స్థూలమైన అశుద్ధ మనస్సు సంకల్పాలను అరికట్టలేదు. సూక్ష్మమైన
మనస్సే సంకల్పాలను అరికట్ట గలుగుతుంది. అట్టి సూక్ష్మమైన మనస్సు శుద్ధమనస్సే
అయి ఉన్నది. శుద్ధమైన అవగాహన ద్వారా శుద్ధ సంకల్పాలు కలుగుతాయి.
**236** విత్తనము నిర్జీవముగనే కన్పడుతుంది. సాగు చేయగనే ఊహించలేని
విధంగా తనలోని శక్తిని వ్యక్త మొనర్చి వృక్ష మవుతుంది. పరమాత్మ స్వరూపమైన
నీలో అనేక సుగుణాలు చోటు చేసుకొని ఉన్నాయి. అవ్యక్తంగాయున్న కళ్యాణ
గుణములను వ్యక్త మొనర్చుటయే సాధన.
**237** ఒక కార్యాన్ని పదే పదే ఆచరించుట వలన అది అలవాటుగా
మారుతుంది. లోకవిషయాల యందు రమిస్తూ వుంటే ప్రాపంచిక విషయవాసనలే
మనస్సులో నిండి కామ్యకర్మలే అలవాటుగా మారుతాయి. తత్త్వచింతనలో చరిస్తూ
వుంటే తాత్వికవాసనలే మనస్సులో నిండి నిష్కామకర్మలే అలవాటుగా మారుతాయి.
**238** శత్రువు శత్రువుగా తెలిస్తే బాధ లేదు. జాగ్రత్తపడే అవకాశ
ముంటుంది. శత్రువు మిత్రుడుగా తెలియుచుండినచో ప్రమాదం చేరువనే
యున్నదని భావము. దేహమునందలి రోగాలు మనకు శత్రువులు.
అవి తెలుస్తున్నాయి.కనుక తొలగించ గలుగుతున్నాము. మనస్సులోని
శత్రువులు మనకు మిత్రులుగాతెలుస్తున్నాయి. అట్టి ఆంతరంగిక శత్రువులైన కామక్రోధాదులు అతి
ప్రమాదకరము.
**239** ఈ ప్రపంచములో నీవు ఒక బాటసారివి మాత్రమే. బాటసారివి యైన
నీవు దారిని మలినపరచ కూడదు. నీవూ సమాజ రహదారిని మలిన పరచకుండా
నడిచిపోవాలి. పైగా దారిలోని కంటకములను తొలగిస్తూ నడక సాగించే అలవాటును కలిగియుండాలి. ఇది
ధర్మం.
**240** శరీరము వృద్ధి చెందుతుంది. ఎందుకో తెలుసా! మట్టిలో కలిసేందుకు,
కానీ మనస్సు వృద్ధి చెందినదా! నీ బ్రతుకే సమృద్ధిగా పండినదని భావము.
సుగుణాలను పెంచుకొని, సుహృద్భావమును ఉంచుకొని, సమదర్శనయోగివైవెలిగిపో!
**241** దుఃఖము వచ్చినపుడు భగవంతుని స్మరించడము, సుఖాలు
చేరువైనపుడు భగవంతుని విస్మరించడము మానవాళికి ఆచారమై పోయింది.
సుఖాలు వచ్చినపుడు కూడా భగవానుని స్మరించ గలిగిన వానికి ఇక దుఃఖమెలా
కల్గుతుంది?
**242** మల్లెపూవుతో మల్లెపూవు కలిస్తే సువాసన అధిక మవుతుంది.
గాడిదతో గాడిద కలిస్తే తన్నులు ఎక్కువవుతాయి. సజ్జన స్నేహము సదా
ఆనందమునే అందిస్తుంది. దుర్జన స్నేహము ఎప్పుడూ దుఃఖమునే పంచుతుంది.
**243** వ్యాధి ఎవ్వరికైనను అనివార్య మైనదియే. మానవునికే గాక పశు
పక్ష్యాదులకు కూడా వ్యాధులు వస్తాయి. పశుపక్ష్యాదులు సహించి శుభ్రపడతాయి.
మానవుడు చికిత్స చేయించుకొని పాడవుతాడు. అనవసరంగా ఆంతర్యంలో
నిలిచియున్న వస్తువును బహిర్గతము చేయుట కుపయోగ పడునదియే వ్యాధి.
**244** సాత్వికాహారాన్ని తీసుకో. వియమిత సమయానికే ప్రతి రోజుభుజించు. మితాహారమునే గ్రహించు. దానికి
ఉపయోగించు ధనము న్యాయార్జితముగా

ఉండేటట్లు చూసుకో. భుజించే ముందు భగవానుని స్మరించి భుజించు. ఈ
ఆచరణ నిన్ను పూర్ణ ఆరోగ్యవంతుని చేయును.
**245** జీవితమొక అనంత ప్రవాహము. ఈ ప్రవాహము కదిలి కదిలి
చివరగా శాంతికడలిని చేరి కనుమరుగవుతుంది. ఇది తెలిసి హాయిగా తేలుతూప్రవాహంతో కదిలిపోపువాడు
ఆస్తికుడు. ముందుకు నడవను ఇష్టములేక ప్రయత్నము ఆగిపోయేందుకు ప్రయత్నించువాడు నాస్తికుడు.
**246** శ్యామసుందరుని పదసరోజములు ఎంత కోమలమైనవి? అట్టి
సుకుమార పాదములు నీ హృదయమున ఉండవలె నన్నచో నీ హృదయము ఇంకా
మృదువుగా ఉండక తప్పదు. మిత్రమా! నీ హృదయములో చోటుచేసుకొని యున్న
కఠినమైన భావాలను తొలగించి శుద్ధిపడు.
**247** ఇంద్రియ విషయాలలో సుఖ మున్నదని భ్రమపడకు. అది ఎండమావిలో
నీటికొరకు ప్రయత్నము చేయుటలాంటి పని. విషయాలన్నీ ఆద్యంతములు కలవి.
అశాశ్వతమైనవి. అనుభవము తర్వాత ఆవేదనను పంచి పెట్టేవి. కనుక సాధకులు
మోసపూరితమైన ఇంద్రియ విషయాల పట్ల మోహము లేకుండా జీవించాలి.
**248** పరిస్థితులు అనుకూలముగా లేవని దుఃఖమును పొందకూడదు. మారే
పరిస్థితులు నీ అధీనములో ఎలా వుంటాయి. పరిస్థితులు నీ అధీనంలో ఉండవు.
కానీ ప్రవర్తన నీ అధీనమే. మారే ఋతువులను వృక్షాలు తమ మనుగడకు ఎలా
ఉపకరించు కుంటాయో, మారే పరిస్థితులను ఆధారముగా గొని సాధకుడవైన నీవు
ప్రగతిని సాధించాలి.
**249** యశోద శ్రీ కృష్ణుని రోటికి కట్టివేసెను. శ్రీ కృష్ణుడు బంధములోపడెను. అయినను యమళార్జున
వృక్షములను పడదోసి మణిగ్రీవ యమకూబరులకు
శాపవిమోచనమును ప్రసాదించెను. తాను బంధములో వుండినను ఇతరుల
బంధములను తొలగించు వాడే దైవస్వరూపుడు.
**250** ఆలయములో భగవంతుని దర్శించుట పరమ పవిత్రమైన కార్యము.
కానీ నీ హృదయ గుడిలో చూడగలిగినచో ఆ తరువాత అన్ని రూపాలలో భగవానుడే
గోచరించుచుండును.
**251** పుణ్యము చేయకపోవుటయే పాపము. పాపము చేయకుండుటయే
పుణ్యము. ఈ విషయమును చక్కగా నెరిగినవాడవై పుణ్యకర్మ లాచరించి
తరించుము.
**252** శరీరము ఎక్కడ చరించినా ఫరవాలేదు. మనస్సు మాత్రము
బృందావనము నందే ఉండాలి. బృందావనములో శ్రీకృష్ణుడు ఉంటాడు.
బృందావనంలో ఉండగలిగితే ఆత్మానందము లభ్యమైనట్లే. మరి బృందావన
మెక్కడ? నీ హృదయమే నిజ బృందావనము. వెళ్ళు...... ఆలసించకుండా వెళ్ళు.
**253** ప్రమిదలో తైలము లేనిచో దీపము ఆరిపోవును. హృదయములో భక్తి
కొరవడినచో జీవి అన్యాయ మగును. భక్తి లేనివాడు యథార్థానికి శక్తి హీనుడే. భక్తిని
అనుభవించుట కొరకే మానవుడు జన్మ నెత్తినాడు.
**254** విడిపోయే శరీరాన్ని రక్షించుకొనేందుకు మానవుడు అకుంఠిత దీక్షతో
పనిచేస్తుంటాడు. కానీ కలిసి ప్రయాణము చేసే మనస్సును గూర్చి క్షణమైనను
యోచించ డెందుకనో?
**255** దానగుణము దైవగుణము. మనకు భగవానుడు ప్రసాదించిన దానిని

ఇతరులకు కూడా అందించే సద్గుణమును కలిగి యుండాలి. మనవద్ద దానమును పుచ్చుకొనువాడు వాసుదేవుడే అనే భావనతో దానము చేయాలి.

**256** దోమలున్న చోట దోమతెర ఉండవచ్చును. కానీ దోమతెర లోనికి దోమలు రాకూడదు. అలాగే నీవు సంసారములో ఉంటే దోషము లేదు. సంసారము నీలో ఉంటేనే దోషము.

**257** జ్ఞానమనే ఏనుగు నెక్కి శాంతివీధులలో నీవు ఊరేగుతుంటే, చూసి ఓర్వలేని ప్రాపంచిక జీవులనబడే శునకాలు తెగ మొరుగుతాయి. అంతమాత్రాన అంబారీలో ఊరేగే నీకు అవమానము కలుగుతుందా?

**258** భక్తుని ఉద్ధరించేందుకు భగవానుడు అంతటా ఉంటాడు. తనను ఉద్ధరించే భగవానుని, భక్తుడు అంతటా కలుసుకుంటాడు.

**259** నీవు ఇతరులకు ఆనందము కలిగించలేక పోయినను ఫరవాలేదు. దుఃఖమును మాత్రము కలిగించకుము.

**260** సర్వులకు ఆనందమును ప్రసాదించువాడే భగవానుడు. భగవంతునికి ప్రేమ తప్ప రెండవ విషయము తెలియదు. దుష్టులను శిక్షించునది పరమాత్మ కాదు. వారి పాపమే వారిని హరిస్తుంది. శిక్షిస్తుంది.

**261** బిడ్డలంటే అందరికీ ప్రీతియే. పిల్లలు ప్రేమస్వరూపులు. అహంకారము తయారుకాని అమాయకులే పిల్లలు. రాగద్వేషములు తెలియని అమృతరూపులే బిడ్డలు. నీవూ పిల్లలవలె జీవించు. భగవత్కృపకు పాత్రుడవు కాగలవు.

**262** ఆవేశపరులైన వారి ప్రక్కన తిరుగుచుండినచో వారి ఆవేశము వలన మన హృదయంలో కూడా ఆనందము అదృశ్యమై, ఆవేశమే మిగులును. అలాంటి వారు మన చెంతకు వచ్చినపుడు వారికి శాంతిని పంచి పెట్టే శక్తిని నీవు కలిగియుండాలి.

**263** వస్తుభ్రాంతిలో తగులుకొనిన మానవులు వస్తువులను వదలకనే వస్తురహిత చైతన్యశాంతి కలుగవలెనని అభిలషించుచుందురు. అశుద్ధమైన మనస్సు ఆత్మానందమును పొందగలదా?

**264** మౌనవ్రతము మహిమాన్వితమైన వ్రతము. మౌన సమయమున ధ్యానము నందో, లేదా లిఖిత జపము నందో కాలము గడపాలి. మౌనము వలన నీకు శాంతి లభించును.

**265** శిశువు ఆనందముతో జీవించుచుండును. సర్వులను ఆకర్షించు చుండును. శిశువు యొక్క మూర్తిమత్వము ఇలా ప్రభవించుటకు కారణమేమి? శిశువు దేనినీ వాంఛించదు. దేనినీ త్యజించదు. రాగద్వేషాలకు దూరమై జీవించుటయే శిశువు యొక్క ఆహ్లాదమునకు కారణమై యున్నది.

**266** పాంచభౌతికమైన ఈ దేహముపై మోహమును వీడి జీవించుము. ఈ దేహము నీ సేవకుడు అని భావించుము. పరికరమని తలంచుము. అవినాశివి యైననీవు ఈ దేహము కన్నను అన్యమైనవాడివి. ఈ విషయమును సదా స్మృతి యందుంచుకొని జీవనయాత్రను సాగించుము,

**267** సంతృప్తితో జీవించే సదలవాటును కలిగియుండాలి. విచారణ ద్వారా ఈ సుగుణము లభిస్తుంది. బుద్ధికి అవగాహనను కల్పించాలి. ప్రాపంచిక విషయానురక్తితో చరించేమనస్సును అంతర్ముఖం చేయాలి.అప్పుడేసంతృప్తిలభిస్తుంది.

**268** సున్న విలువలేని దానివలె కన్పిస్తుంది. కానీ సున్నకు మించిన విలువైనది మరొకటి విశ్వంలో గోచరించదు. తనకు తానుగా సున్న విలువ లేనిదైనా ఒక అంకె ప్రక్కన వుంచినపుడు ఆ అంకె యొక్క విలువను సున్న పెంచును. ఎన్ని సున్నలు ప్రక్కన అమర్చుతూ వుంటే విలువ అంతగా పెరుగుచుండును. నిజమైన సాధువు సున్న వలె వుండి వ్యక్తులనెడి అంకెలకు విలువను హెచ్చించుచుండును.

**269** పక్షి ఆకాశములో ఎంత ఎత్తున ఎగిరినా, రెక్కలు నొప్పి పుట్టినపుడు వృక్షముపై వచ్చి కూర్చొనును. ప్రాపంచిక సుఖాలు శాశ్వతమని భావించి వాటి మధ్య అవిశ్రాంతముగా నీవు చరించినా, శాంతిని అభిలషించి ఒకనాడు తప్పనిసరిగా శ్రీనాథుని పాదపద్మములను ఆశ్రయించక తప్పదు.

**270** గాలి ఎలా కదులుచుండునో మనస్సు అలా చలించుచుండును. మంచి, చెడు అనెడి వాసనలను గాలి మనకు అందించునట్లు ప్రాపంచిక విషయ వాసనలను మనస్సు మనకు అందించును. మనస్సు విషయమున జాగరూకతతో మెలగుతూ ఉండాలి. సద్వాసనలను గ్రహించి, చెడు వాసనలను విస్మరించే జ్ఞానమును మనస్సునకు అందించాలి.

**271** ప్రపంచంలో నీతి అడుగంటినదని, నిజాయితీ నశించిందని నీవు వాపోతూ ఉంటావు. రచనలు చేస్తావు. ఉపన్యా సాలిస్తావు. మరి నీవు ఆశించే నీతి నిజాయితీలు నీలో ఉన్నవేమో ఆలోచించి చూసుకో. నీలో లేని సుగుణాన్ని ప్రపంచంలో ఎలా తీసుకరాగలవు? తాను వెలుగుతున్నపుడే దీపము ఇతరదీపములను వెలిగించగలదు.

**272** శిక్ష ననుభవించు కాలములో ఖైదీ ధరించు బట్టలు కూడా తనవి కావు. శిక్షాకాలము పూర్తియైన పిదప విడుదలయ్యే సమయాన కారాగృహంలో ఇంతవరకు తాను ఉపయోగించిన బట్టలను అక్కడనే వదిలి తనదైన బట్టను ధరించి విశ్వములో కాలు పెట్టును. మిత్రమా! ప్రపంచ బందిఖానాలో మన దేహము కూడా మనది కాదు. శిక్ష పూర్తికాగానే దేహాన్ని ఇక్కడే వదిలి వెళ్ళవలసి వస్తుంది. జీవత్వ భ్రాంతి ఉన్నంతవరకు ఈ ఖైదీ దుస్తులు మనకు తప్పవు.

**273** దిగితేకాని లోతు తెలియదు. తింటేగాని రుచి తెలిసిరాదు.అనుభవించినపుడు గాని ఆత్మానందము అర్ధముకాదు. వాచావేదాంతము వక్తకు, శ్రోతకు ఇద్దరికీ ప్రమాదకరమే. అనుష్ఠావవేదాంతమే ఆరోగ్యప్రదము.

**274** ఆకాశము శూన్యము. అనగా ఏమీ లేనిది అని భావము. ఏమీ లేకుండా తాను తయారగుట వలననే సమస్తమును తనలో అది నింపుకో గలుగుతున్నది. నీవూ అహంకార మమకారములను వీడి శూన్యమైనపుడు విశ్వమంతయూ నీ హృదయములో ఒదిగిపోతుంది.

**275** ధ్వని ననుసరించే ప్రతిధ్వని ఉంటుంది. చర్యను బట్టే ప్రతిచర్య సాగుతుంది. మంచి చేశావా! మంచినే అనుభవిస్తావు. చెడు నాచరించావా! చెడునే రుచి చూస్తావు. ఏది ఏ బ్రతుకులో లభించాలని ఆశిస్తున్నావో దానిని ముందు ఇతరుల బ్రతుకులలో చొప్పించేందుకు ప్రయత్నించు.

**276** అగ్ని కన్నా అగ్నితో కలిసిన ఇనుము దారుణముగా ప్రవర్తిస్తుంది. అలాగే చెడు కన్నా చెడును కలిగియున్న చెడ్డవాని సహచర్యము భయంకర ఫలితాలను అందిస్తుంది. దుస్సంగమును సర్వవిధముల త్యజించాలి.

**277** మంచివా రెన్నడూ మంచినే చూస్తారు. మంచినే వింటారు. మంచినే మాట్లాడుతారు. మంచినే ఆలోచిస్తారు. చేస్తే మంచి చేయాలి. లేనిచో ఏమి చేయకుండామంచివాడుగాఉండిపోవాలి.అంతేగాని చెడునెన్నడూఆచరించకూడదు.

**278** మందు పుచ్చుకొన్నంత మాత్రాన రోగికి స్వస్థత చేకూరదు. అనుపానమును కూడా అనుసరించు రోగియే త్వరగా ఆరోగ్యవంతు డగును. ఆధ్యాత్మిక సాధనలు వేద జప ధ్యానాదులు జీవత్వ మనెడి రోగానికి మందులై ఉన్నాయి. శీలసంపద యనెడి అనుపానము తోడు లేనిచో, రానిచో మందు నిరుపయోగ మగును.

**279** ప్రపంచాన్ని, సంసారాన్ని అతిగా ప్రేమించడము కూడా బంధమే. ఒకనాడు ఈ ప్రేమలన్నీ వ్యక్తికి అనంత దుఃఖాన్ని అందిస్తాయి. ఆనాడు తెలుసుకుంటాము ఇలా దు:ఖించడానికేనా అంతగా ప్రేమించాము అని.

**280** వజ్ర మేమిటో తెలియని వానికి వజ్రము లభిస్తే వాడు దానినిఅన్యాయముగా పారవేస్తాడు. వజ్రము పేరు మాత్రమే వినినవాడు గాజుముక్కలనువజ్రములని భద్రపరచుకొంటూ వుంటాడు. వజ్రాల వ్యాపారి యగు గురువు నీకు
లభించాడా! గాజుముక్కలను గాజు ముక్కలుగా త్యజించగలవు. వజ్రములను వజ్రములుగా భద్ర పరచుకోగలవు.

**281** ఓ బాటసారీ! మతిచెడిన నీవు రసగుల్లాలు నీ సంచిలో ఉన్నవనేవిషయాన్ని మరచి ఆకలికి గడ్డి తింటున్నావా? ఇప్పుడు నీవు చేయవలసింది పదార్థసేకరణ కాదు తత్త్వ విచారణ.

**282** కలుపు తీసినపుడే మొక్క మలుపు తిరుగుతుంది. ఊక తీసినపుడే ధాన్యం ఉపకరిస్తుంది. అనిత్య వస్తువులకు నీవు దూరమైనపుడే నిత్యవస్తువు నీకు లభిస్తుంది. ప్రపంచాన్ని విస్మరించినపుడే పరమాత్మను స్మరించ గలుగుతావు.

**283** చెదపురుగు లాగ క్రోధము చిత్తాన్ని చలింపజేస్తుంది. వివేకాన్నిహరిస్తుంది. విచారాన్ని మరుగుపరుస్తుంది.వ్యామోహాన్ని పెంచుతుంది.కామక్రోధాల నుండి విముక్తు డైనవాడే యతి కాగలడు.

**284** నూనె దీపాన్ని నిత్య వెలుగుతో నింపుతుంది. సత్యము జీవితాన్ని ప్రకాశవంతము చేస్తుంది. నూనె లేని దీపము ఆరిపోక తప్పదు. సత్యము లేని బ్రతుకు చితికి ఆహుతి కాకపోదు.

**285** ముత్యానికి విలువే గాని ముత్తెపు చిప్పకు విలువేముంది? మిత్రమా! ఆత్మకు విలువే గాని దేహానికి విలువ ఎలా వస్తుంది? నిత్యమైనది ఆత్మయే, దేహము ఎవరిదైనా అనిత్యమైనదే.

**286** ఆశ లేనివాడు భక్తుడు. అట్టివాడే భగవత్ప్రేమకు అర్హుడు. ప్రేమ గలవాడే భగవద్భక్తుడు కాగలడు. ప్రేమ అందిస్తుందే గాని అందుకోదు. ప్రేమకు సేవించడమే తెలుసు. సేవలు అందుకొనుట తెలియదు.

**287** కుబుసమును వదులుట వలనవే సర్పానికి ఆరోగ్యము, అందము లభిస్తాయి. సాధకుడవైన నీవు కూడ చెడు వాసనలను వదులుట వలననే ఆత్మానందముతో శోభించగలవు.

**288** ధైర్యవంతుడే ధర్మాచరణము సాగించగలడు. పిరికివాడు, సోమరిపోతు అధర్మానికి ప్రతిరూపము వంటివాడు. క్షుద్రమైన హృదయ దౌర్బల్యము ఎవ్వరికి మంచిది కాదు. నీవు ఆత్మవే ననెడి భావమును వదలకుండా పట్టుకో.

**289** మందును వైద్యుడు ఇస్తాడు. ఆరోగ్యాన్ని నారాయణుడు ఇస్తాడు. సేవకులను మనం ఎన్నుకుంటాము. స్నేహితులను భగవానుడు ప్రసాదిస్తాడు. ఆహారమును మనం సమకూర్చుకుంటాము. ఆకలిని అచ్యుతుడు అందిస్తాడు. అతడి ప్రమేయం లేకుండా ఏ మంచీ నీకు అందదు.

**290** "నేను చెడ్డవాడిని-నాలోని చెడును తొలగించుకోవాలి" అని ఏకరువు పెట్టకు. చెడును తొలగించుకొను ప్రయత్నము కన్నా మంచిని కలిగించుకొను ప్రయత్నమే ఉత్తమమైనది. వెలుతురు రాగానే చీకటి నిలుస్తుందా! మంచి పెరుగుతుంటే చెడు తానంతటదే దూరమవుతుంది.

**291** భూమి సారవంతముగా యున్నప్పుడే మొక్కలు పెరుగుట జరుగుతుంది. రాతిపేలలో మొక్కలు పెరుగుతాయా? మిత్రమా! హృదయాన్ని నిర్మలంగా, మెత్తగా వుంచినపుడే సుగుణము లనెడి మొక్కలు పెరుగుతాయి. దోషపూరితముగా, కఠినముగా ఉంటే సద్భావాలే కదలవు.

**292** శుద్ధమైన దర్పణము నందు నీ ప్రతిబింబము గోచరిస్తుంది. నీ బుద్ధిని కూడా శుద్ధముగా, నిర్మలముగా ఉంచుకో. పరమాత్మ నీవైపు దృష్టిని సారించగనే అతని ప్రతిబింబమును నీ బుద్ధి వ్యక్తపరచే లాగుండాలి. ప్రయత్నించు.

**293** తల్లి బిడ్డకు తండ్రిని చూపిస్తుంది. తండ్రి బిడ్డకు గురువునుచూపిస్తాడు. గురువు శిష్యునికి పరమాత్మను చూపిస్తాడు. తల్లిదండ్రులు తమ బిడ్డలకొరకే ప్రయత్నాలు సాగిస్తారు. గురువుఅందరిని తనబిడ్డలుగా చూసుకొనిఉద్ధరిస్తాడు.

**294** తల్లిదండ్రులు ప్రతి జన్మలోను లభిస్తుంటారు. వారి ప్రేమలు తాత్కాలికమే, అవి మనల్ని ఉద్ధరించవు. గురువు ఒకే ఒక్కసారి నీ బ్రతుకులో ప్రవేశిస్తాడు. ఆ తరువాత నీకు జన్మలే కదలవు.

**295** కోపము చాలా భయంకరమైనది. అది ఒక్క నిముషమే ఉంటుంది. కానీ అది చేసే గాయం ఎప్పుడు నయమవుతుందో చెప్పలేము. పరమాత్మ ఎదుట సాష్టాంగపడి కోపాన్ని, ఆవేశాన్ని వదిలిపెట్టేయి. ఆవేశము లంతరించిన వ్యక్తిలో సత్యవస్తువు నిత్యమై భాసిస్తుంది.

**296** పశువుకు బాహ్యదృష్టియే గాని అంతర్దృష్టి లేదు. మానవుడు కూడాబహిర్దృష్టిలోనే నడిచి, అంతర్దృష్టిని అలవరచుకో లేనపుడు ఇక మనిషికి,పశువుకితేడా ఏమున్నది.

**297** నాలుక ఒక విచిత్రమైన పరికరము. ఒకవిధంగా అది ప్రమాదకరమైన ఆయుధము. మరొక విధంగా ప్రమాదకరమైన సాధనము. కత్తి పండును కోస్తుంది. గొంతును కూడా కోస్తుంది. అలాగే నాలుక గాయాన్ని చేస్తుంది. గాయాన్నిమాన్పుతుంది కూడాను. కత్తి చేసే గాయాలు మానిపోతాయి. నాలుక చేసే గాయాలుమానవు.

**298** గాలి లేని చోటనే దీపం నిలుస్తుంది. సంశయాలు లేని హృదయం లోనే భగవంతుడు నిలుస్తాడు. అనుమానము అతి భయంకరమైనది. విశ్వాసంతో జీవించువానికి విశ్వంలో ఏదీ అడ్డు నిలువదు.

**299** మంచిచెడులను గూర్చి పలవరిస్తూ, సమాజంలో జరిగే ప్రతివిషయాన్ని, నడిచే ప్రతి సన్నివేశాన్ని ముందువేసుకొని చర్చిస్తూ, న్యాయవాదిలా వాదిస్తూ, న్యాయాధిపతిలా తీర్పు చెబుతూ కాలాన్ని వ్యర్థం చేసుకోవడం శుద్ధఅవివేకం. నీవు వచ్చిన పనిని త్వరగా ముగించుకో.

**300** మిత్రమా! సమాజంలో జరిగే మంచిచెడులను విచారించి న్యాయ

నిర్ణయంచేసే వ్యాయాధిపతి పదవిని చేపట్టావా! అయితే ఒక్క మాట విను. నీలో చెడును గూర్చి ఆలోచించు. ఇతరులలోని మంచిని గూర్చి ఆలపించు. అప్పుడే నీవు ఉత్తమ వ్యాయాధిపతివి అవుతావు.

**301** ఆవులో పాలూ ఉన్నాయి, రక్తమూ వుంది. మానవులు క్షీరాన్ని పానము చేస్తున్నారు. దోమలు రక్తాన్ని త్రాగుతున్నాయి. మంచి వారెప్పుడూ మంచినే గ్రహిస్తారు. దుర్జను లెప్పుడూ చెడునే వాంఛిస్తారు.

**302** వచ్చిన ఉత్తరాన్ని పుచ్చుకోకపోతే అది పంపిన వానికే చేరుతుంది. చేసిన నిందను అందుకోకపోతే అది నిందించిన వానికే చేరుతుంది. అవగాహనే బ్రతుకుకు ఆనందాన్ని ప్రసాదిస్తుంది.

**303** ఒక వ్యక్తి ఉద్యోగములో చేరుతాడు. అతడు చేయవలసిన విధి నిర్ణయింపబడే ఉంటుంది. అలాగే ఈ ప్రపంచ కార్యాలయములో ఉద్యోగిగా ప్రవేశించిన నీవు చేయవలసిన పనులు కొన్ని ఉన్నాయి. పుచ్చుకోవలసిన పైకమూ వుంది. ఇవి విశ్వచట్టాల పై ఆధారపడి ఉన్నాయి. తొందరపడకు. వీటిని ఎవ్వరూ తారుమారు చేయలేరు.

**304** ఉద్యోగంలో చేరిన తరువాత బదిలీ తప్పదు. విధి నిర్వహణ చక్కగా ఉంటే పెద్ద ఉద్యోగము లభిస్తుంది. పొరపాట్లు జరిగితే క్రిందికి బదిలీ చేయడము జరుగుతుంది. ప్రపంచములో కాలిడిన తరువాత కాష్టానికి ప్రయాణము తప్పదు. పుణ్యకార్యాలు చేస్తే ఉత్తమజన్మ లభిస్తుంది. పాపకార్యాలు చేస్తే అధమజన్మప్రాప్తిస్తుంది.

**305** సేవ చేయించుకొని జీతమిచ్చే యజమానికి రోజుకు ఎన్నోసార్లునమస్కరిస్తావు. కానీ ముందే జీవితమనే జీతమిచ్చిన యజమానికి కనీసం ఒకసారైనానమస్కరించాలని నీ కనిపిస్తున్నదా! కృతజ్ఞత కుంటుపడిన వ్యక్తి పశువు కన్నాగొప్పవాడా?

**306** లోకాన్ని బాగుచేయాలని నిర్విరామంగా పలికిన మాటలు లోకానికి ఏమి ఉపకారము చేశాయి? ఇంతవరకు మాట్లాడి సాధించింది ఏమి లేదు గనుక ఇకమీదటపద్ధతి మార్చుకుందామా! ఇకనుండి సాధించినవిషయాన్నే మాటలాడుదాము.

**307** విషయానందము నిత్యానందము కాదు. అపరిపూర్ణమైన వస్తు ప్రపంచము నుండి లభ్యమయ్యే ఆనందము అపరిపూర్ణము గాక పరిపూర్ణ మెలాఅవుతుంది? దుఃఖమిశ్రితమైన విషయానందము లన్నీ పరిత్యజించ వలసినవియేగాని పరిగ్రహించ వలసినవి కావు.

**308** ఆత్మానందము నిత్యమైన ఆనందము. ఆత్మవైన నీవు ఆనంద స్వరూపమే అయివున్నావు. ఆత్మవైన నీవు అవినాశివి కనుక, ఆత్మానందము కూడాఅమృతరూపమే అయివున్నది. ఇది నిర్వికల్పానందము. దీనిని పెంచేవారు లేరు.తగ్గించేవారు లేరు.

**309** దయ్యాలను నమ్మినంతగా మానవుడు దేవుడ్ని నమ్మలేక పోతున్నాడు.రాత్రులందు చీకట్లో పయనిస్తే దయ్యాలు వెంబడిస్తాయని భయపడతాడు. కానీరాత్రింబవళ్ళు తనను అంటిపెట్టుకునే నడుచుచున్న భగవామని విశ్వసించలేక,చేయరాని పనులుచేసి

దయ్యంలా ప్రవర్తిస్తున్నాడు.
**310** మానవులు పుడుతారు; పశువులు పుడుతాయి. మానవులు పెరుగుతారు;పశువులూ పెరుగుతాయి. మానవులు పరివర్తన
చెందుతారు; పశువులు చెందలేవు.ఇది ఒక్కటే తేడా. ఈ తేడాను
మనిషి చూపలేనపుడు ఇక మిగిలే దేమిటి?పశువులూ చస్తాయి; మానవులూ చస్తారు.
ఆపైన పశువుకు మనిషికి తేడాఏమున్నది?
**311** పుట్టినప్పుడు బోసినోటితో ఏడుస్తూ పుట్టావు. పోయేటప్పుడు బోసి
నోటితో ఏడుస్తూ చస్తావా? ఇక జన్మించినది మొదలు మరణించినంత
వరకు నీవు ఈ ప్రపంచంలో చేసిందేమిటి?
**312** జంతువులు ఆహారసంపాదన కొరకే హింస చేస్తున్నాయి. కానీ
మానవుడు ద్వేషంతో, పగతో హింస నాచరిస్తున్నాడు. ఆహ్! ఇదియేనా మానవ జన్మము యొక్క ప్రాశస్త్యము?
**313** వైరుధ్యాల మధ్య ప్రకృతి విలయతాండవం చేస్తూ వుంటుంది.
మనిషి ఆశించిన దానిని ప్రకృతిలో అందుకోలేడు. తృప్తి,
అసంతృప్తి అనునవి దాగుడు మూతల వలె క్రీడిస్తుంటాయి.
అసంతృప్తి మనిషిని ఎక్కువగా కదిలిస్తూ ఉంటుంది.దీనికి తరుణోపాయము ఒక్కటే. ప్రతిబింబ రూపమైన జగత్తును విస్మరించి
బింబరూపమైన బ్రహ్మమును పట్టుకొనుటయే.
**314** ఈ ప్రపంచము పాకశాల కాదు; పాఠశాల, ఇందులో ఆరగించే
వస్తువులే కాదు ఉండేది; ఆరాధించేవి కూడా ఉన్నాయి. ఇంద్రియాలకు లొంగినంతవరకు ప్రపంచము పాకశాలగానే తెలుస్తుంది. ఇంద్రియాలను లొంగదీసుకొన్నారా!ఇది పాఠశాలగా మిగులుతుంది.
**315** ఈ ప్రపంచ పాఠశాలలో ప్రతివ్యక్తి ఒక ఉపాధ్యాయుడే. ప్రతి
అనుభవము ఒక పాఠమే.రాత్రింబవళ్ళూ పాఠాలు అందుతూనే ఉంటాయి. ఈపాఠశాలలో ఉపాధ్యాయులు మనుష్యులే కాదు. జయాపజయాలు, మానావమానాలు,సుఖదు:ఖాలు అన్నీ బోధకులే.
**316** నీటితో తడిసినపుడే భూమి మెత్తబడుతుంది. చక్కని పంటను
అందిస్తుంది. కన్నీటితో నిండినపుడే బ్రతుకు తేలిక పడుతుంది. జ్ఞానముతో
నిండుతుంది. బ్రతుకుకు కమనీయ బాటను అందించేవి కన్నీళ్లే. వెతలే వెలుగుబాటను చూపే దివిటీలు.
**317** అడవిలో చెట్టుపైన కోతి ఉంటుంది. ఆ చెట్టు క్రిందనే ఏనుగులు,
పులులు, సింహాలు ఉంటాయి. అంత మాత్రము చేత కోతి యొక్క ఖ్యాతి పెరిగేదిలేదు.
సింహము యొక్క ఖ్యాతి తరిగేది ఉండదు. కొన్ని పరిస్థితులలో నీతిహీనులే భాగ్యవంతులుగా

గోచరిస్తారు. ఈ విషయాన్ని దృష్టిలో నుంచుకొని పరిస్థితులుమారినపుడు మహనీయులు చెదరకూడదు.
**318** సంస్కార మనేది ఇతరులు చెబితే వచ్చేది కాదు. అది స్వతహాగా అలవరచుకొన వలసిన ఆత్మనిగ్రహం. శ్రవణం వలననే మనిషి బాగుపడలేడు. ఆచరణ వలన మాత్రమే శోభిస్తాడు.
**319** ధనం సుఖం కన్నా ఎక్కువగా దు:ఖాన్నే అందిస్తుంది. ధనాన్ని ఆర్జించడము దుఃఖమే. ఆర్జించిన విత్తాన్ని రక్షించుకోవడము దుఃఖమే. ఈర్ష్యపడే వారి బారినుండి బయటపడటము దుఃఖమే.
**320** అదృష్టం కలిసి వచ్చినపుడు కొబ్బరికాయలో నీరు చేరినట్లు బ్రతుకు పూర్ణరూపం ధరిస్తుంది. వక్రించినపుడు కరిమ్రింగిన వెలగపండు వలె అంతాబోలుగా ఖాళీయే కూర్చొంటుంది. కలిసివచ్చిన అదృష్టం భగవామని అనుగ్రహమని భావించాలి. వక్రించిన అదృష్టం
పరమాత్మ ప్రసాదమని భావించాలి.
**321** భవనము పునాదిపై ఆధారపడి యుండును. ఎన్ని తుఫానులు వచ్చినా, వరదలు పొంగినా భవనాన్ని నిలిపేది పునాదియే. మానవ జీవన సౌధముకూడా ఆధ్యాత్మిక పునాదిపై నిలబడి యుండాలి. అప్పుడే అది అన్ని ఒడిదుడుకులను తట్టుకొని నిలబడగలదు.
**322** నీవు ఏపని చేసినా అందులో ఇతరుల మేలు కలిసియున్నదో లేదో ఆలోచించి మరీ ఆచరించు. నీ వ్యక్తిగతమైన సుఖము కొరకై ఇతరులకు బాధలను కలిగించకు. ఇతరుల బాగు లోనే నీ బాగు నిండి యున్నదనెడి సత్యాన్ని విస్మరించకు.
**323** సహనముతో ప్రాకిన తీగ శోభాయమానముగా ఉంటుంది. ఓర్పు వహించి జీవితాన్ని నేర్పుగా దిద్దుకుంటే బ్రతుకు కూడా శోభాయమాన మవుతుంది. అవ్యక్త శోభను వ్యక్తమొనర్చుటయే జీవనకళ,
**324** ఉత్తమ శీలవంతుడు, అత్యుత్తమ జ్ఞానవంతుడు, అపరిమిత దయానిధియే గురుదేవుడు. గురుదేవుడు అందించు జ్ఞానముతో బ్రతుకులోనిబాధలన్నీ తీరిపోతాయి. ఆయన ప్రేమలో
బరువులన్నీ దిగిపోతాయి.
**325** నేత్రాలు మంచినే వీక్షించాలి. వీనులు మంచినే వినాలి. నాలుక మంచినే మాట్లాడాలి. అప్పుడే నీవు మంచివాడి వవుతావు. మంచి నీలో కదిలితేచాలు. జ్ఞానమునీ కొరకు పొంచి చూస్తూనే ఉంటుంది.
**326** పరమాత్మ అధీనములో నడిచే ఈ ప్రకృతి చాలా విచిత్రమైనది. మానవుని జీవితాన్ని మలుపు త్రిప్పుటలో గొప్ప శిల్పి వలె పనిచేయును. రాతిముక్కను శిల్పి విగ్రహముగా మార్చునట్లు, రాటుదేలిన విశ్వాన్ని ప్రకృతి

రమణీయంగా తీర్చి దిద్దుతుంది.
**327** ఒకే సూర్యుడు నీరు నిండిన కుండలలో ప్రతిబింబించినపుడు అనేక
సూర్యులుగా గోచరించును. యథార్థానికి సూర్యుడు ఒక్కడే గాని అనేక సూర్యులులేనేలేరు. అలాగే ఒకే ఆత్మ అనేక దేహాలలో అనేకముగా కనుపించుచున్నది.విచారించి చూడగా ఆత్మ ఒక్కటియే గాని అన్యము కాదు.
**328** భూమిని త్రవ్వి లోనున్న నిధినిక్షేపాలను వెలికితీసినట్లు మానవుడు
ఆధ్యాత్మిక సిరిని వెలికితీయవలెను. భూమినందలి మట్టి లాంటిదే మన దేహముకూడా. కానీ అది ఎంత అమూల్యమైన వస్తువును అందించునో తెలియునా! కొన్నియుగాలుగా ఆ మట్టి మనలను అంటి పెట్టుకొని నడుచుచున్నను, దానినిపరిశీలించాలని, పరీక్షించాలని, అందులోని సత్యాన్ని దర్శించాలని ఆలోచించకపోవడం శోచనీయం.
**329** ఏ కార్యములు చేయడం వలన నీవు సిగ్గుతో ముఖము దాచుకొన
వలసి వస్తుందో అలాంటి కార్యాలను ఎన్నడూ చేయకు. చేసిన ఏ కార్యాలు స్మృతికి హృదయం ఆనందముతో పరవశిస్తుందో అలాంటి కార్యాలనే చేయుము.
**330** **"నాది" - "నాది కాదు"** అను రెండు పదములే బంధమోక్షములకు
కారణములు. " నాది " అను భావము చేత మనిషి బద్ధుడవుచున్నాడు. "నాదికాదు" అను భావముచే ముక్తుడవుతున్నాడు.
**331** తనలోతాను తృప్తి చెందని మనస్సు బాహ్యములో ఆనందమును
పొందడ మనునది సత్యదూరమైన విషయము. అసత్యపు టాలోచనలను చేయుఅలవాటును మనస్సునకు తగ్గించాలి. ఆత్మానాత్మ వస్తు వివేకమే దీనికి సరియైన దారి.
**332** సమదృష్టి అంటే అందరిలో మన్న ఒకే చైతన్యమును దర్శించడమని
భావము. భేద దృష్టి ఎన్నడూ కదలకూడదు. మట్టి పాత్రలను అనేక నామములతోపిలిచినా వాటిలో నిండియున్నది మట్టియే నని మనకు
బాగా తెలుసు. అలాగే ఈ చరాచర భూతజాలము నందు నిండియున్నది. భగవానుడే యని గ్రహించాలి.గుర్తించాలి. దర్శించాలి.
**333** తెరపై బొమ్మలు కదులును. తెర ఆధారము. బొమ్మలు ఆధేయము.
ఆధేయమైన బొమ్మలు అదృశ్యమైనను ఆధారమగు తెర అగుపించుచునే యుండును. బొమ్మలు చూడ నలవాటు పడినవానిలో సుఖదు:ఖాలు కన్పించును.తెరను దర్శించువానికి శాంతి కలుగును. పరమాత్మ తెర వంటివాడు. ప్రపంచము బొమ్మల స్వరూపము.
**334** ఎండమావి అని తెలిసిన వానికి కూడా ఎండమావి అదృశ్యం కావడం
లేదు. దృశ్యమున్నది కాని దానిని వెంబడించు దౌర్బల్యము దూరమైనది. అలాగేఆత్మజ్ఞాని జగత్తును దర్శించును. అయితే అతడికి జగత్తు జగత్తుగా గోచరించదు.జగత్తు బ్రహ్మముగానే తెలియును.

**335** భ్రాంతి తొలగితే చాలు. శాంతి నన్వేషించ పనిలేదు. ఆత్మయే శాంతి.
దానిని నీవు అంగీకరించలేవు. అలాగని నిరాకరించనూ లేవు. నీకన్నా అన్యమైనదానిని నీవు అంగీకరించగలవు. నీవు గాని దానిని నిరాకరించలేవు. ఆత్మ నీకన్నావేరు కానందున దాని విషయములో నిర్ణయమూ లేదు. నిషేధమూ లేదు.

**336** నీకు ప్రబల శత్రువు నీ మనస్సే. సర్వ అనర్థములకు మనస్సే
కారణము. కదిలే మనస్సును కరగనీ, కనుమరుగు కానీ, కాలిపోనీ,
తరువాత నీవేవుంటావు. ఆత్మగానే వుంటావు.

**337** ఏదీ లేనిచోట అంతా వుంటుంది. శూన్యము కాగలిగితే పూర్ణం
అవగత మవుతుంది. నిండిన మనస్సు పండదు. ఎండిన మనస్సు పండుగ
గాకపోదు."అహం" నిండితే ఇహపరాలు మిగలవు. "అహం" తొలగితే "పరం" ఇహం లోనే ఇముడుతుంది.

**338** ప్రకృతిలో శోభించు వికసితపుష్పాలు ప్రమోదభరితములు. వినోద
చరితములు. అనూహ్య అతులితములు. ఆనంద మిళితములు. మానవునిలో గోచరించు అపూర్వ సద్గుణ పుష్పాలు వికాసయుతములు. విశాల దృక్పథములు.విజ్ఞాన సాధకములు. విశ్రాంతి బోధకములు.

**339** మనోభిప్రాయాలను మలినం కాకుండా చూసుకోవడమే అహింస.
మాలిన్యంలేని మనుగడను సాగించడమే అహింస. తన జీవన మెలాంటిదో ఇతరులజీవనము అలాంటిదే నని గ్రహించి తదనుగుణముగ జీవించడమే అహింస. తననుసమస్తములో దర్శించడమే నిజమైన అహింస.

**340** సర్వభూతములను తనవలె చూచుకొనుటయే "దయ" అనబడుతుంది.దయగల
హృదయమే భగవన్నిలయము. మనస్సు గలవాడు ఆలోచనల నందించును.హృదయము గలవాడు దయను చిందించును. హృదయము భగవానుని మందిరము.
మందిరములో భగవానుడు ఉండును. హృదయము అనెడి పదములో మధ్యనున్నరెండు అక్షరములు "దయ"గా వున్నదని మరచిపోకు.

**341** "ఓర్పు" యనునది అత్యుత్తమమైన దైవగుణము. ఇతరులకు తీర్పు
నొసంగునపుడు. అందరూ ఓర్పుగానే కనుపిస్తారు. తమ జీవితములో మార్పును ఇతరులు సూచించగనే ఓర్పు నశించును. తనకు ఓదార్పు గలిగేదే నిజమైన ఓర్పు.ద్వేషాగ్నిని ఆర్పు ఏకైక సాధనమే ఓర్పు. అసూయా వ్యాధిని మాన్పు దివ్యౌషధముఓర్పు.

**342** మోక్షగుడి తలుపులు తీయుటకు తపస్సే తాళంచెవియై ఉన్నది.
నిరంతర తపోభ్యాసముచే మనస్సులో ప్రశాంతత ఏర్పడును. ఇంద్రియ కల్లోలములు ఆగును. హృదయములో శాంతి నిండును.

**343** మనస్సులో సంకల్పముల సంఖ్యను తగ్గించాలి. ఆలోచనా ప్రవాహమునుఆపాలి.
గతాన్ని గూర్చిన ఆవేదన, భవిష్యత్తును

గూర్చిన ఆందోళనదూరంచేసి,వర్తమానంలో ఆవేశములేకుండా
యజ్ఞభావంతో జీవించాలి.
**344** వాసనలను ప్రక్షాళనం చేయాలి. వాసనలు క్షాళనం కావలె నన్నచో
ఆసక్తి లేకుండా కర్మల నాచరించాలి. కర్మఫలితాన్ని భగవత్ప్రసాదముగా
భావించాలి.సుఖదుఃఖముల యందు సమస్థితి కలిగి యుండాలి. యజ్ఞభావంలో
కర్మలనాచరించడం అలవరచుకోవాలి.
**345** దానగుణ మనునది మనిషి ఆంతరంగిక జీవనశోభను తెలుపు
దివ్యగుణము. తనకున్న దానిని బట్టి గాక, తాను ఇతరులకు అందించుటను బట్టి వ్యక్తి
ధనవంతుడగును.
**346** నావ నడచుటకు నీరే కావాలి. ఆధ్యాత్మిక చింతనాపరుడు శీల
వంతుడయ్యే ఉండాలి. కొయ్య మండుటకు అగ్ని అవసరమైనట్లు, తాత్విక జీవనకాంతికి
శీలము అతిముఖ్యమై యున్నది. సాధకునిలో దీప్తిమంతంగా జ్వలించేసృజనాత్మక శక్తి
శీలమే.**347** సంపద కాలములో కదులుతుంది. కాలములో కలిగిన సంపదకాలములో
అంతరించకపోదు. కాలపరిధిలో అడుగుబెట్టని సంపదయే మానవునికిపూర్ణానందమును
ప్రసాదించగలదు.
భగవత్స్మరణయే నిజమైన సంపద.
**348** ఆకలిగొన్నవాని క్షుద్బాధ తీర్చవలసిన అవసరము ఎంతైనా వుంది.
అన్నదానమనేది అన్నార్తులగు వారి ఆక్రందనలను తొలగించేదై ఉండాలిగాని,అసమర్థులను
తయారుజేసే వ్యవస్థగా మారకూడదు. అపాత్రదానము హానికరమేగాకుండా
ప్రమాదభరితమైనది కూడా.
**349** శాంతిని పొందుతావా? అయితే ఒక్కటే మార్గం. కోరికలను
శాంతింపజేయి. అంతే. నిస్తరంగ జలధివలె నిలిచియున్న శాంతిసాగరములో మునకవేసి
ప్రశాంతిగా మారిపో. అశాంతి హస్తాల నుండి జారిపో. మానవత్వమునుఅధిగమించి
దైవత్వములో వెలిగిపో.
ఆప్తకాముడుగా నిలిచిపో.
**350** ఇతరులు మనపై జూపు కరుణ, సానుభూతి మతాబుల వంటివి.
స్థిరముగా నిలువవు. ఒకవేళ స్థిరంగా నిలవాలంటే వారి కనుగుణ్యముగా ప్రవర్తించిఅధర్మంగా
చరించాలి. కనుక జనస్తుతిని ఉపేక్షించినచో సాధకుడు ప్రశాంతతతోధర్మయుతంగా
జీవించగలడు.
**351** మనస్సులో ఉదాసీనత చోటు చేసుకోవాలి. మనస్సులోని సంకల్పాలను
మనం చూస్తున్నాము. గనుక మనము మనస్సు కన్నా భిన్నమైనవారము. మనస్సులోకలిగే
సంకల్పాలను, ఉద్రేకాలను సాక్షిగా వీక్షించడముచేత ఉదాసీనత కలుగుతుంది.
**352** ప్రేమనేత్రాలకు దోషాలు కనుపించవు. ప్రేమరాజ్యంలో ద్వేషానికి,

ద్రోహానికి, మోహానికి, మోసానికి తావు లేదు. ప్రేమ ఎంతటి కష్టాన్నయినా సుఖంగామార్చుకుంటుంది.
**353** చూస్తే బాధలేదు. రుచి చూస్తేనే బాధ. కరెంటును చూస్తే బాధలేదు. తాకితేనే బాధ. ప్రపంచములో జీవించడము బాధ కాదు. ప్రపంచములో రమిస్తేనే యాతన.
**354** అద్దము మురికిచే నిండినపుడు ప్రతిబింబము గోచరించదు. దర్పము పైనున్న మాలిన్యమును తొలగించగనే, ప్రతిబింబము గోచరిస్తుంది. తపోధ్యానాదుల ద్వారా మనోమాలిన్యము తొలగించబడగనే ధ్యానస్థితిలో ఆత్మానుభవము కలుగుతుంది.
**355** కోరికలకు అంతమనేది ఉండదు. తీర్చుతున్న కొద్ది వేయినాల్కలను చాచి ఆక్రోశిస్తూనే ఉంటుంది. కారాగారములో యున్న వాడు శారీరకంగా ఖైది.కోరికల మధ్య నున్నవాడు మానసిక ఖైది. కోరికలు మానవుని పిచ్చివాడ్నిగా చేసివస్తు ప్రపంచము చుట్టూ పరిభ్రమించేలా చేస్తాయి.
**356** అత్తరు సుగంధాలను అలదినా, వికసిత పుష్పములతో నింపినా శవదర్శనం ఎవ్వరికైననూ అవాంఛనీయమే. అప్రియమే. అలాగే దేహసౌష్ఠవము,సౌందర్యము ఎంతగా భాసించినను శీలము లేని వ్యక్తి యొక్క బాహ్య సౌందర్యమంతయును శవసౌందర్యము లాంటిదే. ఆధ్యాత్మిక సాధకుడు శీలవంతుడై ఉండాలి.
**357** తానెవరో తెలుసుకొని తరించేందుకు మానవుడు భూతలం పై కాలుమోపాడు. తన బ్రతుకుకు కమనీయ బాటను నిర్మించుకొను మహాకార్యములో తన ప్రక్కవాని బాటను సరిచేయుట కూడా బాధ్యతయే నని గుర్తెరిగి జీవించాలి.
**358** జ్ఞాన మనగా ఆత్మజ్ఞాన మేననియు, సంపద యనగా సుగుణ సంపదయే ననియు,శక్తి యనగా మనోశక్తియే ననియు, కీర్తిపుణ్యము లనగా పదుగురు కొరకు ఆరాధనాభావంతో ఆచరించబడు సేవా కార్యము లనియు మానవుడు గుర్తెరిగి, వాటిని పొందుటకు ప్రసాద మనస్తత్వముతో అహోరాత్రాలు కృషి సాగించి ఫలప్రదుడు కావలెను.
**359** రేపటి కార్యమును నేడే పూర్తిచేసుకొను అలవాటును కలిగి యుండాలి. వెళ్ళిన కాలము తిరిగివచ్చే ప్రసక్తి లేదు. బుద్ధిహీనుడు చివరిదశలో చేసేది బుద్ధిమంతుడు తొలిదశలోనే చేస్తాడు.
**360** సైనికుడు రహస్యప్రదేశమున దాగి, ఆ మార్గమునకు వచ్చు శత్రువులను చంపుతూ తాను భద్రతలోనే యుండులాగున, ధ్యానయోగి సదాఆత్మస్థితుడై మనోఫలకము పై విజృంభించు కామక్రోధాది శత్రువులను విచారణఖడ్గముచే ఖండించి, మఱల ఆత్మయందే దృష్టి నుంచవలెను.
**361** మనసే మనిషి గనుక మనస్సును ఆరోగ్యముగా తయారు చేసుకోవడ

మంటే మనల్ని, మన భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడమని భావము. ప్రాపంచికవ్యామోహాలకు లోనైతే పశుప్రాయులవుతాము. అనంతుడైన భగవంతుని గూర్చిచింతిస్తే భగవంతుడే అవుతాము.

**362** ప్రపంచములో సుఖదు:ఖాలులేవు.అవి మానవుని మనస్సులోకదిలిన కల్లోల పవనాలు.శాంతికైప్రపంచాన్ని అనుసరించనవసరములేదు.అలాగని దూరంగానువెళ్ళనవసరంలేదు.దృష్టిమారితేచాలు.జ్ఞానంకలిగితేచాలు.

**363** మనస్సు నుండిబయలుదేరు.సంకల్పాలుఋజుమార్గంలోఉండులాగున చూడవలెను. సద్గ్రంథపఠనము,మహాత్ములజీవితచరిత్రలనుఅధ్యయనము చేయుట, సత్యము, ప్రేమ, దయ, శాంతి, బ్రహ్మచర్యాదిసద్భావములను చింతించుట వలన, ఆచరించుట వలన సంకల్పాలను మార్పుచేయవలెను.

**364** తనకు నీరు పోసి పెంచిన వానిని ప్రేమించి, తన కొమ్మలను నరికిన వానిని చెట్టు ద్వేషించదు. ఫలపుష్పాదులను అందరికీ సమానముగా అందిస్తుంది.నిజమైన సాధకుడు వృక్షము కన్నా ఎక్కువగా సహనశీలుడై ఉండాలి.

**365** ఆశలణగిన చోట ప్రేమ స్ఫురించును. సంగము క్షీణించిన చోట ప్రేమ అంకురించును. స్వార్థము పతనమైన చోట ప్రేమ మొక్కయై పెరుగును. అహంకార మదృశ్యమైన చోట ప్రేమ చెట్టుగా నిలుచును. కాఠిన్యము కరిగిన చోటప్రేమ పూత వేయును. మోసము మరుగైన చోట ప్రేమ కాయ గాచును. అసత్యముఅంతమైన చోట ప్రేమ ఫలించును. అదియే ప్రేమ అందించు త్యాగఫలము.అమృత ఫలము. త్యాగామృత ఫలము.

**366** అమాయకంగా ఆడుకొంటున్న పసిబాలుని నీవు కొట్టి హింసించి బాధించవచ్చు. శైశవ మందున్న ఆ బాలుడు నిన్ను ఎదిరించి బాధించలేక పోవచ్చు.కాని అతని ఏడుపును విన్న ఆ బిడ్డ తండ్రి నిన్ను ఊరకే వదలి వేయునా**?** బిడ్డను నీవు బాధించిన దానికన్నా ఎక్కువగా నిన్ను బాధించును.

**367** నిజమైన సాధుపురుషులు ఏ పాపపుణ్యము లెరుగక జీవించే పసిబిడ్డలవంటివారు. వారి మనోక్లేశమునకు నీవు కారణమైనచో వారి సాధుత్వము నిన్ను ఎదిరించలేక పోవచ్చు. సర్వమును త్యజించి తల్లిదండ్రులను సైతము పరిత్యజించి,జగన్నాథునే తండ్రిగా భావించి, గాలిలా పవిత్రమై, నీటిలా పరిశుద్ధమై చరించేమహాపురుషులకు కల్గిన మనస్తాపమును గాంచి దీనదయాళుడైన భగవానుడుఊరకుండునా**?**

అగ్నినిఆలింగనముచేసికొన్నవానికిఎలాంటిదుర్గతిప్రాప్తించునో,మహాత్ములను బాధించువారికి అలాంటి అధోగతియే సంప్రాప్తించును.

**367** తరంగము లేచుటకు సాగరము కారణము. సంకల్ప ముదయించుటకు చైతన్యము కారణము. అలజడి అలలదే గాని అంబోధికి సంబంధించినది కాదు.ఆవేదన సంకల్పములదే గాని చైతన్యమునకు సంబంధించినది కాదు.

**368** ధ్యాన మనేది మనస్సుతో చేయు కర్మ కాదు. మనోవృత్తి అంతకన్నా కాదు.

మనస్సులోనడిచేసకలకర్మలను,వృత్తులనుఅవలోకించుటయే.ధ్యాతధ్యేయము లనేకము చేసి చూపునది అట్టి అవలోకనయే. అదియే లోచూపు.లోపములను రూపుమాపు లోచూపు. శోకములను బాపు లోతుచూపు.
**369** ఆకలిగా ఉందని అరటిపండుతో పాటు తొక్కను కూడా భుజించలేము. దాహమున్నంతమాత్రానబురదనీటినిపానంచేయుటకుఎవ్వరూఇచ్చగించరు అలా చేయడము సముచితము కాదని, ఆరోగ్యప్రదం కాదని మనబుద్ధియే మనకుతెలుపును. స్థూల విషయములను, వస్తువులను పరిశీలించినట్లే, సూక్ష్మమైన జీవితవిలువలను గూర్చి ఆలోచించ గలిగితే ఈ ప్రపంచములో మనమేమిటో బోధ-పడకపోదు. ఆస్తిపాస్తులు, భార్యాపుత్రాదులు, బంధుమిత్రాదులు, వస్తువిషయాదులుమన చుట్టూ పరిభ్రమించునట్లే గోచరించి ఒక క్షణాన మోసగించి దూరమగును.ప్రతిమనిషి ఈ సత్యాన్ని గుర్తించాలి, గ్రహించాలి. ప్రపంచములో జీవిస్తూనేయుండాలి. అందరినీ ప్రేమిస్తూనే బ్రతకాలి.కానీ అవన్నియు శాశ్వతమనే భావనకు మనస్సులో చోటివ్వకూడదు. ఏది ఉండినా, ఏది ఊడినా సంతోషంగా జీవించగలిగియుండాలి. ఇదియే అనుష్ఠాన వేదాంతము.
**370** అజ్ఞానంతో ఉన్నావా**?** అధైర్యపడకు.జ్ఞానసముపార్జన చేయు అవకాశమునీకున్నది. బలహీనుడవా**?** భయపడకు. బలవంతుడయ్యే అవకాశము నీకున్నది.చెడ్డవాడివా**?** చికాకుపడకు. మంచివాడవయ్యే మార్గము నీకున్నది. నాస్తికుడివా**?**కలత చెందకు. నీవు గ్రహించుకొని జీవించేందుకు ఆస్తికత్వ మున్నది. చింతించవలసిందేమీ లేదు. చేయవలసింది చింత కాదు. చింతన.
**371** పల్లానికి ప్రవహించడము నీటికి సహజలక్షణము. పోసిన చోట నిలువక నీరు పల్లానికి ప్రవహిస్తుంది. అదే ఒక పాత్రలో పోసినపుడు కదలకుండావుంటుంది. గట్టి ఆవరణ మధ్యనే నీటిని ఆపగలము. మన:సంకల్పాలు నీటివలెప్రాపంచిక విషయాల వైపు నడుస్తుంటాయి. వాటిని ఆపడం మనవల్ల కాదు.భగవన్నామ స్మరణమనే ఆవరణను ఏర్పాటు చేసినచో మనస్సు కదలక మెదలక పడియుండును. మనోజయమునకు నామస్మరణ దివ్యాస్త్రము.
**372** జీవిత గమ్యము మోక్షమా**?** అయితే మోక్ష మెవరికి**?** పొందేది ఎవరు**?** బాగా ఆలోచించు. ప్రత్యేకముగా పొందదగిన దేమున్నది**?** ఉన్న సత్పదార్థము సదాఏకమై, ఏకంగానే యున్నది. దానిని పొందడ మేమిటి**?** అదే అర్థం చేసుకోవాలి.సత్యము స్వప్రకాశమై యున్నది. ఇంతవరకు మనము అసత్యాన్ని సత్యంగాభావించాము. భాషించాము. అసత్యమైన సర్పాన్ని సత్యమని భావించాము. ఈపైఖరిలో మార్పువస్తే చాలు. సర్పము అసత్యమని అర్థమయితే చాలు. ఇక ఉన్నదిఏదో అది రజ్జువే గాని మరొక టయ్యేందుకు వీలులేదు.
**373** మానవ జీవనకాలము అతి స్వల్పము. అర్ధ శతాబ్ద కాలములో తనలో

పశు స్వభావాన్ని మానవుడు అమితంగా పెంచుకుంటున్నాడు. హృదయాన్ని దాటిమనస్సు పెరిగేలా చేశాడు. ఆత్మభాస్కరుడైన తాను అజ్ఞాన గ్రహణము ద్వారాకాంతిహీను డగుచున్నాడు. బలహీనతలను పారద్రోలు. సత్యాన్ని సమీపించు."అహం బ్రహ్మాస్మి" అని గర్జించు. "సర్వం ఖల్విదం బ్రహ్మ" యని ప్రవచించు.

**374** ఎలాంటి విత్తనమును నాటుదుమో అలాంటి ఫలమునమభవించెదము.ఎలాంటి కర్మ నాచరింతుమో అలాంటిఫలితమునే పొందుదుము.

**375** శైశవ బాలుడు అజ్ఞానముచే మాలిన్యములో దొర్లుచుండును.
బాల్యదశకు చేరగానే, తాను మలినముల నంటడు. మురికిని ముట్టడు.
అలాగేఅజ్ఞానాంధకారములో పరిభ్రమించు మానవులు అజ్ఞాన శిశువువలె ప్రాపంచికవిషయ భోగక్రీడలో రమించుచుందురు. జ్ఞానము కలుగగనే విషయభోగాలు విషతుల్యములని గ్రహింతురు.

**376** మోక్షప్రియా! నీవు వెతుకుతున్నది నిన్నే. వెతకడం ఆపు! వెతికే దెవరో ఆలోచించు. వెతలన్నీ తీరిపోతాయి. వెలుగులు విరబూస్తాయి.

**377** తియ్యని పాలకోసం పరితపిస్తూ బిడ్డ తల్లి పాలిండ్లను తడుమునట్లు ఆత్మానందం కోసం పరితపిస్తూ సాధకుడు విగ్రహాన్ని సమీపించాలి. తల్లి తప్పక పాలిస్తుంది. జగత్పిత తప్పక నిన్ను పాలిస్తాడు.

**378** గురుదేవుని కోపాన్ని భావించి భయపడకు. ఆయన ప్రేమని సంభావించి భయపడు. గురువు నన్ను ఇంతగా ప్రేమిస్తున్నాడు. నాలో దోషాలు దొర్లితే గురుప్రేమ నాకు దూరమౌతుందేమో అని భయపడు.

**379** ఆలయాన్ని ఎవరైనా, ఎప్పుడైనా చేరగలరు. భక్తితో అచ్యుతుని అర్చించ గలిగిన వారే ఆపదల నుండి విడిపడగలరు. ఆనందాన్ని అనుభవించగలరు.

**380** నింగినున్న సూర్యుడు నీటనున్న పద్మాన్ని వికసింప చేస్తాడు. నీరు ఇంకిపోతే ఆ సూర్యుడే పద్మాన్ని వాడిపోయేలా చేస్తున్నాడు. హృదయంలో భక్తిజలముంటే జ్ఞానపద్మాన్ని గురువు వికసింప చేయగలడు.

**381** నీరున్న చోట నాచు కూడా ఉంటుంది. నాచును తొలగించి నీటిని స్వీకరించాలి. అలాగే మంచి ఉన్నచోటే చెడు కూడా గోచరించవచ్చు. స్వీకరించాల్సింది మంచినే గాని చెడును కాదు.

**382** జీవనది నిత్యప్రవాహంతో శోభిస్తుంది. అలా కానివి వర్షాల్లో శోభిస్తాయి. వర్షాకాలం పోగానే ఎండిపోతాయి. ఎవరి హృదయంలో సదా ప్రేమజలం ప్రవహిస్తూఉంటుందో వారు నిత్యయుక్తులై, భక్తులై ఉంటారు. కేవలం ప్రవచన సమయాల్లోమాత్రమే భక్తులగు వారు ప్రవచనం ముగియగనే సామాన్యులుగా మిగిలిపోతారు.

**383** జీవితము ఒక క్రీడారంగము. జీవన మొక చక్కని క్రీడ ,ఆటలో

ఉన్నట్లే జీవితంలో కూడా ఆవేశాలు, పోటీలు, ఆందోళనలు, అపార్థాలు ఉంటాయి.అవి అలా ఉండటం తప్పుకాదు. అది క్రీడ అని మనం గుర్తించలేకపోవడంపొరపాటు.

**384** హృదయాన్ని పవిత్రంగాఉంచేప్రయత్నంలో ఒక్కొక్కసారి భగవంతుడే మనసుకు బాధను కల్పిస్తాడు. జాగ్రత్త! అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధలను దూరంచేయమని పరమాత్మను ప్రార్థించకు. బాధలను భరించే శక్తి నివ్వమని పరితపించు చాలు.

**385** మార్పులు సంభవించాయని, పరిస్థితులు మారిపోయాయని దు:ఖిస్తావెందుకు? భోంచేయగానే బల్లపై నున్న భోజన పదార్థాలు తొలగించబడలేదా? వాటిలో ఎంత రుచయినా ఉండొచ్చు. తృప్తిగా భుజించిన తరువాత వాటి అవసరమేముంది? నీవు అనుభవించిన వాటిని పరమాత్మ దూరం చేస్తే దుఃఖిస్తా వెందుకు?పాతవాటి స్థానంలో కొత్తవి వస్తాయని నీకు తెలియదా? రేపు రాబోయేవి నేటి కన్నా బాగుంటాయి.

**386** ఎవరిని ఎప్పుడు కలుస్తామో మనకు తెలియదు. అది మన చేతిలోని పని కాదు. సంయోగాల వియోగాల విషయంలో మనం నిస్సహాయులం. ఈ రెండూపరమాత్మ చేతిలోనివే. కలిసే వాటిని గాక కలిపేవాడిని చూడటం నేర్చుకోవాలి. విడిపోయే వారిని గాక విడదీసే వానిని దర్శించడం అలవరచుకోవాలి.

**387** మిత్రమా! భగవానుని తెలుసుకోవాలని యత్నిస్తువా? ముందుగా భగవంతుడు కానిదేదో తెలుసుకొనేందుకు ప్రయత్నించు. భగవంతుడు కానిదంటూలేదని నీకు తెలుస్తుంది. అప్పుడు ఉన్నదంతా భగవంతుడే యని నీకుఅర్థమవుతుంది.ఈ ప్రపంచమనే గృహంలో ఎంతకాలం నీవు ఉండగలవు? ఇది నీస్వస్థానము కాదు. నీవు కేవలం బాటసారిని మాత్రమే. ఈ సత్యాన్ని ఏ క్షణానా మరువకు.

**389** నది ఎంత పెద్దదైనా, సుడులు తిరుగుతూ ప్రవహిస్తున్నా ఏమి జరిగింది? రాజు నదిపై వంతెన నిర్మించగనే ఆ గొప్ప నదిని చీమ కూడా దాటిపోగలదు. జీవనది ఎలాగైనా ప్రవహించనీ. వారధిని నిర్మించేందుకు పార్థసారథి యున్నాడు. నీవు హాయిగా దాటిపోగలవు.

**390** మండుటెండలో పయనించే వానికే చెట్టునీడ యొక్క విలువ తెలుస్తుంది. బాధల బ్రతుకును సాగించే వారికే గురుబోధ అవగత మవుతుంది.తనను ఖండించిన గొడ్డలికి సువాసన నందిస్తుంది చందనవృక్షం.తనను హింసించిన వారికి ప్రేమను పంచుతుంది సాధుహృదయం.

**392** పెద్దతనాన్ని ప్రదర్శించే ప్రయత్నములో పిన్నవారి లాగ ప్రవర్తించ కూడదు.

**393** నీరులేని చోట పడవ చరించదు. గురుభక్తి లేని వానికి జ్ఞానం స్ఫురించదు.

**394** విషపూరితమైన పాము తలపై వసించినా మణి తన వైభవాన్ని

కోల్పోయినదా? సోదరా! మనం చెడ్డవారి మధ్య ఉన్నంత మాత్రాన మన మంచిని దూరం చేసుకోనవసరం లేదు.
**395** రోగి ఎన్నో తినాలంటాడు. కానీ వైద్యుడు అంగీకరించడు. అంతమాత్రానవైద్యుని వదలిపెట్టడమేనా? మరి ఆరోగ్యం? భోగి ఎన్నో అనుభవించాలని ఉంటాడు. ఏదేదో ఆశిస్తాడు. కానీ గురువు వాటిని అంగీకరించడు. అలాగని గురువును త్యజిస్తే జ్ఞానమెలా లభిస్తుంది?
**396** పరీక్ష బంగారానికి గాని ఇనుపముక్కకు కాదు. బంగారు బ్రతుకును వాంఛించినపుడు పరీక్షలు ఉండకపోతాయా? నెగ్గి నిలబడాలి గాని తలవంచి పారిపోకూడదు.
**397** ముఖంలో సంతాపాల ముడతలు, మనసులో సమస్యల మడతలు ఉన్నంత వరకు నీకు శాంతి లేదు. రాదు. నీ చిత్తము పరమాత్మలో సేద తీర్చుకోగానే ముడత లుండవు. మడతలు మిగలవు.
**398** తల్లిగర్భంలో పవళించియున్న జీవుని కాలం బలవంతంగా బహిర్గతమొనర్చినది. బయటపడిన జీవుని కేశములను పట్టుకొని యముడు లాగికొనిపోవుచున్నాడు. ఈ మధ్యలో సత్యమును గాంచలేని జీవుడు విద్య, వివాహము, సంతానము, షష్టిపూర్తి యని పలవరిస్తున్నాడు.
**399** మృత్యువు జీవనంలో మార్పే గాని జీవితానికి ముగింపు కాదు. ఈ సత్యం మనకు తెలియదు. తెలియనిది భయాన్ని కల్గించడం సహజమే.
**400** గంగాస్నానము పాపాన్ని హరిస్తుంది. వెన్నెల తాపాన్ని పోగొడుతుంది. కల్పవృక్షము దైన్యాన్ని నశింపజేస్తుంది. పాపాన్ని, తాపాన్ని, దైన్యాన్ని ఈ మూడింటిని సాధుదర్శనము హరిస్తుంది.
**401** ఉదయాస్తమయాలలో సూర్యుడు అరుణకాంతులనే ప్రసరింప జేస్తున్నాడు. సంపదలలో, ఆపదలలో ఒకే విధంగా ప్రవర్తించువారు సూర్యుని వలె జ్ఞానప్రకాశంతో శోభిస్తారు.
**402** సత్సంగము వలన దుర్జనులు సజ్జను లవుతారు. దుస్సంగము వలన సజ్జనులు దుర్జనులు కారు. పుష్పముల వలన భూమి సుగంధభరిత మగును. పుష్పాలు మట్టివాసనను గ్రహింపవు.
**403** బాధ్యతలను విస్మరించు వానిని భగవానుడు ఇష్టపడడు. 'అంతా నీ భారమే, నని పలికి కూర్చునే సోమరి పరమాత్మకు దూరమే. 'నాదేమీ లేదు' అని నిరంతరము శ్రమ తెలియక పరిశ్రమించువాడే పరమాత్మకు ప్రియుడు.
**404** సాధకుడు సంభాషణలో సావధానచిత్తుడై ఉండాలి. పలుకు ధైర్యంగావుండాలి. ఆ ధైర్యం వెనుక అహంకారము చోటుచేసుకోకూడదు; ఆత్మస్థైర్యంనిండి వుండాలి.
**405** సాధన కర్మరూపంగా తెలిసినను వాస్తవానికి భావరూపమే. భావరూపమైన సాధనకు శరణాగతియే పూర్ణాహుతి. శరణాగతి జరిగితే కర్మ లేదు; కర్త లేడు.మరణగతి తెలియని స్మరణస్థితియే శరణాగతి.

**406** గతి తెలిసి, మతి నిలిపి, చితి రగిలేలోగా పతిని దర్శించు; కరుణను
విస్మరించకు; తరుణము మించనీకు; ప్రయత్నించు.
**407** సాధకుడు సత్యసంధుడై యుండాలి. మాట నిలిచినపుడే మనిషి
నిలుస్తాడు. మాట పడితే మనిషి పతనమౌతాడు.
**408** చేయ గలిగితేనే చెప్పు; చెప్పిన దానిని చేసి చూపించు.
**409** సాధకులైన వారంతా ప్రారంభములో అనేక బాధలతో జీవన గాథలనుఆరంభించినవారే.
కృషిలో పండి ఋషులయ్యారు. ఆ తర్వాత వారి అవసరాలన్నీ పరమాత్మే తీర్చాడు.
**410** నీవు సాధకుడవు. సంకుచితమైన స్వభావాన్ని త్యజించి దివ్యత్వాన్ని
సాధించు. స్వర్గనరకా లిక్కడే వున్నాయి. నేను చేస్తున్నాననే భావన కదలగానే నరకం ఎదుట
నిలుస్తుంది. చేయించే వాడున్నాడని అర్థంకాగానే స్వర్గం నీముందు కనిపిస్తుంది.
**411** సాధకుడు సదా అంతర్ముఖుడయ్యే ప్రయత్నం వదలకూడదు.
మందులు రోగికి ఉపయోగపడినా రోగాన్ని, రోగియే నయం చేసుకోవాలి. బోధలు,బోధకులు
మార్గాన్ని దర్శింపజేయగలరు. కానీ గమించవలసినది సాధకుడే!
**412** వదిలే వాటిని విదిలించుకో. వదలనిది ఏదో తెలిపి తగిలించుకో.
తరించే ముందు తారసిల్లేవన్నీ తగిలింపులే. ఉద్ధరింపబడే సమయ మాసన్నమైనపుడు
ఊడేవన్నీ ఊరేగింపులే.
**413** గాలి లేని చోటనే దీపం నిలుస్తుంది. సంశయాలు లేని హృదయం
లోనే భగవంతుడు నిలుస్తాడు. అనుమానం అతి భయంకరమైనది. విశ్వాసంతో జీవించు
వానికి విశ్వంలో ఏదీ అడ్డు నిలువదు.
**414** పరమాత్మ నీకు మిత్రుడు కానిచో అన్నిచోట్ల నీకు శత్రువులే
అగుపిస్తారు. వెలుగున్నచోట చీకట్లు లేనట్లు, ప్రేమున్న చోట ద్వేషాలు అంకురించవు.ప్రేమ
హృదయగతం; సంశయాలు బుద్ధిగతం.
**415** సత్త్వగుణము వృద్ధి చెందితే వ్యక్తిలో సౌకుమార్యం జనిస్తుంది.
సున్నితత్వం పెరుగుతుంది. నమ్రత పెనవేసుకుంటుంది. నాణ్యత గోచరిస్తుంది. బ్రతుకులో
మాధుర్యాన్ని పెంచుతుంది.
**416** మనిషి రాగానే చల్లగా చూడాలి; మెల్లగా పలకరించాలి. ఎవరు
ముందు పలకరించాలి అని ఆలోచించటం తప్పు. బ్రతుకులో తియ్యదనంరావాలంటే,
కావాలంటే నీవే మాట్లాడాలి. పూర్వభాషియే మధురభాషి అనిమరువకూడదు.
**417** తిరిగి చూడని నడకను నేర్చుకో; నవ్వేనోరు మూతపడే వరకు
నవ్వటం అలవరచుకో!
**418** అరగని రూపం, ఆరని దీపం ఆంతర్యంలో దర్శింపబడటానికే
దేహమనెడి పరికరం ఉపయోగపడాలి. అనువు గానిచో తనువు నెందుకు
పెంచినట్లు?

**419 నీవు ఇతరులకు చేసిన మేలును, ఇతరులు నీకు చేసిన కీడును మరచిపో. అలాగే ఇతరులు నీకు చేసిన మేలును జ్ఞాపక ముంచుకొని కృతజ్ఞతతోజీవించు. నీవు ఇతరులకు చేసిన కీడును స్మృతి యందుంచుకొని పశ్చాత్తాపం చెంది బ్రతుకును కొనసాగించు.**

**420** బిడ్డ తన చేతిని తల్లికి అందించి నిర్భయంగా నడిచిపోతుంది. మనంకూడా మన చేతిని భగవానునికి అందించి నడువటానికి ప్రయత్నించాలి.

**421** ప్రారబ్ధాధీనంగా సంక్రమించిన శరీరాన్ని అలా వుండనీయాలి; దేహభ్రాంతి కదలకుండా చూసుకోవాలి. మనచేతి గడియారము చెడిపోతే సరిచేసుకుంటాం. అది చెడగానే మనం చెడిపోలేదు. గడియారం మనది. మనం గడియారం కాదు. శరీరం కూడా అంతే!

**422** సంస్కార మనేది ఇతరులు చెబితే వచ్చేది కాదు; స్వతహాగా అలవరచుకొన వలసినది. శ్రవణం వలననే మనిషి బాగుపడలేడు. ఆచరణ వలన మాత్రమే శోభిస్తాడు.

**423** నిన్ను నీవు చూసుకో గలిగితే ప్రపంచం లేదు. నిన్ను నీవు మరచిపోతేఉన్నదంతా ప్రపంచమే!

**424** నడిచే నావ లెన్నయినా రేవుదీప మొక్కటే. కదిలే రూపా లెన్నయినా జ్ఞానదీప మొక్కటే.

**425** బ్రతుకుకు గండిపడకుండా చూసుకో. భగవానుని అండ చెడకుండా కాచుకో. ఇదియే సముజ్జ్వల జీవన సందడియని, సర్వమును సమకూర్చెడి శాంతి అంగడి యని మరచిపోకు.

**426.** ఆడు........కాని అలసిపోకు. క్రీడించు....... కాని చిక్కిపోకు. గెలువు.... కానీ అది నీ శక్తి అని గర్వించకు. ఓడిపో........కాని అది ప్రసాదమని భావించు.

**427** మానవునికి నేడున్నది రేపుంటుందని చెప్పలేము. నేటిని వినియోగించుకున్నవాడే మేటిగా నిలుస్తాడు. సాటిలేని వాడనిపించుకుంటాడు. నేటిని పాడుచేసుకుంటే అన్యాయంగా ఏటికి ఆహుతి అవుతాడు.

**428** నీవు చేయవలసిన కర్మ నీ కొరకు ఎదురు చూచునపుడు దానిని నీవు విస్మరించలేవు. విసర్జించలేవు. ఇక్కడ నీవు చేయదగినది కర్మను వదులుట కాదు.నాటకంలో నటుడు తన పాత్రను పోషించునట్లు ఆసక్తి లేకుండా కర్మనాచరించుటయే.

**429** బ్రతుకులోని సంపదలన్నీ నీటి బిందువులే యని మరువకు. కాల పవనాలు వీచగానే కనుమరు గవుతాయని తెలుసుకో. అసత్యవస్తువు ఎన్నడూ నీకుఅండ కాదు. సత్యవస్తువు ఎప్పుడైనా దండిగానే ఉంటుంది.

**430** తగిలించుకుని మానవుడ వయ్యావు. మనసునువిడిపించుకుని మాధవుడ వవుతావు.

**431** భాస్కరుని చూస్తే చాలదు. భాస్కరునిలా భాసించాలని నిర్ణయించు

కోవాలి. నిర్ణయాన్ని నిలబెట్టుకుంటూ నివసించాలి.
**432** ఉపయోగించనిచో బావినీరు నిరుపయోగ మవుతుంది. ఉపక్రమించనిచోమనస్సు జడమై మిగులుతుంది. వాడుకే ఒక వేడుక. శోధనే నిజమైన సాధన.
**433** నీరు లోతుగా ఉంటే నౌక సుఖంగా కదులుతుంది. భావలోతు గలవానికి బ్రతుకు శుభంగా సాగుతుంది.
**434** జరిగేదంతా నాటకం.................వీక్షించుటే మన పాటవం.
**435** కాలికి బురద అంటుకోగానే కాళ్ళు కడుగుకున్నట్లు, మనస్సులో ద్వేషభావాలు స్ఫురించగానే భగవన్నామంతో శుద్ధి చేసుకో. నీవు సదా శాంతితో జీవిస్తావు.
**436** నీరు ప్రవహించినా తీరము పరుగులిడుట లేదు. నీ నుండి, నీ ద్వారాఏదైనా కదలనీ. నీవు కదలకుండా ఉండాలి.
**437** గమ్యం తెలియని పయనంలో గమనం తెలిసివస్తే చాలు. మననము తోడుంటే చాలు.జ్ఞాన జననము జరిగినట్లే. అంధకార మదృశ్యమైనట్లే. విజ్ఞానతీరాలు సమీపించినట్లే.
**438** విషయచింతన మనిషికి భీతిని కల్పిస్తుంది. విషయచింతనను త్యజించిన వానికి నిర్భయత్వము ప్రాప్తిస్తుంది. నిర్భయత్వము నిర్వికల్ప ధామాన్ని ప్రసాదిస్తుంది.
**439** ప్రతి హృదయంలో పరమాత్మ ఉన్నాడని అందరికి తెలుసు. మరి పరుల హృదయాన్ని బాధిస్తే అది పరమాత్మను బాధించినట్లు అవుతుందని ఎందరికి తెలుసు?
**440** మనకన్నా ఎక్కువ భాగ్యవంతుడు, సుఖవంతుడు కన్పించినపుడు ఈర్ష్య చెందకూడదు. ఆపదలు, సంపదలు పూర్వజన్మ కర్మల ఫలితాలనిమరువకూడదు.
**441** ఉన్నదానిని చూడాలి గాని మనసులో ఉన్నదానిని గాదు. మనసులోని వాటినే బాహ్యంలో దర్శించువాడు తన మనసును చూస్తాడే గాని సత్యాన్నిచూడలేడు.
**442** ఖాళీగా యున్న మురళి నుండి సంగీతం వినిపిస్తుంది. ఖాళీగా యున్న కాగితం పైన వ్రాతలు వ్రాయగలం. ఖాళీ ప్రదేశంలోనే దీపం వెలుగును విరజిమ్ముతుంది. ఖాళీయైన మనసే భగవంతుని చూడ గలుగుతుంది.
**443** సంతోషము కలిగినపుడు అది ఏమిటాయని విచారించు. దు:ఖము కలిగినపుడు అది ఏమిటో చక్కగా పరీక్షించి చూడు. ఈ విధమైన పరిశీలనలో నీ పంథాయే మారుతుంది.
**444** బాగుపడాలనే భావం రాకపోవుట చేతనే మనల్ని బాధలు ఆవరిస్తున్నాయి.బాధను పోగొట్టుకోవాలనే సంకల్పం ఉదయించని దోషం వల్ల గాయాలు ఎక్కువవుతున్నాయి.
**445** దుఃఖమనేది మనసుకు సంబంధించినది. అది తిలకించ దగినదియేగాని త్యజించ దగినది కాదు. వీవు సాక్షివై వీక్షించ దగినదియే.

**446** స్వార్థాన్ని ఒకవైపు, అసూయనుమరొకవైపు నిలిపి హృదయాన్ని
విశాలం చేయాలంటే వీలుపడదు. స్వార్థము, అసూయ అనే గోడలు కూలినపుడే ప్రేమ
సూర్యకిరణాల వలె విస్తరిస్తుంది.
**447** ప్రేమ బరువును బాధ్యతగా మోస్తుందేగాని భారంగా భావించదు.
ప్రేమున్నచోట భారాలు తెలియవు. బరువులు ఆర్థంగాపు.
**448** గాఢంగా ప్రేమించు అలాగనిప్రగాఢంగా పెనవేసుకోకు.
**449** కుటిలత్వ మున్న చోట కృష్ణుడు అగుపించడు.
**450** గురువును పరీక్షించాలనే గర్వముతో నీవు గురువును సమీపించినపుడు నీవు
గురువులో నిన్నే దర్శిస్తావు. గురువులో
మహిమ లేదు అమకుంటావే గాని నీవు మాయలో పడ్డావని, మోసపోయావని గుర్తించలేవు.
**451** ప్రేమనుగూర్చి మాట్లాడే ముందు ప్రేమించడం అలవరచుకో.
**452** సత్కర్మలు సాధువును అందిస్తాయి. సాధువులు సద్గతిని ప్రసాదిస్తారు.
**453** అమాయకులు, అప్రయోజకులు ప్రబోధకులుగా మారినపుడు సత్య
స్వరూపములైన గ్రంథాలు మరుగున పడిపోతాయి.
**454** అసూయా కంటకముల బారినుండిఇప్పటికిఎవ్వరూతప్పించుకోలేదు.
దు:ఖ పవనాలు అనుభవించకుండా ఎవరూ ఈ ప్రపంచం నుండి తిరిగి వెళ్ళలేదు.బాధలు
కలిగాయని వ్యధ చెందకు. అందరికి జరిగేదే నీకూ జరిగింది.
**455** దైవం పేరిట ఎంతో ధనాన్ని వెచ్చిస్తారు. గురుసేవలో ఎంతో
సంపదను ఖర్చు పెడతారు. కానీ కుటిలత్వాన్ని, స్వార్థాన్ని వదలిపెట్టరు. బిందెడు పాలల్లో
విషపుచుక్క లాగ ఏం సాధించినట్లు?
**456** వదలవలసిన దానిని ఉంచుకొనేవారు. జీవితంలో శోభించలేరు.
ఉండకూడనివి ఉండేది చెడుపు చేయడానికే.
**457** మొక్కబోయిన గొడ్డలితో రోజంతా నరికినా కొద్దిపాటి కట్టెలనుకూడా
ప్రోగుచేసుకోలేనికాష్టక్రేతను ,"అయ్యా! గొడ్డలికి పదును పెట్టుకోకూడదూ! అంటే- “ నాకు టైం
ఎక్కడుంది? ఉదయం మండి  సాయంత్రం వరకు కట్టెలు కొట్టడమేసరిపోయే" అంటాడు.
అంత:కరణను శుద్ధి చేసుకోకుండా అద్భుత గ్రంధాలను పఠించాలని పరితపించేవారు.
వాస్తవానికి ఈ కాష్టక్రేత లాంటివారే.
**458** వృక్షములకు బీజములు కారణమైనట్లు సంసారవృక్షములకు వాపసలేబీజములై
యున్నాయి. విప్పారమైన బీజములు వృక్షమును రావివ్వపు. నిర్వీర్యమైన వాసనలు
సంసారవృక్షమును వృద్ధి చేయవు. వాసనాక్షయమే మోక్ష మగుచున్నది.
**459** వత్తి పెద్దదైతే వెలుగు పెద్దదవుతుంది. శ్రద్ధ ఎంత ఎక్కువగా ఉంటే
జ్ఞానమంతత్వరగా ప్రాప్తిస్తుంది.
**460** నీవు పరమాత్మకు శరణాగతుడివా! అయితే ఆయన కిష్టమైన దానిని

చేయనీ. మనం కోరివట్లుగా భగవంతుడు చేయాలని ఆశించడం శరణాగతమనిపించుకోదు.
**461** పోరాటానికి అంతమే ప్రేమ. ప్రేమ లభించగనే పోరాటాలన్నీ
పారిపోతాయి. పెరుగు చిలికేది వెన్న లభించువరకే. ఆరాటాలు, పోరాటాలన్నీ ప్రేమ ప్రాప్తించు వరకే.
**462** నేడు ఆచరించవలసిన కార్యాన్ని రేపటికి పొడిగించకు. కాలము
పరుగెత్తునే గాని నడువదు. నష్టమైన క్షణము పూర్ణజీవితానికి హాని కల్గిస్తుంది.
**463** ఆహారాన్ని స్వీకరించి మలాన్ని విసర్జిస్తారు. మనిషి, ఆ విషాన్ని భూమిశుద్ధి చేస్తుంది. నదులందించిన జలాన్ని పానం చేసి మనిషి మూత్రాన్ని విసర్జిస్తాడు.సూర్యుడు దానిని ఆవిరిగా మారుస్తాడు. సోదరా! ప్రకృతిని వీక్షించి నీ వికృతిని తొలగించుకోలేవా**?** పరోపకారం లోనే పరమాత్మ దర్శనమిస్తాడు.
**464** పాంచభౌతికమైన ఈ మానవదేహము వస్తుంది; ఉంటుంది; పోతుంది.ఇది జడము. ఆద్యంతములు గలది. ఆత్మ వచ్చేది గాదు. పోయేది లేదు.
**465** అద్దంలో ప్రతిబింబము వలె మనస్సులో ఈ ప్రపంచము
తెలియుచున్నది. దర్పణమును దూరం చేయగనే ప్రతిబింబము అదృశ్య మగువట్లు మనసు నశించగనే ప్రపంచము అదృశ్య మగుచున్నది.
**466** ఏకాంతంలో ఉండాలని మనసు అభిలషిస్తే నీవు వైరాగ్యమును
పొందుతున్నావని భావము. ఏకాంతంలో మనసు సంతసించగలిగితే నీవు సాధకుడ వయ్యావని అర్థము.
**467** వృద్ధాప్యము రూపమును హరిస్తుంది. క్రోధము ఖ్యాతిని మ్రింగుతుంది.ఆశ ధైర్యాన్ని చంపుతుంది. అహంకారము సమస్తమును నశింపజేస్తుంది.
**468** ప్రేమ లేని బ్రతుకు వాసన లేని సుమము వంటిది. దేవుడు లేని గుడి
వంటిది. నీరు లేని నది వంటిది. ప్రేమే సత్యము. ప్రేమే సర్వము. ప్రేమే దైవము.
**469** అతివాగుడు హితము కాదు. అన్యుల విషయాలలో ప్రవేశించి
పలవరించడం మంచిది కాదు. మనసును నిర్మలంగా, నిర్భయంగా ఉంచుకో. ఇతరులను సరిచేయుట నీ పనికాదు. ఎవరిని గూర్చియు చెడుగా ఆలోచించకు.
**470** మాటలు లేకుండా దీపం వెలుతురు విస్తున్నది. పలుకు లేకుండా
పువ్వు వాసన నందిస్తున్నది. సేవ ఆర్భాటాన్ని కోరదు.
**471** ఈ ప్రపంచమొక క్రీడారంగము. జీవు లందరూ ఆటగాళ్ళే. బంధు
మిత్రాదులు నీ తోటి క్రీడాకారులు. గృహమే క్రీడాస్థలము. ఆటలన్నీ ఓనాడునీటిమూటలే.
**472** పెరిగేది. విరగక తప్పదు. వికసించింది. ముకుళించక మానదు.
భవంతులు కూలిపోతాయి. దేహాలు రాలిపోతాయి. జారిపోయే వాటిని పట్టుకొనే ప్రయత్నం కన్న, దారిని దర్శించి దరిచేరడమే ఉత్తమము. గిరిధారిని విశ్వసించి .శాంతితీరమును చేరడమే శ్రేయస్కరము.

**473** నిచ్చెన నెక్కునపుడు పైకి ఎగబ్రాకాలే గాని క్రిందికి దిగజారకూడదు.
వానరుడు నరుడైనపుడు, నరుడు నారాయణుడై తీరాలి. ఇదియే ప్రగతి మార్గం.పవిత్రమార్గం.
**474** పారే నీరు మలిన మెరుగదు. తిరిగే రాతికి పాచిపట్టదు. భక్తి ఓటమి
నెరుగదు. భక్తుడు పతన మెరుగడు. నమ్మినవారు చెడలేదు. నమ్మనివారుబాగుపడలేదు.
బాగు తెలిసి బ్రతుకు హాయిగా సాగాలంటే భగవన్నామమే భవ్యము ,దివ్యము.
**475** మృగములు జీవులను బాధించునట్లు కోరికలు మానవులను
హింసిస్తున్నాయి. తీరని కోరికలు నిరాశను హృదయములో నిలుపగా, తీరినకోరికలు ఆరని
మంటలై అట్టులు చాస్తున్నాయి. కోరికలతో నిండిన మానవజీవితము దుఃఖసాగరము
వంటిది..
**476** మరుభూమి యందు చెట్టు లేదు. ఆత్మవిదుని యందు అశాంతి
లేదు. శాంతి కావాలా? అయితే ఆత్మవిదుడివి కా!
**477** చల్లిన నూకలు గోచరిస్తాయే గాని పన్నిన వల పక్షికి తెలిసిరాదు.
క్షణికమైన విషయానందమునకు జీవుడు ఆకర్షితు డవుతున్నాడే గాని దావినంటియున్న
అనంత దుఃఖమును గాంచలేకున్నాడు.
**478** దగ్గరైననాడు కలిగే స్వల్పానందమును, అల్పానందమును గాంచి
మురిసిపోవువారే గాని దూరమైన క్షణాన ప్రాప్తించే అనంత దుఃఖమును ఆలోచించు
వారెవ్వరూ లేరు. ఆలోచించ గలిగిన వాడు సాధకుడే.
**479** చేతకాలేదని చింతించకు. చేయూత నిమ్మని పరమాత్మను ప్రార్థించు.నీ కృషిలో
లభ్యముగాని భాగ్యము భగవత్కృపలో నీకు లభ్యమవుతుంది.
**480** పూర్ణవిశ్వాసంతో కదలని ప్రార్థనలు పరమాత్మను చేరలేవు. స్పందనలేని సాధనలు
ప్రతిస్పందన నెలా దర్శిస్తాయి? ఆర్తి లేని భక్తి యొక్క ఆర్తనాదమును అచ్యుతుడు
ఆలకించడు.
**481** జీవితము సుఖదు:ఖాల సమ్మేళనము. తీపిని తాత్కాలికంగా రుచి
చూపే అనుభవాలు కొన్నయితే, శాశ్వతంగా చేదును ముందుంచే అనుభవాలు, అనుభూతులే
జీవితంలో ఎక్కువ భాగాన్ని పెనవేసుకొని ఉంటాయి.
**482** మనస్సుతో ఆడితే మానవుడు. మనస్సును దాటితే మాధవుడు.
బంధమోక్షములకు మనసే కారణము. ప్రపంచం వైపు మరలే మనసుకు శాంతిలేదు.
పరమాత్మ వైపుకు మరలిన చిత్తమునకు అశాంతి రాదు.
**483** ఎండొచ్చినా, వానొచ్చినా గొడుగు ఊర్ధ్వం గానే పయనిస్తుంది.
సుఖమొచ్చినా, దు:ఖమొచ్చినా సాధకుడు ఊర్ధ్వగతి లోనే చరించాలి. ఊర్ధ్వగతిసదా ఉత్కృష్ట
స్థితియే. అధోగతి ఎప్పటికి అధమ పరిస్థితియే.
**484** మన పనులనే చేసుకోలేని నిస్సహాయులం భగవంతుని కార్యాన్ని

కూడా మన భుజాన వేసుకున్నాం. ఈ భారమే మన బ్రతుకులను కృంగదీస్తున్నది.కర్మఫల ప్రదాత భగవానుడై యుండగా మనం ఊహించినట్లు జరగాలనిభావించడం ఎంత పొరపాటో ఊహించు.
**485** పరమాత్మ నీ వాడైతే ఆయన గృహమైన ప్రపంచంలో నీకు స్థానం లభిస్తుంది. గౌరవం ప్రాప్తిస్తుంది. పరమాత్మను వదలి ప్రపంచము వైపు పరుగులిడువారికి బాధలే మిగుల్తాయి.
**486** మానవజీవితము దుఃఖమయము. మనకు తెలిసిన ఈ పత్యాన్ని అందరూ చెబుతారు. కానీ దుఃఖమయమైన జీవితాన్ని సుఖవంతముగ మార్చుకొనేదెలాగో గురువు బోధిస్తాడు. అందుచేత మన జీవితములో గురువు స్థానము ప్రత్యేకమైనది.
**487** పచ్చగ పెరిగిన వృక్షాలు పుచ్చిపోయి నశించడం మనం చూస్తున్నాము గదా! దానికి దుఃఖించి ఏం ప్రయోజనం? దేహాలు, జీవితాలు కూడా అంతే. ఈప్రపంచంలో దు:ఖించదగిన దేమీ లేదు.
**488** భక్తిలో పుష్టి లేనివాడు "హే భగవాన్! నన్ను రక్షించు" అని ప్రార్థించును.‘‘హే ప్రభో! ఈ క్షణాన నన్ను రక్షిస్తున్నది నీవే" అని పుష్టి భక్తి గలవాడు భావించును.
**489** బ్రతుకంటే ఏమిటో తెలియకుండా బ్రతకడ మనేది చావుతో సమానము. బుద్ధిలో భగవంతుని నింపుకొని జీవనయాత్రను సాగించడమేబ్రతుకవుతుంది. లేనిచో అది మృత్యువే.
**490** నీది ఏదో అది నీకు వచ్చి తీరుతుంది. దానిని ఇతరులు గ్రహించ లేరు. ఇతరులది ఏదో అది నీవు ఆశించినా నీకు రాదు. ఇచ్చేవాడు ఈశ్వరుడు.మన ఇచ్చలు గొంతులకు ఉరిని తగిలిస్తున్నాయి.
**491** దేహములో మాలిన్యముంటే ఆరోగ్యము కుదుటపడదు. అలాగే మనసులో మాలిన్యముంటే జీవికి శాంతి నిలువదు. మనస్సు శుద్ధి పడితే మనిషిసిద్ధుడయ్యే అవకాశముంది. పరమాత్మ నాశ్రయించిన వానికే బుద్ధి శుద్ధిపడుతుంది.
**492** లేనివి కావాలని భావించడం రానివి రావాలని వాంఛించడం సమస్త దుఃఖములకు కారణములై యున్నాయి. నాదైనది ఎప్పుడైనా వస్తుంది. నాది గానిది కోరినా రాదని తెలిసి కోరికలను అదుపులో నుంచుకొనువాడే సాధకుడు.
**493** తెలిసి కూడా పదేపదే తప్పులు చేస్తున్నాం. అలా చేసినందుకు బాధపడుతున్నాం. ఇక్కడ తప్పు చేయకుండా ఉండుటకు మన శక్తి చాలడం లేదు.మన శక్తి చాలనపుడు దైవశక్తియే మనల్ని కాపాడాలి. దానిని పొందుటకు మనంయత్నించాలి.
**494** ఆకలివేసినపుడు బిడ్డ తల్లిని ఆశ్రయిస్తుంది. తల్లి బిడ్డ ఆకలిని తీర్చుతుంది. అలాగే ఆపద లొచ్చినపుడు తల్లి, తండ్రి సర్వమూనైన భగవంతునిఆశ్రయించడం భక్తుడు నేర్చుకోవాలి. అచ్యుతుని ఆశ్రయించినవారు ఆపదల నెరుగరు.
**495** చికిత్స తెలియని వైద్యుడు రోగాన్ని పోగొట్టునో లేదో తెలియదు గాని

ప్రాణాన్ని మాత్రం తప్పక పోగొట్టును. జ్ఞానం లేని గురువు అజ్ఞానాన్ని వివృత్తి చేసేది అలా ఉంచితే బ్రతుకును అన్యాయం చేస్తాడని మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు.
**496** కన్నీళ్ళు నిజంగా నీ కళ్ళు తెరిపిస్తాయి. ఆధ్యాత్మిక పథంలో వడిచే సాధకునికి కన్నీళ్ళు అమృతబిందువులే కాగలవు. ప్రతి బొట్టూ పరమాత్మకు నిన్ను సన్నిహితం చేస్తుంది. వేదాంత విద్యార్థి ఎప్పుడూ కన్నీళ్ళనీ, కష్టాలనీ ఆహ్వానించాలి.కన్నీళ్ళు ఎంతగా చిందితే వేదాంతపు పన్నీరు అంతగా జీవనభాండంలో తొణికిసలాడుతుంది.
**497** ప్రపంచ మొక క్రీడాస్థలి. ఇక్కడ లెక్క పెట్టలేనన్ని ఆటలు, వ్యాయామాలు. ఆటలు అవిశ్రాంతంగా నేర్పబడుతూనే వుంటాయి. జయం-అపజయం,మన్నన పురస్కారం, మంచి-చెడ్డా అన్నీ ఈ వింత క్రీడాజగతిలో మనకి నేర్పేవాళ్ళే!
**498** అద్దానికి వెనుక కళాయి ఉండాలి. టాంకుకి ముందు కుళాయి ఉండాలి. నీకు ముందూ, వెనుక భగవంతుడే ఉండాలి. అప్పుడే బ్రతుకుకు సార్థకత ఏర్పడుతుంది.
**499** తెలుసుకునే వాడెప్పుడూ తెలియబడేవాడు కాదు. నీరు తనని తాను తడుపుకోలేదు. తుపాకి తనను తాను కాల్చుకోలేదు.
**500** మకరందం లోని మాధుర్యం కేవలం వర్ణించినంత మాత్రాన తెలియదు. రసనేంద్రియం మాత్రమే ఆస్వాదిస్తుంది. అదే విధంగా గురుకృపఆలకిస్తే అందదు; శిష్యుని పరిశుద్ధ అంత:కరణ మాత్రమే ఆస్వాదించగలదు.
**501** ఫలసాయం అందించగల మొలకకి మంచి విత్తనం కావాలి. విత్తనం మంచిది కావటంతో సరిపోదు. క్షేత్రం సారవంతమైనది కావాలి. అదే విధంగాగురుదేవులు చల్లే విత్తనాలు మొలకెత్తాలంటే శిష్యుని అంతరంగం సుక్షేత్రమై వుండాలి. గ్రహణశక్తి, ధారణ సమపాళ్ళలో మేళవింపబడాలి.
**502** సనాతనుడైన భగవానుడు పురాణకాలాలకి పరిమితుడు కాడు. మన హృదయాలలో భక్తి కదలగానే మన నేత్రాల ముందు ప్రత్యక్ష మవుతాడు.